

‘ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 80

మంగళవారం 11-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘సూపర్‌–8’కు దక్షిణాఫ్రికా

బంగ్లాదేశ్‌పై నాలుగు పరుగులతో విజయం

- 12లో



77,000 స్థాయి తాకి.., వెనక్కి

ఐటీ, ఫైనాన్స్‌ షేర్లలో లాభాల స్వీకరణ. ట్రేడింగ్‌లో కొత్త రికార్డులు

- 13లో



నేడే ఒడిశా బీజేఎల్పీ భేటీ

ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నేపథ్యంలో తదుపరి సీఎంను ఎన్నుకునేందుకు నేడు బీజేపీ శాసనసభాపక్ష భేటీ నిర్వహిస్తున్నారు.

- వివరాలు 6లో



13 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు

దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జూలై 10న ఉప ఎన్నికలు జరుపుతామని ఈసీ ప్రకటించింది.

- వివరాలు 6లో



సిక్కిం సీఎంగా ప్రేమ్‌ సింగ్‌

సిక్కిం సీఎంగా సిక్కిం క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్‌ సింగ్‌ తమాంగ్‌ వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు.

- వివరాలు 6లో



ఫ్రాన్స్‌ పార్లమెంట్‌ రద్దు

ఫ్రాన్స్‌ పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు మేక్రాన్‌ ప్రకటించారు. వచ్చే 20 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

- వివరాలు 6లో



సోమవారం ప్రధాని నివాసంలో జరిగిన తొలి కేబినెట్‌ భేటీ

కీలక శాఖలన్నీ బీజేపీకే..

సీనియర్లకు మళ్లీ అవే శాఖలు... కేబినెట్‌ కూర్పుపై మోదీ ముద్ర

షాకు హోం, రాజ్‌నాథ్‌కు రక్షణ, నిర్మలకు ఆర్థికం

- జైశంకర్‌కు విదేశాంగం, గడ్కరీకి రోడ్లు, హైవేలు
- వైష్ణవ్‌కు ప్రమోషన్‌.. రైల్వే, ఐటీతో పాటు సమాచారం
- శివరాజ్‌కు ప్రాధాన్యం.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి
- నడ్డా, ఖట్టర్‌లకూ రెండేసి ప్రధాన శాఖల బాధ్యతలు
- జేడీయూకు పంచాయతీ, జేడీఎస్‌కు ఉక్కు, సేనకు ఆయుష్‌
- రామ్మోహన్‌కు విమానయానం
- వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు (సహాయ)
- పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్‌ (సహాయ)

6 లో

కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖ

బండి సంజయ్‌కి హోం శాఖ (సహాయ)

మంత్రులు–శాఖలు

- వివరాలు 6లో



‘పీఎం కిసాన్‌ నిధి’పై తొలి సంతకం

3 కోట్ల ఇళ్ల నిర్మాణం

కేబినెట్‌ తొలి భేటీలో నిర్ణయం

- వివరాలు 6లో

రుణమాఫీ ‘లెక్క’ తీయండి!

రైతుల జాబితా, రుణాల వివరాలు సిద్ధం చేయండి

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- రుణమాఫీకి విధి విధానాలు రూపొందించండి
- అవసరమైన నిధులు, ఇతర వివరాలతో ప్రణాళిక సిద్ధం చేయండి
- పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు లబ్ధి కలిగేలా ఉండాలి
- ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరాలని స్పష్టీకరణ



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, వేం నరేందర్‌రెడ్డి, సీఎస్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రైతుల పంట రుణాలు మాఫీ చేయడానికి అవసరమైన లెక్క అంతా సిద్ధం చేయాలని, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేసి తీరాల్సిందేనని పేర్కొన్నారు. పంట రుణాల మాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకారశాఖ అధికారులతో రేవంత్‌ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రూ.2 లక్షల వరకు

మిగతా 3వ పేజీలో ▶

త్వరలోనే విద్యా కమిషన్‌

- రాష్ట్రంలో విద్యారంగ సమస్యలకు సత్వర పరిష్కారం: సీఎం
- టెన్త్‌లో పది జీపీఏ వచ్చిన విద్యార్థులకు ఇంటర్‌లో ఉచితంగా అడ్మిషన్లు... ప్రభుత్వ స్కూళ్లలో సెమీ రెసిడెన్షియల్‌ విధానం అందుబాటులోకి..
- రూ.2 వేల కోట్లతో పాఠశాల భవనాలకు మరమ్మతులు
- రాష్ట్రంలో వ్యవసాయ కమిషన్‌ కూడా ఏర్పాటు చేస్తాం

3 లో

న్యూస్‌రీల్‌


‘మిషన్‌ 100 డేస్‌ ఎజెండా’తో ముందుకు



మోదీ నేతృత్వంలో ‘మిషన్‌ 100 డేస్‌ ఎజెండా’తో ముందుకెళ్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బొగ్గు, గనుల శాఖలు దేశానికి ఆదాయాన్ని సమకూర్చేవని, దేశాభివృద్ధిలో బొగ్గుది కీలక పాత్ర అని అన్నారు.

- వివరాలు 2లో

దేశంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయి



మోదీ పాలనలో దేశంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయని గవర్నర్‌ రాధాకృష్ణన్‌ అన్నారు. దేశానికి వ్యవసాయ రంగం కీలకమని, మానవ సమాజం మనుగడకు వ్యవసాయమే ప్రధాన ఆధారం అని ఆయన చెప్పారు.

- వివరాలు 14లో


నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం



నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ఆ బ్యాంకు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు 14 మంది డైరెక్టర్లు జిల్లా సహకార అధికారి కిరణ్‌కు నోటీసు అందజేశారు.

- వివరాలు 2లో

‘విద్యుత్‌’పై విచారణ ముమ్మరం



గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తీసుకున్న విద్యుత్‌ సంబంధిత నిర్ణయాలపై విచారణ ప్రక్రియను జస్టిస్‌ ఎల్‌.నరసింహారెడ్డి కమిషన్‌ ముమ్మరం చేసింది. ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కోల మాజీ సీఎండీ కమిషన్‌ ముందు హాజరై వాదనలు వినిపించారు.

- వివరాలు 14లో

ఇదండీ సంగతి



ప్రభుత్వ ఏర్పాటులో సహాయం చేస్తే సహాయ మంత్రిస్తారా అని నిలదీస్తున్నార్సార్‌!

మూడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో చురుగ్గా నైరుతి రుతుపవనాలు

- పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానలకు అవకాశం
- ఉరుములు, ఈదురు గాలులుంటాయన్న వాతావరణ శాఖ
- జీహెచ్‌ఎంసీ హెల్ప్‌డెస్క్‌ డయల్‌ 040–21111111, 9001136675



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణలో నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా ఉన్నాయి. నాలుగు రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వానలు, జల్లులు పడుతుండగా... మంగళ, బుధ, గురువారాల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. రుతుపవనాలు రాష్ట్రం మీదుగా సోమవారం మహారాష్ట్రలోని నాసిక్‌, సుకుమా తదితర ప్రాంతాలకు సైతం విస్తరించాయి. దీంతో అటు దక్షిణ మహారాష్ట్ర నుంచి తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌, దక్షిణ ఒడిశా, కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది. రాష్ట్రంలోని హైదరాబాద్‌ జిల్లాతో పాటు పరిసర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని తెలిపింది. యాదాద్రి–భువనగిరి, మేడ్చల్‌ మల్కాజిగిరి, ఖమ్మం, మహబూబాబాద్‌, నారాయణ్‌పేట, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో

మిగతా 3వ పేజీలో ▶

జాతీయ అధ్యక్షుడి నియామకం తర్వాతే...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన?

- ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచే ఒకరికి చాన్స్‌
- ఈటల పేరు దాదాపుగా ఖరారు !
- పోటీలో అర్వింద్‌, డీకే అరుణ, రఘునందన్‌, కేవీఆర్‌



సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా కొత్తనేతను నియమించాకే, రాష్ట్ర నూతన అధ్యక్షుడిని ప్రకటించే అవకాశాలున్నాయి. జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జేపీ.నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డిలను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకున్న విషయం తెలిసిందే. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అటు నడ్డాను, ఇటు కిషన్‌రెడ్డిని తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగించిన విషయం తెలిసిందే. ఇద్దరూ కేబినెట్‌లో ఉండటంతో వీరిస్థానంలో అధ్యక్ష బాధ్యతలు వేరే వారికి అప్పగించనున్నారు. కర్ణాటకతో పాటు రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలని

మిగతా 2వ పేజీలో ▶

పరాకాష్టకు విధ్వంసకాండ

ఏపీలో రెచ్చిపోయి దాడులు చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

- ఏ తప్పూ చేయకపోయినా వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌
- ఇళ్లపై, ప్రభుత్వ కార్యాలయాలపై కొనసాగుతున్న దాడులు
- ఇదేమని ప్రశ్నిస్తే హత్యాయత్నాలు.. కిడ్నాప్‌లు
- చితకబాది బలవంతంగా క్షమాపణలు చెప్పిస్తున్న వైనం
- వర్సిటీ వీసీలపై దౌర్జన్యం.. బలవంతంగా విగ్రహాల తొలగింపు
- చంద్రబాబు, లోకేశ్‌ల లక్ష్యం.. ఆటవిక రాజ్యం
- వీరిద్దరి కనుసైగ మేరకే కవ్వింపులు..



అనంతపురం జిల్లా కురవల్లిలో గ్రామ సచివాలయాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయి గొడవలు కొనసాగిస్తున్నారు. దాడులు చేయడం తమ జన్మ హక్కు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికారం దక్కింది దౌర్జన్యం చేయడానికే అని చాటి చెబుతున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల తీరు విస్తుగొలుపుతోంది. పట్టపగలు కర్రలు, రాళ్లు, రాడ్లతో వీరంగం వేస్తున్నారు. ఊరూరా విగ్రహాలను, శిలా ఫలకాలను ధ్వంసం

మిగతా 10వ పేజీలో ▶

బరాజ్‌లపై విచారణ స్పీడప్‌!



- ముగ్గురు ఈఎన్సీలు సహా ఏడుగురు ఇంజనీర్లను ప్రశ్నించిన జస్టిస్‌ చంద్రఘోష్‌
- నేడు మరో 18 మంది ఇంజనీర్లను విచారించనున్న కమిషన్‌
- రేపు బరాజ్‌ల నిర్మాణ సంస్థల ప్రతినిధుల విచారణ

సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రక్రియను జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌ వేగిరం చేసింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్సీ (జనరల్‌) సి.మురళీధర్‌, రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, బరాజ్‌ల డిజైన్లను రూపొందించిన సెంట్రల్‌ డిజైన్స్‌ ఆర్గనైజేషన్‌ (సీడీఓ) మాజీ చీఫ్‌ ఇంజనీర్‌/రిటైర్డ్‌ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి, చీఫ్‌ ఇంజనీర్‌ చంద్రశేఖర్‌, ఎస్‌ఈ బస్వరాజ్‌.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లుగా వాటి నిర్మాణాన్ని పర్యవేక్షించిన యాదగిరి, ఓంకార్‌ సింగ్‌లను సోమవారం జస్టిస్‌ చంద్రఘోష్‌ బీఆర్‌కేఆర్‌ భవన్‌లోని తన కార్యాలయానికి పిలిపించి విడివిడిగా విచారించారు. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై ప్రశ్నించారు. ‘బరాజ్‌ల నిర్మాణ స్థలాలను ఎవరు నిర్ణయించారు? స్థలాల ఎంపికకు ముందు భూభౌతిక పరీక్షలు నిర్వహించారా? బరాజ్‌లకు డిజైన్లు, డ్రాయింగ్స్‌ ఎవరు రూపొందించారు? తర్వాత డిజైన్లలో

మిగతా 2వ పేజీలో ▶

హడావుడిగా అనుమతి.. వెంటనే నిలిపివేత

బీర్ల కంపెనీల విషయంలో ఎక్సైజ్‌ తీరుతో విమర్శలు

- రూ.1,500 కోట్ల బకాయిలు చెల్లించకపోతే బీర్లు సరఫరా చేయలేమన్న పాత బ్రూవరీలు
- గుట్టు చప్పుడు కాకుండా ఐదు కొత్త కంపెనీలకు అధికారుల అనుమతులు

సాక్షి, హైదరాబాద్‌: బీర్ల తయారీ కంపెనీలకు, సర్కారుకు మధ్య వారధిగా ఉండి ఎలాంటి సమస్య రాకుండా చూడాల్సిన ఎక్సైజ్‌ శాఖ ఉన్నతాధికారులు ప్రతిష్టకు పోయి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చారనే చర్చ జరుగుతోంది. బీర్ల తయారీ కోసం రాష్ట్రంలో అనుమతి పొందిన పాత కంపెనీలతో సమన్వయం చేసుకోకుండా.. కొత్త కంపెనీలకు అనుమతులిచ్చి, ఆ తర్వాత సదరు అనుమతులను నిలిపివేసిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికారుల తీరుతో రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడే పరిస్థితి తలెత్తింది. అన్ని డిపోల్లో కలిపి కనీసం 15 రోజుల స్టాక్‌ ఉండాల్సి ఉండగా, కేవలం రెండున్నర రోజులకు సరిపడా మాత్రమే నిల్వ ఉండడం గమనార్హం.

పాత బకాయిలే తలనొప్పి

బీర్లు, మద్యం తయారీ కంపెనీలు బేవరేజెస్‌ కార్పొరేషన్‌కు మద్యం ఇచ్చిన తర్వాత వాటిని డిపోల ద్వారా రిటైలర్లకు అమ్మిన 45 రోజుల్లోగా సదరు తయారీ కంపెనీలకు బేసిక్‌ ప్రైస్‌, ఎక్సైజ్‌ డ్యూటీలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కానీ గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఈ నిధులు సరిగా చెల్లించకపోవడంతో బకాయిలు రూ.1,500 కోట్లకు చేరాయి. అయితే

మిగతా 3వ పేజీలో ▶

హోటల్ బిజినెస్ డల్

ఇటీవల దాడులతో 30 శాతం తగ్గిన ఆహార ప్రియులు

- ఆన్‌లైన్ బిజినెస్‌పై కూడా ఎఫెక్ట్
- సగం హోటళ్లలో నాణ్యత లేని ఆహారం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హోటల్ ఫుడ్‌పై వినియోగదారుల్లో నమ్మకం పోయింది. హైదరాబాద్ సహా తెలంగాణలో పేరున్న హోటళ్లు, రెస్టారెంట్లు కూడా నాసిరకం ఆహారం అందిస్తున్నాయని తేలడంతో బయటి ఆహారం తినడానికి ప్రజలు ఇష్టపడటం లేదు. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని ఫుడ్‌సేఫ్టీ అధికారుల అంచనా ప్రకారం ఈ దాడుల అనంతరం ఏకంగా 30 శాతం హోటల్ బిజినెస్ తగ్గింది. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ సంస్థల ద్వారా ఫుడ్ డెలివరీ కూడా భారీగా తగ్గిందని తెలుస్తోంది.

ఆన్‌లైన్ డెలివరీల ద్వారా మరింత నాసిరకం ఫుడ్ సరఫరా

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో చాలా వరకు పరిశుభ్రతలోపం, ఆహార పదార్థాల్లో నాణ్యత లేమి స్పష్టంగా కనిపించినట్లు సమాచారం. పాడైపోయి, కాలంచెల్లిన ఆహార పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో పేరుమోసిన హోటళ్లు, బేకరీలు, ఐస్‌క్రీం సెంటర్లున్నాయి. ప్రముఖ హోటళ్లలో పాడైపోయిన ఆహారపదార్థాలు వాడటమే కాకుంటే ఫుడ్ సేఫ్టీ రూల్స్ కూడా సరిగ్గా పాటించడం లేదు. ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు విడుదల చేసిన జాబితా ప్రకారం క్రీమ్‌స్టోన్, న్యాచురల్స్ ఐస్‌క్రీమ్, కరాచీ బేకరీ, కేఎఫ్‌సీ, రోస్టరీ కాఫీహౌస్, షాగౌస్, కామత్ హోటల్, 36 డౌన్‌టౌన్ బ్రూపబ్, మాకౌ కిచెన్ అండ్ బార్, ఎయిర్‌లైవ్, టాకోబెల్, అహా దక్షిణ్, సిజ్జిలింగ్ జో, ఖాన్‌సాబ్, హోటల్ సుఖ్‌సాగర్, జంబో కింగ్ బర్గర్స్, రత్నదీప్ స్టోర్, రెస్ట్ ఓ బార్ వంటి



అనేక హోటళ్లు, బేకరీలు ఉన్నాయి. వాటిల్లో ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండటం, గడువు తీరిన పదార్థాలతో వండటం వంటి వాటిని గుర్తించారు. రోజుల తరబడిగా నిల్వ ఉంచిన మాంసంతో వండటం వంటివీ గుర్తించారు. హైదరాబాద్‌లో సగం హోటళ్లలో నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారని, అపరిశుభ్రమైన కిచెన్ వంటివి ఉన్నాయని నిర్ధారించారు. కేసులు పెట్టి జరిమానాలు విధించడంతో పాటు శుభ్రత, నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయ్యారు. మరోవైపు నేరుగా హోటల్‌కు లేదా రెస్టారెంట్లకు వచ్చే వినియోగదారుల కంటే, ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ విషయంలో మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తేలింది. ఆన్‌లైన్ డెలివరీ సంస్థల ద్వారా అత్యంత నాసిరకమైన ఫుడ్ వినియోగదారులకు సరఫరా చేశారని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు.

దాడులేనా.. సీజ్ చేయరా...?

ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేసి ప్రజల్లో ఒకరకమైన భయం సృష్టించారు. అయితే కుటుంబసభ్యులతో సరదాగానో లేదా అవసరంరీత్యానో హోటళ్లకు వెళ్లే వినియోగదారులకు భరోసా కల్పించడంలో మాత్రం విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాడుల సమయంలో కుళ్లిపోయిన మాంసం, పాడైపోయిన ఆహారం వంటివి గుర్తించినా, తక్షణమే ఆయా హోటళ్లను ఎందుకు సీజ్ చేయడం లేదని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. కేవలం కేసులు పెట్టి వదిలేయడం, పద్ధతి మార్చుకోవాలని సమయం ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనమని వాపోతున్నారు.

భరోసా కల్పించకపోతే ఎలా?

హోటళ్లపై దాడులు చేశాక, వాటిపై తక్షణ చర్యలు తీసుకోకపోతే మార్పు రాదు. హోటళ్లలో ధైర్యంగా తినేలా వినియోగదారులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులతోపాటు హోటల్ యజమానులపైనా ఉంది. వేలాది రూపాయలు వసూలు చేసే పెద్ద హోటళ్లలో నాణ్యమైన ఆహారం పెట్టాలని డిమాండ్ చేసే అధికారం ఉంటుంది. అవసరమైతే కిచెన్‌లోకి వెళ్లి చూసేలా వెసులుబాటు ఉండాలి. లేదంటే ఓపెన్ కిచెన్ కానీ, సీసీ టీవీ కెమెరాల ద్వారా కిచెన్‌లో ఉండే పదార్థాలు, వండే విధానం వంటి వాటిని తినేవారు నేరుగా స్క్రీన్‌పై చూసే వెసులుబాటు కల్పించాలి. – శ్రీనివాస్ శెట్టి, హైదరాబాద్

సీజ్ చేసే అధికారం మాకు లేదు

హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేశాక. వాటిని సీజ్ చేసే అధికారం మాకు లేదు. కేసులు పెట్టడం, జరిమానాలు విధించడం వరకే మాపని. అయితే తక్షణమే సీజ్ చేసే అధికారం పురపాలకశాఖకు ఉంటుంది. వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. హోటల్, రెస్టారెంట్ల యజమానులను పిలిపించి నిబంధనలు పాటించాలని ఆదేశిస్తున్నాం. – ఆర్‌వీ కర్ణన్, కమిషనర్, ఫుడ్ సేఫ్టీ

పెద్ద హోటళ్లే ఇలా చేయడం విస్మయం కలిగిస్తుంది

పెద్ద హోటళ్లే నాసిరకం ఫుడ్ పెట్టడంతో డాక్టర్లతో సహా వినియోగదారులంతా విస్మయానికి గురయ్యారు. వీకెండ్‌లో కుటుంబాలతో వెళాదామనుకునే వారికి షాక్ ఇచ్చారు. నాసిరకం, కలర్స్ వాడిన ఆహారం, కుళ్లిపోయిన మాంసం, అపరిశుభ్రత వల్ల దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి. కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని ఆహార ప్రియులకు భరోసా కల్పించాలి. – డాక్టర్ అనిల్‌కుమార్ మన్నవ, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి



అన్నారం బరాజ్ వద్ద మట్టి పరీక్షలు

కాళేశ్వరం: అన్నారం బరాజ్‌లో ఏర్పడిన సీపేజీకి కారణాలను తెలుసుకొనేందుకు అధికారులు సోమవారం బోర్‌వెల్ యంత్రాలతో రంధ్రాలు వేసి మట్టి నమూనా పరీక్షలు ప్రారంభించారు. బరాజ్‌లోని 28, 38, 35, 44 పియర్‌లలోని వెంట్‌ల వద్ద సీపేజీ ఏర్పడటం తెలిసిందే. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు బరాజ్‌లో 25 మీటర్ల లోతు వరకు బోర్‌వెల్ హోల్స్ వేస్తూ ఒకటిన్నర అడుగులకు ఒకసారి మట్టిని పరీక్షల నిమిత్తం సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన మట్టిని పుణేలోని ల్యాబ్‌కు తరలిస్తారని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. బరాజ్ మట్టి గట్టిదనాన్ని అక్కడ గుర్తించనున్నారు. మరోవైపు మేడిగడ్డ 7వ బ్లాక్‌లో షీట్ పైల్స్ పనులు, సీసీ బ్లాక్‌ల అమరిక, గేటు కటింగ్ పనులు జరుగుతున్నాయి. 21వ గేటు విడిభాగాలను తొలగించారు. ఇప్పటికే 7వ బ్లాక్‌లోని 15, 16, 17 గేట్లన్నీ పైకి ఎత్తడం తెలిసిందే. ఇక 19, 20, 21 గేట్లను పూర్తిగా తొలగించాల్సి ఉంది. మిగతా గేట్లు ఎత్తుతున్నారు.

బరాజ్‌లపై విచారణ స్పీడప్!

▶ మొదటి పేజీ తరువాయి

ఏమైనా మార్పులు చేశారా? నిర్మాణ సమయంలో నాణ్యత పర్యవేక్షణ చేశారా? ఆ బాధ్యతను ఎవరు చూశారు? నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ, పర్యవేక్షణ ఎవరు చూశారు? బరాజ్‌ల వైఫల్యానికి కారణాలేమిటి? డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ పూర్తి కాక ముందే నిర్మాణ సంస్థలకు వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లు ఎందుకు జారీ చేశారు?' వంటి అంశాలపై ఆయన వివరణ కోరినట్టు తెలిసింది. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జాయింట్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ తదితరులు విచారణకు హాజరై కమిషన్‌కు సహకరించారు.

నేడు 18 మంది ఇంజనీర్ల విచారణ..

నీటిపారుదల శాఖలోని సీడీఓ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్, కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో గతంలో పనిచేసిన/ప్రస్తుతం పనిచేస్తున్న మొత్తం 18 మంది ఇంజనీర్లను మంగళవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారించనున్నారు. ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావు, సీడీఓ చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్, మేడిగడ్డ బరాజ్ నిర్మాణాన్ని పర్యవేక్షించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతితోపాటు ఇతర కీలక ఇంజనీర్లు ఈ విచారణకు హాజరుకావాలంటూ కమిషన్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఇక బుధవారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ సంస్థలైన ఎల్ అండ్‌టీ, అఫ్కాన్స్, నవయుగ కంపెనీల ప్రతినిధులను కమిషన్ విచారించనుంది.

త్వరలో అసలు విషయాలు బయటికి..: జస్టిస్ చంద్రఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణం విషయంలో అసలు విషయాలు రానున్న రోజుల్లో బయటికి వస్తాయని జస్టిస్ పినాకి చంద్రఘోష్ తెలిపారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన క్లుప్తంగా మాట్లాడారు. బరాజ్‌ల నిర్మాణంపై ఇప్పటివరకు కమిషన్‌కు 54 ఫిర్యాదులొచ్చాయని, వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. విచారణ కమిషన్‌కు సమాచారం ఇవ్వడానికి వచ్చే ప్రతి ఒక్కరికి తనను కలిసే అవకాశం ఇస్తానని, వారి వాదన వింటానని తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక లోపాలపై విచారణ సాగుతోందని.. తర్వాత ఆర్థిక, ఇతర అవకతవకలపై విచారణ ప్రారంభిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు మేరకు జూన్ 30లోగా విచారణ పూర్తికాదని.. గడువు పొడిగింపుపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సమగ్రంగా అన్ని విషయాలు, వాస్తవాలు తెలుసుకోకుండా నివేదిక ఇవ్వడం సాధ్యం కాదన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించలేదంటూ కొందరు భూనిర్వాసితులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బరాజ్‌లకు సంబంధించిన అన్ని ఫైళ్లను ప్రభుత్వం సమర్పించిందని, వాటిని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. బరాజ్‌లపై విజిలెన్స్ జరిపిన విచారణ నివేదికను తమకు అందజేయాలని ఆ విభాగానికి లేఖ రాశామన్నారు.

కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

విభజన అంశాల అమలు, నిధుల సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మలకు శుభాకాంక్షలు. విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాల్సిందిగా కోరుతున్నాను'అని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

కేంద్ర మంత్రులు దేశాభివృద్ధికి కృషి చేయాలి: గుత్తా

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన నేతలు దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, శివరాజ్‌సింగ్ చౌహాన్, అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. వీరంతా భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు.

జాతీయ అధ్యక్షుడి నియామకం తర్వాతే...

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ టార్గెట్‌గా పెట్టుకుంది. ఏపీ, తమిళనాడు, కేరళలలో బలపడాలని కూడా బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది.

రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నేతకే అవకాశం ?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపీ, ఎమ్మెల్యేల్లో ఒకరికి అవకాశం ఉంటుందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఓసీ సామాజికవర్గానికి చెందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేఎల్పీనేతగా ఉన్న నేపథ్యంలో, రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీ సామాజికవర్గానికే చెందిన ఇస్తారని అంటున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ ఎజెండాతో బీజేపీ ప్రజల్లోకి వెళ్లింది. అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని హామీ కూడా ఇచ్చింది. త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థలు, ఆ తర్వాత వచ్చే ఏడాది ప్రారంభంలో జరగాల్సిన మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటడం అత్యవసరంగా పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు రాష్ట్ర అధ్యక్షుడిగా దాదాపుగా ఖరారైనట్టుగా పార్టీవర్గాల విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర రాజకీయాల్లో సుపరిచితుడైన నేతగా, బీసీలతోపాటు అన్నివర్గాల్లో గుర్తింపు ఉన్న వ్యక్తిగా, ఇరవై ఏళ్ల పాటు బీఆర్ఎస్‌లో నంబర్–2గా, మంత్రిగా ఈటలకున్న అనుభవం బీజేపీ బలోపేతానికి ఉపయోగపడుతుందని పార్టీ నాయకత్వం విశ్వసిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున సంస్థాగతంగా బలపడేలా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేలా పార్టీని సిద్ధం చేసుకునేందుకు ఉపయోగపడే నేతలకే అధ్యక్ష పదవి దక్కుతుందని భావిస్తున్నారు. అయితే పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీపడుతున్న వారిలో ఎంపీలు అర్వింద్, డీకే.అరుణ, రఘునందన్‌రావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ సీనియర్ నేతలు యెండల లక్ష్మీనారాయణ, కాసం వెంకటేశ్వర్లు మరికొందరు ఉన్నారు.

అమిత్ షాను కలిసిన ఈటల

పలువురు కేంద్ర మంత్రులతోనూ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. కేంద్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రులు అశ్వినీవైష్ణవ్, భూపేంద్రయాదవ్‌లతో కూడా భేటీ అయ్యారు.

'మిషన్ 100 డేస్ ఎజెండా'తో ముందుకు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- దేశాభివృద్ధిలో బొగ్గుది కీలకపాత్ర
- బొగ్గు, గనుల శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తా
- కీలక శాఖను కేటాయించిన ప్రధానికి ధన్యవాదాలు



ఢిల్లీలో కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'మిషన్ 100 డేస్ ఎజెండా'తో ముందుకు వెళతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బొగ్గు, గనుల శాఖలు దేశానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖ అని, దేశాభివృద్ధిలో బొగ్గుది కీలక పాత్ర అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు, గనుల శాఖ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం పెంచే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానని అన్నారు. దేశంలోనే కీలకమైన శాఖను తనకు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు

ప్రైవేటు రంగంలో చాలా సంస్థలు బొగ్గు గనుల వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నాయని, వారందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు వెలికితీత, ఎగుమతి, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై పనిచేయాల్సి ఉంటుందన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు తీసుకున్నాక పారదర్శకమైన విధానాలు తీసుకువచ్చారని, బొగ్గు తవ్వకం, సరఫరా, వినియోగంలో అవినీతి లేకుండా పనిచేశామని చెప్పారు. దేశ వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి కూడా పెరిగిందన్నారు. 2014కు ముందు దేశంలో విద్యుత్ కోతలుండేవని గుర్తుచేశారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తా

రాబోయే రోజుల్లో బొగ్గు కొరత లేకుండా విద్యుదుత్పత్తిని మరింత పెంచడంపై దృష్టి సారిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పెద్దల సలహాలు, సూచనలు తీసుకుని త్వరలో బాధ్యతలు స్వీకరిస్తానని చెప్పారు. బండి సంజయ్‌కి కేంద్ర హోంశాఖ (సహాయ మంత్రి), ఏపీ ఎంపీలకు ఇతర మంచి శాఖలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేల 'అనర్హత'పై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ, అసెంబ్లీ కార్యదర్శులు, ఎన్నికల కమిషన్‌తోపాటు ప్రైవేట్ ప్రతివాదులైన ముగ్గురు ఎమ్మెల్యేలకు మూడోసారి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. కడియం, వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టును ఆశ్రయించగా దానం నాగేందర్‌పై అనర్హత వేటు కోరుతూ మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వారిని అనర్హులుగా ప్రకటించాలని వారు కోరారు. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ–మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకొనేలా స్పీకర్‌ను ఆదేశించాలన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ చేపట్టారు.

రేవంత్ పిటిషన్‌పై విచారణ నిర్వహించండి

బీజేపీపై ఆరోపణల కేసులో ట్రయల్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన ప్రైవేట్ పిటిషన్ మెరిట్‌పై త్వరితగతిన విచారణ చేపట్టాలని నాంపల్లి కోర్టును హైకోర్టు ఆదేశించింది. వాదనలు విని త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 'బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు తొలగిస్తుందని.. రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ తప్పుడు వ్యాఖ్యలు చేశారు. దీనిపై విచారణ జరపాలని మే 10న స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశాం. దీన్ని రెండుసార్లు వాయిదా వేసిన జడ్జి మే 22న విచారణ చేపట్టారు. వివరాలు సమర్పించేందుకు మధ్యాహ్నానికి వాయిదా కోరగా అందుకు నిరాకరించారు. జూలై 6కు సుదీర్ఘ వాయిదా వేశారు. కేసు మెరిట్స్‌లోకి కూడా వెళ్లకుండా వాయిదా వేయడం చట్టవిరుద్ధం'అని పేర్కొంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ పిటిషన్‌ను వెంటనే అనుమతించేలా మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దేవినేని విజయ్‌కుమార్, ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణంగా ప్రైవేట్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని నోటీసు జారీ చేయడంతోపాటు ఆ అంశంపై దర్యాప్తు చేయాలని పోలీసులను ట్రయల్ కోర్టు ఆదేశించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. దాదాపు 3 నెలలపాటు వాయిదా వేయడం సరికాదన్నారు. మెరిట్స్‌పై వాదనలు వినాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తూ పిటిషన్‌లో విచారణను ముగించారు.

నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

జిల్లా సహకార అధికారికి నోటీసు అందజేసిన డైరెక్టర్లు



నల్లగొండ జిల్లా సహకార అధికారి కిరణ్‌కు నోటీసు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ఆ బ్యాంకు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ 14 మంది డైరెక్టర్లు తమ సంతకాలతో సోమవారం జిల్లా సహకార అధికారి కిరణ్‌కు నోటీసు అందజేశారు. చైర్మన్ పదవిని ఆశిస్తున్న బ్యాంకు డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో వారంతా ప్రత్యేక బస్సులో వెళ్లి సహకార అధికారిని కలిశారు. వారి అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానికి సమావేశం నిర్వహించాలంటే కనీసం 15 రోజులు గడువు ఇవ్వాల్సి ఉంది. దీంతో ఈ నెల 28 వరకు గడువు ఇచ్చారు. ఆ రోజు అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నారు. బ్యాంకులో 19 మంది డైరెక్టర్లు ఉండగా 14 మంది నోటీసుపై సంతకాలు చేశారు. బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి విదేశాల్లో ఉండటంతో ఆయన సంతకం చేయలేదు. దీంతో ఆయనతో కలుపుకొని 15 మంది అవుతుండటంతో అవిశ్వాసం నెగ్గుతుందని చెబుతున్నారు. త్వరలోనే నల్లగొండ డీసీసీబీకి కుంభం శ్రీనివాస్‌రెడ్డి కొత్త చైర్మన్ అయ్యే అవకాశముంది.

రాష్ట్ర అధ్యక్ష పదవులను బీసీలకే ఇవ్వాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: బీసీల్లో వస్తున్న రాజకీయ చైతన్యాన్ని ప్రధాన పార్టీలు గమనించి.. త్వరలో ఎంపిక కానున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ అధ్యక్ష పదవులను బీసీ నేతలకే ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నలుగురు బీసీలకు మంత్రులుగా అవకాశాలు రాగా.. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికి కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే బీసీలకు దక్కాయని, డిప్యూటీ సీఎం అవకాశాన్ని కూడా బీసీలకు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. బీసీల ఆకాంక్షలను, అవకాశాలను అభ్యున్నతిని విస్మరిస్తే రాజకీయ పార్టీలకు అధోగతి తప్పదని హెచ్చరించారు.

ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ రైతులకు అండగా ఉంటుందని సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులకు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ భూములు, కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని, తమ ప్రభుత్వం అలాంటి పనులు చేయదన్నారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ జరగ్గానే బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు తన రాజీనామాను స్పీకర్ ఫార్మాట్‌లో సిద్ధం చేసుకుని ఉంచుకోవాలని వ్యాఖ్యానించారు.

కేంద్ర కేబినెట్‌తో 'విమానం' మోత!

- తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వెళ్లిన నేతలు, ప్రముఖులు
- విమానం టికెట్లకు విపరీతంగా డిమాండ్.. రెండు, మూడు రెట్లు పెరిగిన చార్జీలు
- రైళ్లలోనూ భారీగా వెయిటింగ్ లిస్టులతో సీట్లు దొరకని పరిస్థితి
- హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, వైజాగ్, రాజమండ్రిలకు తిరిగొచ్చేందుకు తిప్పలు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల ప్రమాణస్వీకారానికి అన్ని రాష్ట్రాల నుంచి నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఎంపీలకు కేబినెట్‌లో చోటు దక్కడంతో.. వారి అనుచరులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలోనే హస్తినకు పయనమయ్యారు. ఇంతవరకు బాగానే ఉన్నా వారంతా తిరిగిరావడానికి మాత్రం ఇక్కట్లు మొదలయ్యాయి. విమానాలకు విపరీతంగా డిమాండ్ పెరగడంతో.. ఎయిర్‌లైన్స్ సంస్థలు చార్జీలను రెండు, మూడింతలు పెంచేశాయి. మరోవైపు రైళ్లలోనూ విపరీతంగా వెయిటింగ్ లిస్టులతో సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది.

ఎక్కడికి వెళ్లాలన్నా..

తెలుగు రాష్ట్రాల నుంచి ఢిల్లీ వెళ్లేప్పుడు రూ.10–12 వేలు టికెట్ ధర ఉండగా.. తిరిగి వచ్చేందుకోసం టికెట్ల ధరలు రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకు టికెట్ చార్జీలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్, విజయవాడ (గన్నవరం), రేణిగుంట (తిరుపతి), విశాఖపట్నం, రాజమహేంద్రవరం ఇలా ఎక్కడికైనా ఇదే పరిస్థితి. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు దాదాపు 20కిపైగా విమాన సర్వీసులు.. విజయవాడ, రేణిగుంట(తిరుపతి), విశాఖపట్నం, రాజమహేంద్రవరంలకు రెండు, మూడు చొప్పున సర్వీసులు ఉన్నాయి. ఒకట్రెండ్ స్టాప్‌లతో మరో పది వరకు సర్వీసులు ఉన్నాయి. వీటన్నింటిలోనూ చార్జీలు పెరిగిపోయాయి.

రైళ్లలో సీట్ల కోసం 'ఈక్యూ'రిక్వెస్టులు

విమాన టికెట్ భారం ఎక్కువైందని భావించేవారు, టికెట్ దొరకనివారు.. రైళ్లలో తిరిగి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ సికింద్రాబాద్, విజయవాడ ప్రాంతాలకు ఉన్న ఏడెనిమిది రైలు సర్వీసుల్లో స్లీపర్‌క్లాస్‌లో భారీగా వెయిటింగ్ లిస్టులు ఉంటే.. ఏసీ కోచ్‌లలో సీట్లు అందుబాటులోనే లేవని చూపిస్తోంది. దీంతో రైలు టికెట్ కన్‌ఫర్మేషన్ కోసం ఈక్యూ (ఎమర్జెన్సీ కోటా) లెటర్ ఇవ్వాలంటూ ఎంపీలను కోరుతున్నారు. అయినా సీట్లు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. సోమవారం ఉదయం వెళ్లాల్సినవారు శనివారమే ఈక్యూ లెటర్ ఇచ్చినా.. టికెట్లు కన్‌ఫర్మ్ కాక ఢిల్లీలోనే ఆగిపోయారు.

ఢిల్లీలో తెలుగు నేతల సందడి

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు శుభాకాంక్షల వెల్లువ
- నేతలను కలిసేందుకు కార్యకర్తలు, అభిమానుల క్యూ



ఢిల్లీలో సంజయ్‌ను సత్కరిస్తున్న బీజేపీ శ్రేణులు

సాక్షి, న్యూఢిల్లీ: గత రెండు మూడు రోజులుగా ఢిల్లీలో తెలుగు నేతలు సందడి చేస్తున్నారు. కేంద్రంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర మంత్రుల నివాసాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నేతలు క్యూ కడుతున్నారు. మోదీ 3.0 ప్రభుత్వంలో రెండోసారి కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి, తొలిసారి బండి సంజయ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ బీజేపీ ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, ఏపీ బీజేపీ నేతలు భానుప్రకాశ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు కార్యకర్తలతో ఇద్దరు కేంద్రమంత్రుల నివాసాలు కిటకిటలాడాయి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి వర్గంలో చోటుదక్కుతుందని వార్తలు వెలువడిన రోజు నుంచే ఢిల్లీలోని వారి నివాసాలు సందడిగా మారాయి. అలాగే ప్రధాని ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు కూడా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించే అవకాశం లభించని వారి కోసం కిషన్‌రెడ్డి నివాసంలో ఒక భారీ షెడ్డు నిర్మించి అందులో ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రతిరోజూ అతిథుల కోసం భోజనాలు ఏర్పాటు చేశారు. మరోవైపు.. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన ధర్మపురి అర్వింద్‌లు ఢిల్లీలోనే ఉన్నారు. వారిని కూడా అభినందించేందుకు ప్రాంతాలకు అతీతంగా నేతలు, కార్యకర్తలు అభిమానులు వెల్లువెత్తారు. దీంతో అర్వింద్ నివాసం, ఈటల రాజేందర్ మకాం వేసిన మాజీ ఎంపీ బీబీ పాటిల్ నివాసాలు సందడిగా మారాయి.

బీజేపీ ఓబీసీ మోర్చా సంబరాలు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రంలో మరోసారి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం ఏర్పడిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. బీసీ వర్గాలకు చెందిన మోదీ ప్రధాని కావడం వల్ల 27 మంది ఓబీసీ, 10 మంది ఎస్సీ, ఐదుగురు చొప్పున ఎస్టీ, మైనారిటీవర్గాల చెందిన వారికి కేంద్ర మంత్రులుగా అవకాశం లభించిందన్నారు. వరుసగా మూడోసారి బీసీ సామాజిక వర్గం నాయకుడు ప్రధాని కావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం నుంచి జి.కిషన్‌రెడ్డితోపాటు బండి సంజయ్‌కి కేంద్ర మంత్రులుగా అవకాశం కల్పించడంతో తెలంగాణ అభివృద్ధికి దోహదం కలుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు పంచి, టపాకాయలు కాల్చి తమ ఆనందాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఉపాధ్యక్షులు సురేందర్ యాదవ్, సదానంద్ ముదిరాజ్, ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేశ్, మహిళా సెల్ కన్వీనర్ లక్ష్మి, వివిధ జిల్లాల మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

17 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల నియామకం

నియామక పత్రాలు అందజేసిన మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పలువురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా (జోన్ – ఐ నుంచి – 5, జోన్ – ఐఐ నుంచి – 12 మంది) పదిహేడు మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, నకిలీ మందుల తయారీదారులపై ఉక్కు పాదం మోపుతామన్నారు. నకిలీ మందుల తయారీని అడ్డుకోవడం, అక్రమాలకు పాల్పడేవారిపై నిరంతర పర్యవేక్షణ కోసం కొత్తగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాన్ని చేపట్టామన్నారు. నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులకు మంత్రి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఆర్వీ కర్ణన్, జాయింట్ డైరెక్టర్ రామ్‌దాస్‌లు పాల్గొన్నారు.

గురుకులాల్లో సాధారణ బదిలీలు నిర్వహించాలి

సీఎంకు గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి సాధారణ బదిలీలు చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపా ధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ బాలరాజు, ఎన్. దయాకర్ తదితరులు వినతిపత్రాన్ని అందించారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో ఆరేళ్లుగా బదిలీలు చేపట్టలేదని, 2018లో జరిగిన మెజార్టీ ఉద్యోగులకు గరిష్ట పరిమితి సర్వీసు పూర్తి చేసుకోకపోవడంతో స్థానచలనం కలగలేద ని తెలిపారు. కొత్తగా ఉద్యోగుల నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో ఆలోపే బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని కోరారు.

నేడు ఎడ్‌సెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల బీఈడీ కోర్సుకు సంబంధించిన ఎంట్రన్స్ (ఎడ్‌సెట్) ఫలితాలను మంగళవారం విడుదల చేయనున్నారు. బీఈడీలో ప్రవేశానికి మే 23న రాష్ట్రవ్యాప్తంగా ఎడ్‌సెట్‌ను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. ఫలితాలు 11వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు వెల్లడించనున్నట్లు సెట్ కన్వీనర్ మృణాళిని తాళ్ల తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎంఏ కోర్సులో ప్రవేశాలు

40 వేలకు చేరుకున్న దరఖాస్తులు.. 17న ఆఖరు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలకు వివిధ డిగ్రీలతో పాటు ఎంబీబీఎస్, బీడీఎస్, ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు కూడా అర్హులని టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సులకు ఇంత వరకు 40 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంత వరకు దరఖాస్తు చేయని విద్యార్థులు ఈనెల 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షల్లో పలు చోట్ల కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలమైందని, లీకేజీలో బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. ఒకే సెంటర్‌లో 8 మందికిపైగా విద్యార్థులకు 720, 719, 719 మార్కులు రావడం అనుమానాలకు దారి తీసిందని, ఒక ప్లాన్ ప్రకారంగానే ఇదంతా జరిగిందని ధ్వజమెత్తారు. ఇంత జరిగినా బీజేపీ నేతలు విచారణకు ఎందుకు కోరడం లేదని దయాకర్ నిలదీశారు.

‘మీట్’ మై ఫ్రెండ్

తెలంగాణలో జాతీయ సగటును మించిన మాంసం వినియోగం

ప్రపంచంలోనే అత్యధిక ధర పలుకుతున్నదీ మన దగ్గరే..



సాక్షి, హైదరాబాద్:

పెళ్లి.. పుట్టినరోజు ఇలా ఏ దావత్ చేసినా.. ముక్కలుండాలె... ముక్కలేయకపోతే బంధాలే ముక్కలైపోతాయని బంధు 'బలగం'మస్తుగా ఉన్న ప్రతీ కుటుంబానికీ తెలుసు. మటన్ ఓ ట్రెడిషన్‌గా మారిపోయి దేశంలోనే మన రాష్ట్రాన్ని టాప్‌ప్లేస్‌కు తీసుకెళ్లింది. జాతీయసగటు కన్నా ఎక్కువగా మాంసాన్ని మనవారు లాగించేస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం

దేశంలో 70 శాతానికిపైగా ప్రజలు మాంసాహారాన్ని ఇష్టపడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో తేలింది. దేశంలో 16.6శాతం మంది పురుషులు 29.4 శాతం మంది మహిళలు తప్ప, మిగిలిన వారంతా నాన్ వెజ్ ప్రియులేనని, ప్రతీ ముగ్గురిలో ఇద్దరు మాంసం తినేవారేనని తేల్చింది.

మనమే టాప్...

దేశవ్యాప్తంగా మాంసాహారం తినే రాష్ట్రాల్లో 98.7 శాతంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, పశ్చిమబెంగాల్ 98.55, ఏపీ 98.25 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక కేజీ మాంసం ధర రూ.500 నుంచి రూ.600 మధ్య ఉండగా, మన దగ్గర రూ. 800 నుంచి రూ.1,000 వరకూ ఉంది. తెలంగాణవాసులు వారానికి కనీసం మూడుసార్లు మాంసాహారాన్ని తింటున్నారని ఓ సర్వే వెల్లడించింది. ప్రతీ వ్యక్తి సంవత్సరానికి సగటున రూ.58,000 మాంసం కోసం వెచ్చిస్తున్నారని ఓ వెటర్నరీ అధికారి తెలిపారు.

- రాష్ట్రంలో 2014–15లో సగటున ఒక్కో వ్యక్తి సంవత్సరానికి 12.95 కిలోలు తినగా, అది 2021–22 నాటికి 21.17 కిలోలకు పెరిగింది. ఇప్పుడు ఆ సగటు 28.5 కిలోలకు చేరింది. ఇదే సమయంలో జాతీయ సగటు మాంసం వినియోగం దాదాపుగా 7.1 కిలోలు పైచిలుకు మాత్రమే కావడం గమనార్హం.
- మన దగ్గర వినియోగిస్తున్న 28 కిలోల్లో దాదాపు 8 కిలోలు గొర్రె/మేక మాంసం కాగా (జాతీయ సగటు 3.5 కిలోలు) కాగా, ఇందులో స్వల్పంగా బీఫ్, పంది మాంసం మిగిలినది చికెన్.
- జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి ఒక మనిషి 11 కిలోల వరకూ వినియోగించవచ్చు. గొర్రె/మేక మాంస వినియోగం ఎక్కువగా ఉన్న మన దగ్గర ఉత్పత్తి సరిపోక ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. బయట నుంచి వచ్చే మాంసం ఏదైనా కారణాల వల్ల ఆగిపోతే మాంసం కేవలం 10 రోజులు రాకపోయినా మాంసం ధర రూ.1000 పైబడుతుందని అంచనా.

మటన్ క్యాపిటల్ హైదరాబాద్

రాష్ట్రంలో ఉత్పత్తి చేసి, దిగుమతి చేసుకునే మాంసంలో ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే వినియోగిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి సరఫరా అయ్యే మాంసాన్ని హైదరాబాద్‌లో నిల్వ చేసి తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలకు సరఫరా చేయడంతో హైదరాబాద్ మాంసం సరఫరాకు కేంద్రంగా మారింది.

మరోవైపు హోటళ్లు, రెస్టారెంట్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో పాటు వ్యక్తిగత వినియోగం కోసం కూడా కలిపి హైదరాబాద్‌లో ప్రతిరోజూ సుమారు 18,000కు పైగా గొర్రెలను వధిస్తున్నట్టు అంచనా.

రోజుకు 50వేల వరకూ జంతువధ...

తెలంగాణలో చెంగిచెర్ల, జియాగూడ, బోయిగూడ, బహదూర్‌పురా, అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో కబేళాలు ఉన్నాయి. స్థానిక వినియోగం, ఎగుమతుల కోసం వేర్వేరుగా వీటిని వినియోగిస్తున్నారు. వీటిలో అన్ని రకాల మాంసాలు కలిపి ఒక్కరోజులో 6 వేల నుంచి 7 వేల వరకూ రాష్ట్రవ్యాప్తంగా 45వేల నుంచి 50వేల దాకా జంతువులను వధిస్తారు. ఇందులో సగంపైనే హైదరాబాద్ వినియోగానికే కేటాయిస్తున్నారు.

స్వయం సమృద్ధి దిశగా...

గొర్రెల ఉత్పత్తిలో మనం తొలిస్థానంలో, మాంసం ఉత్పత్తి, వినియోగం రెండింటిలో మనం ముందున్నాం. దేశంలో బీఫ్ ఎగుమతుల ద్వారా మనకు అత్యధిక ఆదాయం లభిస్తోంది. అదే సమయంలో గొర్రె/మేక మాంసం దిగుమతులు తగ్గించేందుకు, స్వయం సమృద్ధి సాధించే దిశగా పలు ప్రయత్నాలు ముమ్మరం చేశాం.

–డా.బర్బుద్ధి, డైరెక్టర్, నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎమ్ఆర్ఐ)

ఉత్పాదకత పెంపుపై దృష్టి...

రాష్ట్రంలో మాంస వినియోగం రానురానూ పెరుగుతోంది. డిమాండ్‌ను అందుకునే ప్రయత్నాల్లో భాగంగా ప్రస్తుతం ఒక గొర్రె/మేక ద్వారా వస్తున్న మాంసం పరిమాణాన్ని పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటికి సరైన ఆహారం అందించడం ద్వారా దిగుబడి రెట్టింపు చేసే దిశగా కృషి చేస్తున్నాం.

–పి.బస్వారెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఎన్ఎమ్ఆర్ఐ



టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

త్వరలోనే విద్యా కమిషన్

- రాష్ట్రంలో విద్యారంగ సమస్యలకు సత్వర పరిష్కారం: సీఎం రేవంత్
- టెన్త్‌లో పది జీపీఏ వచ్చిన విద్యార్థులకు ఇంటర్‌లో ఉచితంగా అడ్మిషన్లు
- ప్రభుత్వ స్కూళ్లలో సెమీ రెసిడెన్షియల్ విధానం అందుబాటులోకి..
- రూ.2 వేల కోట్లతో పాఠశాల భవనాలకు మరమ్మతులు
- రాష్ట్రంలో వ్యవసాయ కమిషన్ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యా రంగ సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరలోనే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. టెన్త్‌లో పదికి పది జీపీఏ వచ్చిన విద్యార్థులకు ఇంటర్‌లో ఫీజుల్లేకుండా అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరై.. టెన్త్‌లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ తరపున ప్రతిభా పురస్కారాలు అందించారు. అనంతరం రేవంత్ మాట్లాడారు. మౌలిక వసతులు తక్కువగా ఉన్నా.. కార్పొరేట్ స్కూళ్లతో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు పోటీపడటం అభినందనీయమని చెప్పారు. ఇప్పుడున్న సివిల్ సర్వీస్ అధికారుల్లో చాలా మంది ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని.. తనతోపాటు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా సర్కారీ స్కూల్లోనే చదివామని రేవంత్ చెప్పారు.

విద్యార్థులు లేరని స్కూళ్లు మూసేయబోం..

→ రాష్ట్రంలో ప్రతీ గ్రామం, తండాకు విద్యను తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని, అందుకోసమే మెగా డీఎస్సీ నిర్వహించబోతున్నామని రేవంత్ చెప్పారు. విద్యార్థులు లేరంటూ స్కూళ్లు మూసేసే పరిస్థితి ఉండబోదని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న సర్కారీ స్కూల్ భవనాల మరమ్మతుల కోసం రూ.2 వేల కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలలతో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక స్టడీ రిపోర్ట్ వచ్చిందన్నారు. ఈ క్రమంలో ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తూ.. సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలన్న ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకే ఇస్తున్నామన్నారు. సరికొత్త రీతిలో బడిబాట చేపట్టి స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్య మీద వెచ్చించేది ఖర్చు కాదని, పెట్టుబడి అని పేర్కొన్నారు. టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఇంటర్‌లోనూ మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్య కమిషనర్ దేవసేన, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, యశోద ఫౌండేషన్ చైర్మన్ రవీందర్ రావు, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు టి.రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హడావుడిగా అనుమతి.. వెంటనే నిలిపివేత

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తయారీ కంపెనీలకు ఇవ్వాల్సిన నిధులను ప్రతి నెలా చెల్లిస్తోంది. కానీ పాత బకాయిలను మాత్రం ఇవ్వడం లేదు. దీంతో సదరు కంపెనీలు తమకు పాత బకాయిలు ఇప్పించాలని, లేదంటే బీర్లు సరఫరా చేయలేమని ఎక్సైజ్ శాఖపై ఒత్తిడి పెంచారు. వేసవిలో సీజన్ కావడంతో బీర్లు తయారు చేసే బ్రూవరీలతో సమన్వయంతో వ్యవహరించి బీర్లను అందుబాటులోకి తేవాల్సిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు రూటు మార్చారు. పాత కంపెనీలను కాదని, గుట్టుచప్పుడు కాకుండా సోమ్ సహా ఐదు కొత్త బ్రూవరీలకు అనుమతినిచ్చారు. అయితే ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో కొత్త బ్రూవరీలకు బ్రేక్ వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బేర్‌మంటున్న బీర్ స్టాక్: ఎక్సైజ్ అధికారుల నిర్వాకంతో రాష్ట్రంలో బీర్లకు కొరత ఏర్పడేలా ఉంది. రాష్ట్రంలో యూబీ (2 యూనిట్లు), అన్‌హైజర్ బుష్ (ఏబీ–2 యూనిట్లు), కార్ల్స్‌బర్గ్, లీలాసన్స్ కంపెనీలు అనుమతులు పొంది బీర్లు తయారు చేస్తున్నాయి. రాష్ట్రంలో విక్రయించే బీర్లలో సింహభాగం యూబీ, ఏబీ కంపెనీలు తయారు చేసేవే. కాగా ఈ కంపెనీలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పించడం లేదా సదరు కంపెనీలతో సమన్వయం చేసుకుని అవసరమైన మేరకు బీర్లను తయారు చేయించడం ఎక్సైజ్ ఉన్నతాధికారుల విధి. కానీ అలా చేయకుండా కొత్త బ్రెవరీలకు అనుమతినివ్వడం, మళ్లీ నిలిపివేయడంతో బీర్ల కొరత ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రోజుకు 1.25 లక్షల కేసుల బీర్లు అవసరమవుతాయని అంచనా. కానీ ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని డిపోల్లో కలిపి 3 లక్షల కేసులు మాత్రమే స్టాక్ ఉందని తెలుస్తోంది. కాగా కొత్త బ్రూవరీల పేరుతో అనుమతులిచ్చిన ఐదు కంపెనీల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన సోమ్ బ్రూవరీస్ వుడ్ పెక్కర్, హంటర్‌తో పాటు మరో బ్రాండ్ తయారు చేస్తుందని, మిగిలినవి కర్జూరా, బిర్యానీ బ్రాండ్ ఉత్పత్తి చేస్తాయని సమాచారం. కాగా కొత్తగా అనుమతినిచ్చిన కంపెనీల్లో ఒక్కటి కూడా రాష్ట్రంలో ఎక్కువ మంది వినియోగించే బీర్లు తయారు చేసేవి కాకపోవడం గమనార్హం.

గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు తీవ్ర పోటీ

- గత రెండుసార్లు కంటే ఈసారి అత్యధికంగా అభ్యర్థుల హాజరు
- ప్రశ్నపత్రం సులభంగా ఉండటంతో కటాఫ్ మార్కులపై ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మూడోసారి నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షలో తీవ్ర పోటీ నెలకొంది. గతంలో రెండుసార్లు నిర్వహించి రద్దు చేసిన ప్రిలిమ్స్‌తో పోలిస్తే ఈసారి అభ్యర్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఈసారి పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 3.02 లక్షల మంది (74%) ప్రిలిమ్స్ రాసినట్లు కమిషన్ ప్రాథమికంగా వెల్లడించింది. దీనికితోడు ఈసారి ప్రశ్నపత్రం సులభంగా ఉండటంతో కటాఫ్ మార్కులపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అన్ని కేటగిరీల్లో ప్రశ్నలు సులభతరం నుంచి మధ్య స్థంగా ఉన్నట్లు ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. కమిషన్ ప్రాథమిక ‘కీ’విడుదల చేశాకే స్పష్టత కటాఫ్‌పై వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అర్హతకు కనీసం 50 శాతానికి పైబడి మార్కులు రావాల్సిందేనని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రెండుసార్లు రద్దు కావడంతో..: వాస్తవానికి గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి 2022 ఏప్రిల్‌లో 503 ఉద్యోగాల భర్తీకి కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అదే ఏడాది అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించి 1:50 నిష్పత్తిలో మెయిన్ పరీక్షలకు తేదీలు ప్రకటించింది. కానీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగు చూడటంతో ప్రిలిమ్స్‌ను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్‌లో రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా అందులో లోపాలు జరిగాయంటూ అభ్యర్థులు కోర్టుకెక్కారు. దీంతో కోర్టు ఆదేశంతో ప్రిలిమ్స్‌ను కమిషన్‌రద్దు చేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం... కొత్తగా 60 గ్రూప్‌–1 పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వడంతో టీజీపీఎస్సీ మొత్తంగా 563 గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తును అప్‌డేట్ చేసుకొనే అవకాశం కల్పించడంతోపాటు కొత్తగా దరకాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. దీంతో కొత్తగా 23 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఫలితంగా అభ్యర్థుల సంఖ్య 4.03 లక్షల చేరింది.

గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరు శాతం

పరీక్ష తేదీ	అభ్యర్థులు	హాజరు	శాతం
2022 అక్టోబర్‌-16	3.80 లక్షలు	2.85 లక్షలు	75%
2023 జూన్‌-11	3.80 లక్షలు	2.33 లక్షలు	61.37%
2024 జూన్‌-9	4.03 లక్షలు	3.02 లక్షలు	74%

రుణమాఫీ ‘లెక్క’ తీయండి!

▶ మొదటి పేజీ తరువాయి

రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. బ్యాంకర్ల నుంచి పూర్తిస్థాయిలో రైతుల వివరాలను సేకరించి, అర్హులను గుర్తించాలని సూచించారు. కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్పష్టమైన ప్రణాళికతో రండి..

బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎస్‌ల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. రూ.2 లక్షల వరకు రుణాల మాఫీకి సంబంధించిన డేటా, అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించి, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేసి తీరాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకేసారి మాఫీతో ఇబ్బంది అంటూ..!

రుణమాఫీకి నిధుల జమ విషయంలో ఇబ్బందులను కొందరు అధికారులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. సుమారు రూ.35 వేల కోట్ల వరకు నిధులను జమ చేయడం అంత సులువైన విషయం కాదని స్పష్టం చేసినట్టు సమాచారం . అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ చేసి తీరాల్సిందేనని, అందుకు మార్గాలను అన్వేషించాలని సీఎం పేర్కొన్నట్టు తెలిసింది. రుణాలున్న ప్రతీ రైతుకు లబ్ధి జరిగేలా మార్గదర్శకాలు తయారు చేయాలని కూడా సూచించినట్టు సమాచారం. ఇప్పటివరకు కొన్ని బ్యాంకుల నుంచి రైతు రుణాల సమాచారం వచ్చిందని, మిగతావాటి నుంచి కూడా డేటా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అయితే రుణమాఫీకి అర్హులైన రైతులు ఎంతమంది ఉంటారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు అంటున్నారు.

రేపు టెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: 12న ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు వెల్లడి కానున్నాయి. మే 20 నుంచి జూన్ 2 వరకు టెట్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 2,86,381 దరఖాస్తులు రాగా, 2,36,487 మంది హాజరయ్యారు. 3న ప్రాథమిక ‘కీ’విడుదల చేశారు. అభ్యంతరాల అనంతరం ఈనెల 12న ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

బడి బస్సులకు ఆర్టీఏ బ్రేక్

- ఫిట్‌నెస్ లేని బస్సులపై స్పెషల్ డ్రైవ్
- రోడ్డెక్కితే కఠినచర్యలు: డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: ఫిట్‌నెస్ లేని బడిబస్సులకు రవాణా శాఖ బ్రేకులు వేస్తోంది. అలాంటివి రోడ్డెక్కకుండా కొరడా ఝుళిపిస్తోంది. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు తిరిగి తెరచుకోనున్న నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రాంతీయ రవాణా అధికారులు, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)ల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను తీసుకెళ్లడానికి వీల్లేదని, ప్రమాదాలకు కారణమయ్యే అలాంటి వాటిని నడిపితే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తప్పవని డీటీసీ హెచ్చరించారు. ప్రతి బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 11,922 బడి బస్సులు ఉండగా, ఇప్పటివరకు 8,917 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పొందాయి. మరో 3,005 బస్సులకు ఇంకా సామర్థ్య నిర్ధారణ కాలేదని ఆయన తెలిపారు. 15 ఏళ్ల సర్వీస్ దాటిన బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై తిరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇలాంటి బస్సుల్లో పిల్లలను తీసుకెళితే వెంటనే సీజ్ చేసి, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సు సమర్థవంతంగా ఉండటంతోపాటు అనుభవజ్ఞులైన, 60 ఏళ్ల వయసు మించని డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. బడిబస్సుల నిర్వహణపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో 5,725 బస్సులకుగాను 4,363, మేడ్చల్–మల్కాజిగిరిలో 5,985 బస్సులకు 4,468, వికారాబాద్‌లో 212 బస్సులకు 86 బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని చెప్పారు.


మూడు రోజులు వర్షాలు

▶ మొదటి పేజీ తరువాయి

గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు నమోదవుతాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో జీహెచ్ఎంసీ హెల్ప్ డెస్క్ (ఫోన్ నంబర్లు: 040–21111111, 9001136675)ను ఏర్పాటు చేసింది. సోమవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 40.4 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.4 డిగ్రీ సెల్సియస్ నమోదైంది.

సామాజిక, ఆర్థిక, కుల సర్వేపై బీసీ కమిషన్ కసరత్తు

- ప్రశ్నావళిపై క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయ సేకరణకు సిద్ధం
- సోమవారం పీపుల్స్ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం
- త్వరలో అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనల స్వీకరణపై దృష్టి



సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియపై తెలంగాణ బీసీ కమిషన్ దృష్టి సారించింది. ఈ సర్వేకు రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే ఆమోదముద్ర వేయగా... ఈ బాధ్యతలను తెలంగాణ బీసీ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ క్రమంలో రాష్ట్ర సామాజిక, ఆర్థిక, కుల సర్వే కార్యాచరణ ప్రణాళిక తయారీలో తెలంగాణ బీసీ కమిషన్ నిమగ్నమైంది. ఇందులో భాగంగా అభిప్రాయ సేకరణలో భాగంగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లోని సామాజిక వేత్తలు, మేధావులతో భేటీకి ఉపక్రమించింది. సోమవారం తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అధ్యక్షతన పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు సి.హెచ్.ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కె.కిశోర్‌గౌడ్, సభ్య కార్యదర్శి బి.బాలమాయాదేవి, పీపుల్స్ కమిటీ ప్రతినిధులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ ఐ.తిరుమలి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పద్మజా షా, ప్రొఫెసర్ నరేంద్రబాబు, డాక్టర్ ఎస్.పృథ్వీరాజ్, దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టే తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన కుల సర్వేలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలను నిర్దిష్టంగా తీసుకోవాలని పీపుల్స్ కమిటీ ప్రతినిధులు బీసీ కమిషన్‌కు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓసీ వర్గాలు కవర్ అయ్యేలా ఈ సర్వే సాగించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో నిర్వహించిన కుల సర్వేలపైన లోతుగా చర్చించారు. పీపుల్స్ కమిటీ చేసిన సలహాలు, సూచనలను బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రాతపూర్వకంగా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీసీ కమిషన్ కొనసాగిస్తున్న కుల సర్వే కార్యాచరణ ప్రణాళిక తయారీలో భాగంగా, త్వరలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రతినిధులు, మేధావులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలను ఆహ్వానిస్తామన్నారు. ఇందుకు సంబంధించి వారంలోపే తేదీలను ప్రకటిస్తామని వెల్లడించారు. అన్నివర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.



కఠిన అనుభవాలను దాటిన, సుదూరాలకు పయనించిన మనిషి ఒక సమయం తర్వాత ఆఖరికి తన వేదనలను కూడా ఆనందిస్తాడు.

– హోమర్

సాక్షి

మంగళవారం, 11 జూన్ 2024

సరికొత్త సంకీర్ణ విన్యాసం

ఆహూతులైన వివిధ దేశాల ప్రభుత్వాధినేతలు, అనేక రంగాల ప్రముఖులు, వేలాది జనం సాక్షిగా, రాష్ట్రపతి భవన్ వేదికగా ఆదివారం రాత్రి నరేంద్ర మోదీ కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. భారత ప్రధాని స్వర్గీయ నెహ్రూ తర్వాత మళ్ళీ వరుసగా మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన మరో వ్యక్తిగా మోదీ చరిత్ర సృష్టించారు. ప్రధాన మంత్రి కిసాన్ నిధి నుంచి 17వ విడతగా 9.3 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ. 20 వేల కోట్లు పంపిణీ చేసే ఫైలుపై తొలి సంతకంతో సోమవారం ఉదయమే మోదీ పనిలోకి దిగిపోయారు. మొదటి రెండు పర్యాయాలు బీజేపీ సొంత బలంతో 'మోదీ సర్కార్'గానే పాలన చేసిన కమలనాథులు ఈ మూడోసారి మాత్రం చాలినంత సంఖ్యాబలం లేక, మిత్రపక్షాల అండతో అచ్చమైన 'ఎన్డీఏ సర్కార్'గా పని చేయాల్సి రావడం కొత్త పాలనలోని పెద్ద మార్పు. గతంలో గుజరాత్ సీఎంగా కానీ, ఆ తరువాత గడచిన పదేళ్ళుగా ప్రధానిగా కానీ తన మాటే శాసనంగా చలామణీ అయిన మోదీ ఇప్పుడు వివిధ ప్రాంతాలు, పార్టీలు, ఆశలు, ఆకాంక్షలకు చెవి ఒగ్గి, ఏకాభిప్రాయసాధనలో ఏ మేరకు విజయం సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

జనరల్ (24), ఓబీసీ (27), ఎస్సీ (10), ఎస్టీ (5), మైనారిటీలు (5)... ఇలా వివిధ వర్ణ శోభితమైన హరివిల్లుగా మొత్తం 71 మంది సహచరులతో మోదీ సారథ్యంలో కొత్త మంత్రి మండలి ఏర్పాటైంది. మొత్తం 81 మంది మంత్రి పదవులకు అవకాశం ఉండగా ఏకంగా 71 మందిని తొలి విడతలోనే తీసుకున్న మోదీ 24 రాష్ట్రాలకు కేంద్రంలో ప్రాతినిధ్యం కల్పించినట్టయింది. అయితే, ప్రమాణ స్వీకారం జరిగిన అనేక గంటల తర్వాత సోమవారం రాత్రికి గాని మంత్రిత్వ శాఖల కేటాయింపు ప్రకటన వెలువడలేదు. ఏకపక్ష నిర్ణయాలు అలవాటైన ప్రభుత్వ పెద్దలు సంకీర్ణ ప్రభుత్వంలో అన్ని పక్షాలకూ సంతృప్తి కలిగేలా వ్యవహరించడంలోని ఇబ్బందిని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నట్టుంది. ఆ మాటకొస్తే ప్రమాణ స్వీకారానికి ముందు, ఆ తరువాత కూడా సంకీర్ణ పక్షాలలో కొన్ని బాహాటంగానే తమ అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఒక మంత్రి పదవి... అదీ సహాయ మంత్రి పదవే ఇవ్వడం, అందులోనూ గతంలో క్యాబినెట్ హోదాలో పనిచేసిన ప్రఫుల్ పటేల్‌కు ఆ స్థాయి తక్కువ పదవి ఇవ్వడం పట్ల అజిత్ పవార్ సారథ్యంలోని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ప్రమాణ స్వీకారం కన్నా ముందు ఆదివారమే అభ్యంతరం చెప్పింది. మంత్రి పదవిని తిరస్కరించింది.

గెలిచిన అనురాగ్ ఠాకూర్ నుంచి, ఓడిపోయిన స్మృతీ ఇరానీ దాకా పలు పాత ముఖాలకు కొత్త సర్కారులో మోదీ మొండిచేయి చూపారు. అదే సమయంలో 33 మందిని మొదటిసారి మంత్రుల్ని చేశారు. ఏపీ నుంచి ముగ్గురికి, తెలంగాణ నుంచి ఇద్దరికీ మంత్రులుగా బెర్తులిచ్చారు. ఆ లెక్కలెలా ఉన్నా, సోమవారం సాయంత్రం తొలిసారిగా కేంద్ర క్యాబినెట్ భేటీ జరిగే లోగా... సంకీర్ణ సర్కారు నుంచి మరిన్ని గొంతులు పైకి లేచాయి. ఏడుగురు ఎంపీలున్న తమ కన్నా తక్కువ సంఖ్యాబలం గల పార్టీలకు క్యాబినెట్ హోదా మంత్రి పదవిచ్చి, తమకు మాత్రం స్వతంత్ర హోదా ఉన్న సహాయ మంత్రి పదవితోనే సరిపుచ్చారంటూ ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన అసమ్మతి వ్యక్తం చేసింది. సొంత గూటిలోనూ బీజేపీకి సణుగుళ్ళు తప్పట్లేదు. కేరళలో తొలిసారిగా ఖాతా తెరిచిన కమలం పార్టీ త్రిస్సూర్ నుంచి గెలిచిన సినీ నటుడు సురేశ్ గోపికి మంత్రిమండలిలో స్థానం కల్పించింది. అయితే, సహాయ మంత్రి హోదా ఇచ్చినందుకు కినిసి ఆయన పక్కకు తప్పుకోవడానికి సిద్ధమైనట్టు వార్తలు రావడం, రచ్చ రేగేసరికి ఆఖరుకు ట్విట్టర్‌లో అలాంటిదేమీ లేదని ఖండించడం చకచకా జరిగాయి. వీటిని బట్టి సంకీర్ణ సర్కార్ నడపడంలోని సవాళ్ళు మోదీకి ఆదిలోనే అర్థమై ఉండాలి.

మరోపక్క మరికొద్ది నెలల్లోనే మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్న బీజేపీ అక్కడ మళ్ళీ బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తుంది. అలాగే, దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ క్యాబినెట్‌లో ప్రాతినిధ్యమూ కమలనాథుల 'మిషన్ సౌత్' వ్యూహంలో భాగమే. ఇక, వివిధ రాష్ట్రాలకు గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఆరుగురు ఇప్పుడు మోదీ క్యాబినెట్‌లో ఉన్నారు. స్వయంగా మోదీని సైతం కలుపుకొంటే ఆ సంఖ్య ఏడుకు చేరుతుంది. అంటే పాలనలో అనుభవానికి కొరత లేదు. కాకపోతే, వ్యక్తిగతంగా అధికారంలో శిఖరాలను చూసినవారు కలసికట్టుగా ముందడుగు వేయడంలో అహంభావాలకు తావు లేకుండా చూసుకోగలరా అని విశ్లేషకుల అనుమానం. అయితే, రక్షణ, ఆర్థిక, హోమ్, విదేశీ వ్యవహారాల వంటి కీలక శాఖలను గత ప్రభుత్వంలోని మంత్రులకే కట్టబెట్టారు. ఇది కొత్త సీసాలో పాత సారాగా తోచినా, విధానాల కొనసాగింపు, సుస్థిరత్వానికి పెద్దపీట వేశారనుకోవాలి.

వెరసి మోదీ ప్రజల కొత్త తీర్పుతో ఇప్పుడు కొత్త పిచ్ మీద ఆట మొదలుపెట్టారు. ఒకప్పటి వాజ్‌పేయి సంకీర్ణ సర్కార్‌లా సక్సెస్ కావాలంటే సహనం, సహానుభూతి పెంచుకోక తప్పదు. సంకీర్ణ సర్కారుకు తోడు బలమైన ప్రతిపక్షమూ ఉన్నందున పించ్ హిట్టింగ్‌కు అవకాశం లేదు. తిరుగులేని మెజారిటీ ఉన్న గతంలోలా ఇప్పుడు ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పెద్ద నోట్ల రద్దు, దేశవ్యాప్త లాక్‌డౌన్ లాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం లాంటివి చేయలేరు. వివాదాస్పదమైన ఒకే దేశం – ఒకే ఎన్నిక, ఉమ్మడి పౌరస్మృతి లాంటి సొంత అజెండాను కాషాయధ్వజులు కొన్నాళ్ళు పక్కనపెట్టక తప్పదు. ఆటలో దూకుడుకు అవకాశం లేనప్పుడు అవుటవకుండా ఆత్మరక్షణ ధోరణిలో ఆడక తప్పదు. పదేళ్ళుగా ప్రాంతీయ పార్టీలను సామ దాన భేద దండోపాయాలతో ఆడిస్తున్న పెద్దలకు కచ్చితంగా ఈ సంకీర్ణపు ఆట సరికొత్తదే! అలాగే పెరిగిన బలంతో ఊపిరి పీల్చుకున్న ప్రతిపక్షం సైతం 18వ లోక్‌సభలో కూటమిగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తేనే ప్రజలకు మేలు.

కశ్మీరీల ప్రజాస్వామిక విశ్వాసం

విశ్లేషణ



వజాహత్ హబీబుల్లా

1996 తర్వాత జమ్ము–కశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో నమోదైంది. సమస్యాత్మక ప్రాంతంలో ఇది కొత్త శకానికి నాంది అనుకోవచ్చు. 2019లో ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం ప్రకారం ఉన్న పరిమిత రాజకీయ స్వయంప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే కశ్మీరీలు, లద్దాఖ్ వాసుల సంకల్పానికి ఈ పోలింగ్ శాతం ఒక సూచన. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై కోపం ఉన్నప్పటికీ, భారతదేశంపై కొత్త విశ్వాసం అక్కడి ప్రజల్లో ఉంది. రాజకీయ, సామాజిక సమస్యలకు పరిష్కారాలను తీసుకురాగల సామర్థ్యం తుపాకీ కంటే ప్రజాస్వామిక ప్రక్రియే కలిగి ఉందని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు చూపిస్తున్నారు.

మునుపటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. నివేదికల ప్రకారం, పరిణామంలో చిన్నదైనప్పటికీ ఎక్కువ మంది జనాభా నివసిస్తున్న కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో, 1996 తర్వాత అత్యధికంగా ఓటింగ్ శాతం ఈ ఎన్నికల్లోనే నమోదయ్యింది. శ్రీనగర్‌లో 38.49 శాతం ఓటింగ్ జరగగా, బారాముల్లాలో 59.1 శాతం నమోదైంది. జమ్మూ డివిజన్‌లోని పూంచ్–రాజౌరీ జిల్లాల చేరిక వల్ల కశ్మీరీల ప్రాబల్యం తగ్గిపోయిన అనంత్‌నాగ్‌లో 54.84 శాతం ఓటింగ్ నమోదైంది.

కొత్త శకానికి నాంది

ముస్లిం మెజారిటీ ప్రాంతాలైన కశ్మీర్, లద్దాఖ్; హిందూ మెజారిటీ ఉన్న జమ్మూ మధ్య ఎన్నికల ఫలితాలు తీవ్రమైన మతపర విభజనను వెల్లడిస్తున్నాయి. పీర్ పంజాల్ పర్వతశ్రేణికి ఇరువైపులా ఉన్న పోటీదారులు ఓటర్లకు చేసిన మతపరమైన విజ్ఞప్తి ద్వారా కూడా ఈ విభజన ధ్రువీకరించబడింది. కశ్మీర్ లోయ వేర్పాటువాదం నుంచి బయటపడినప్పటికీ... జమ్మూలో రెండు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ హిందుత్వ ఎజెండా (నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ద్వారా మతపరమైన అస్తిత్వాన్ని బలోపేతం చేయడానికి రూపొందించిన నియోజకవర్గాలివి) లోయలోని ప్రతి అభ్యర్థికి చెందిన విభిన్నమైన మతపరమైన ప్రాతిపదికతో సరిపోలింది. వాస్తవానికి, కశ్మీర్‌లోని షియా ముస్లిం సమాజపు మొదటి కుటుంబానికి చెంది, శ్రీనగర్ నుండి గెలుపొందిన నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఆగా సయ్యద్ రుహుల్లా తన కమ్యూనిటీ తరపున కశ్మీరీ పండితులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం ద్వారా అంతకుముందటి స్థితిని బద్దలుకొట్టారు. 1990–96 మధ్య కాలంలో జమ్మూ కశ్మీర్ ఇప్పటిలాగే కేంద్ర పాలనలో ఉన్నప్పుడు, కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండితుల భారీ వలసలను నిరోధించడంలో విఫలమైనందుకు ఆయన క్షమాపణ వేడుకున్నారు.

అలాంటప్పుడు సమస్యాత్మక ప్రాంతంలో ఇది కొత్త శకానికి నాంది కాదా? 2019లో ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి ఉన్న పరిమిత రాజకీయ స్వయంప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించిన తర్వాత, ఇవి జమ్మూ కశ్మీర్‌లో జరిగిన మొదటి ఎన్నికలని గుర్తుంచుకోవాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే కశ్మీరీలు, లద్దాఖ్ వాసుల సంకల్పానికి లోయలో, లద్దాఖ్‌లో నమోదైన పోలింగ్ శాతం ఒక సూచన. స్వతంత్ర అభ్యర్థిగా లద్దాఖ్ సీటును గెలుచుకున్న మాజీ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు మహమ్మద్ హనీఫాకు మొదటి నుండీ ట్రెండ్స్ అనుకూలంగానే ఉన్నప్పటికీ, ఇది ఆ పార్టీ పునరుజ్జీవనం కాదు. కేంద్రంలోని అధికార పార్టీని ఓడించడానికి దాని వెనుక సమీకరించే ప్రయత్నం. ఎందుకంటే నేషనల్ కాన్ఫరెన్స్ స్టార్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి



ఒమర్ అబ్దుల్లా బారాముల్లా నుంచి ఓడిపోయారు. అబ్దుల్లాకు 26 శాతం ఓట్లు రాగా, ఆయన మీద గెలిచిన ఇంజనీర్ రషీద్‌కు దాదాపు 46 శాతం ఓట్లు పోలయ్యాయి. 'స్వతంత్ర కశ్మీర్'ను ప్రవచించే రషీద్ అదే కారణంగా 'ఉపా' కేసులో గత ఐదేళ్లుగా తిహార్ జైలులో ఉన్నారు. చివరి క్షణంలో ఆయన ఇద్దరు కుమారుల నేతృత్వంలో ప్రచారం ఊపందుకుంది.

ఆర్టికల్ 370 రద్దుకు కారణమైన బీజేపీకి వ్యతిరేకంగా జరిగిన ఓట్ల ఏకీకరణకు మనం ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నాము. ఇంతకుముందు, కశ్మీర్‌లో పాతుకుపోయిన రెండు ప్రముఖ పార్టీలు ఎన్సీ, పీడీపీలు బీజేపీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని గుర్తుంచుకోవాలి. చివరిగా కశ్మీర్‌లో ఏర్పాటైన ప్రభుత్వం బీజేపీ, పీడీపీ కూటమి. ప్రతి ఒక్కరి ఎన్నికల ప్రచారాల ద్వారా వ్యక్తీకరించబడినట్లుగా, సజ్జాద్ లోన్‌కు చెందిన పీపుల్స్ కాన్ఫరెన్స్ వంటి బీజేపీ మిత్రపక్షాలు కూడా ప్రజల మద్దతు కోసం ఏదైనా విజ్ఞప్తి చేయడానికి ముందు, ఆ పార్టీకి దూరంగా ఉండవలసి వచ్చింది.

పునరావిష్కరించుకుంటేనే కమల వికాసం

కశ్మీర్‌లోని ఏ స్థానం నుంచి కూడా బీజేపీ తన అభ్యర్థిని నిలబెట్టలేదు. కశ్మీర్‌లో కమలం వికసించడానికి సమయం పడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కానీ కశ్మీరీల కోసం, లద్దాఖ్ ప్రజల కోసం పార్టీ తనను తాను తిరిగి ఆవిష్కరించుకుంటే తప్ప, ఇది అసంభవమని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రధానమంత్రులుగా జమ్ము కశ్మీర్ చూసిన భారతీయ నాయకులందరిలోకీ అటల్ బిహారీ వాజ్‌పేయి అత్యంత ప్రియమైన వ్యక్తి.

బీజేపీకి మద్దతివ్వడం పక్కన పెడితే, ఆ పార్టీతో అనుబంధం పెట్టుకోవడానికి కూడా శ్రీనగర్‌లో ఎవరూ లేరు. నేను మే మొదటి వారంలో లోయలో ఉన్నాను. డౌన్‌టౌన్‌తో సహా శ్రీనగర్‌లోని స్నేహితుల ఇళ్లలోనూ, సోపోర్‌లోనూ ఉన్నాను. ఒమర్ అబ్దుల్లాను సవాలు చేసే వ్యక్తిగా ఇంజనీర్ రషీద్ ఆవిర్భవించడం అప్పటికి ఇంకా స్పష్టీకరించబడలేదు. కానీ బీజేపీ పట్ల వ్యతిరేకత మాత్రం అక్కడ స్పష్టంగా, సార్వత్రికంగా ఉంది.

ప్రచారంలో అభ్యర్థులు ఒకరి కంటే ఒకరు బీజేపీకి వ్యతిరేకంగానే ఎక్కువగా తమ గురించి చెప్పుకున్నారు. కేంద్రంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా కశ్మీర్ రాజకీయ రంగంలోని వివిధ వర్గాలు ఏకమయ్యాయి. కశ్మీరీలు ఇచ్చిన సందేశం బిగ్గరగా, స్పష్టంగా ఉంది. ఎన్నికల క్రమంలో కుల్గామ్, పూంఛ్‌లలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, ఈ కేంద్రపాలిత ప్రాంతంలో వాస్తవంగా హింస తగ్గుముఖం పట్టిందనే దృక్పథాన్నే నేను కొనసాగించాలనుకుంటున్నాను. బీజేపీ మీద వ్యతిరేకతకు కారణాలు ఏమంటే, ప్రస్తుతం ఉన్న పరిపాలన ప్రజలలో ఏ విధమైన సంతృప్తిని కలిగించకపోగా, పరాయీకరణను పెంచింది.

తుపాకీ కన్నా ఓటు మేలు

అయినప్పటికీ, అదే సమయంలో, కశ్మీర్‌ను నాలాగే అభిమానిస్తున్న వారికి ప్రకాశవంతమైన భవిష్యత్తు ఉంది. అక్కడ పరాయీకరణ ఉన్నప్పటికీ, రాజకీయ, సామాజిక సమస్యలకు పరిష్కారాలను తీసుకురాగల సామర్థ్యం తుపాకీ కంటే ప్రజాస్వామిక ప్రక్రియే కలిగి ఉందని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు చూపిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై కోపం ఉన్నప్పటికీ, భారతదేశంపై కొత్త విశ్వాసం అక్కడి ప్రజల్లో ఉంది. ఓటు రూపంలో దేశం దాని ప్రజలకు ఇచ్చిన భరోసా కూడా కశ్మీరీల్లో వ్యక్తమైంది.

ఈ ప్రాంతంలోని రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల ప్రతినిధులు, కశ్మీరీలే అయినప్పటికీ ప్రజల తిరస్కరణను ఎదుర్కొన్నారు. కానీ 1990ల నుండి గ్రహణం పట్టిన ప్రజాస్వామ్య ప్రక్రియ ఇంకా సజీవంగానూ, చైతన్యవంతంగానూ ఉంది. ఈ ప్రక్రియలో పాలుపంచుకోవాలనే ప్రజల విశ్వాసంలో, ఇతర భారతీయులకు లాగే దేశ పాలనలో తామూ భాగం కాగలమనే గుర్తింపునకు సంబంధించిన వ్యక్తీకరణలో ఇది కనబడుతోంది.

వ్యాసకర్త జమ్ము కశ్మీర్ క్యాడర్ మాజీ ఉన్నతాధికారి;
'నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్' మాజీ చైర్‌పర్సన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చీకటి రోజు



నరేంద్ర మోదీ 'ప్రమాణ స్వీకారోత్సవం' జరుపుకొంటున్న వాళ్లకు దేశంలోని ఏకైక మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సందేశం. 'ప్రధాని' 'ఉత్సవం' జరిగినంతసేపూ ఆమె తన లైట్లన్నింటినీ ఆర్పేసి, చీకట్లో కూర్చున్నారు. ప్రచారం మొత్తం స్వీయ కేంద్రంగా చేసుకున్న మోదీని ప్రజలు తిరస్కరించారు. ఆయన్ని మార్చాలి.

– సాగరికా ఘోష్, తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ

భద్రత సాధ్యమేనా?



పది మంది హిందూ యాత్రికుల మరణానికి కారణమైన రియాసీ(కశ్మీర్) దాడిని ఇద్దరు పాకిస్తానీ తీవ్రవాదులు సరిహద్దు దాటి వచ్చి జరిపినట్టు తెలుస్తోంది. వాళ్లు సరిగ్గా తేదీ, సమయం కోసం ఎదురు చూసి దాడి చేశారు. చొరబాటు దారుల నుంచి ఇండియా తన సరిహద్దుల్ని కాపాడుకోలేదని మరోసారి నిరూపించింది.

– యానా మీర్, యాంకర్

ఊహించగలమా?



అంటే ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఆ క్రూర చిరుత ఉంటే– ఒకవేళ అది అడ్డంగా నడుచుకుంటూ వెళ్లకుండా (కేంద్ర క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవ వేళ) కిందికి దిగివస్తే ఏమయ్యేది? అప్పుడు ఏం జరిగివుండేది?

– సుహేల్ సేఠ్, నటుడు

స్థానం లేదా?



ముస్లిం పర్సనల్ లా బోర్డు మొదలైనప్పటి నుంచీ అందులో ఎంతోమంది సయ్యద్, షేక్, మొఘల్, పఠాన్లు ఉన్నారు. కానీ పస్మాందా ముస్లింలు సున్నా. పస్మాందా ముస్లింలు అంటరాని వాళ్లుగా కొనసాగుతున్నారు.

– ఫయాజ్ అహ్మద్ ఫైజీ, పస్మాందా యాక్టివిస్ట్

వందనం



సంస్కృతం, పాళీ భాషల్లో ఎంతో ప్రధానమైన మూల గ్రంథాలను రాసినవాళ్లు తమ పేరు చెప్పుకోలేదు. సూర్య సిద్ధాంత, సంధి నిర్మోచన, అభిధర్మ లాంటివి. అలాంటి పుస్తకాలకు జన్మనిస్తూ తమ అస్తిత్వాన్ని విలుప్తం చేసుకునేలా అంత గొప్ప ఆలోచనాపరులను నడిపింది ఏమిటి?

– జోసెఫ్ టి.నూనీ, రచయిత

ఇన్ బాక్స్

బాల్యానికి భరోసా ఏదీ?

'పల్లెటూరి పిల్లగాడా పసులగాసే మొనగాడా, పాలు మరచి ఎన్నాళ్ళయ్యిందో, ఓ పాల బుగ్గల జీతగాడా, కొలువుదీరి ఎన్నాళ్ళయ్యిందో' అంటూ... ప్రజాకవి సుద్దాల హనుమంతు రాసిన ఈ పాట భారతదేశంలో శతాబ్దాల తరబడి బాల కార్మిక వ్యవస్థలో మగ్గిపోతున్న బాలల జీవన చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది. బడిలో ఉండాల్సిన పిల్లలను, ఆట పాటలతో గడపాల్సిన బాల్యాన్ని బందీ చేయడం ఒక అనాగరిక చర్య. ఇది మన భారతదేశ సమస్య మాత్రమే కాదు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న చాలా దేశాల సమస్య కూడా.

ప్రపంచవ్యాప్తంగా 28.7 కోట్ల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది 'వరల్డ్ డే అగెనెస్ట్ చైల్డ్ లేబర్' ఉద్యోగుల భద్రత, ఆరోగ్యాలను మెరుగుపరచవలసిన అవసరాన్నీ, చిన్నారి బాల కార్మికుల పరిస్థితులను మెరుగుపరచవలసిన అవసరాన్నీ నొక్కి చెబుతోంది. పిల్లలందరికీ విద్య, ఆరోగ్యాలను పొందడానికి హక్కు ఉంది. కానీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది బాలలు వీటికి దూరమవుతున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలు కావడం, కుటుంబ పేదరికం, నిరక్షరాస్యత, తదితర కారణాల వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. కర్మాగారాలలో, హోటళ్లలో, రైల్వే–బస్ స్టేషన్లలో, వీధుల్లో బాలకార్మికులు కనిపిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనులు చేస్తూ బతుకు బండిని లాగుతున్నారు. పట్టణాలు, నగరాలలో బాలకార్మికులు భిక్షాటన చేస్తున్నారు. కొంతమంది చెడువ్యసనాలకు బానిసలై దొంగతనాలూ, హత్యలకూ పాల్పడుతున్నారు. బాల కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఫలితాలు శూన్యం అని చెప్పవచ్చు.

బడికి వెళ్లాల్సిన బాల్యం బందీగా మారుతోంది. దీనికి కారణం ఎవరు? రోడ్డుపై విసిరేసిన ఎంగిలి విస్తరాకులూ, చిత్తుకాగితాలు ఏరుకుంటూ... చితికిపోయిన బతుకులు ఈడ్చుకుంటూ మెతుకు కోసం జీవిత పోరాటం చేస్తున్నారు వీరు. ఇటుకలు మోస్తూ, ఇనుమును కరిగిస్తూ, బిక్షమెత్తుకొంటూ, పంక్చర్ లేస్తూ, పేపర్ వేస్తూ, పాలు, పల్లీలమ్ముతూ, కంపెనీల్లో పనిచేస్తూ, పశువులు కాస్తూ, కలుపులు తీస్తూ, పాలిష్ చేస్తూ, పెయింట్‌లు వేస్తూ బతుకును వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితులను కళ్లారా చూస్తున్న ఐక్యరాజ్యసమితి 2002లో బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది.

అయినా ప్రపంచంలోని వివిధ దేశాలలో బాలకార్మికుల సంఖ్య పెరుగుతూనే ఉంది తప్ప, తగ్గడం లేదు. సమాజంలో భాగమైన మనమందరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగిద్దాం.

– ముద్దం నరసింహ స్వామి; జర్నలిస్టు, హైదరాబాద్

(రేపు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా)

కొనుగోలు మోసాలతో కునారిల్లుతున్న రైతు

అభిప్రాయం



నైనాల గోవర్ధన్

తెలంగాణ రాష్ట్రంలో పాలకులు ఎవరున్నా రైతు మాత్రం పచ్చి మోసానికీ, దోపిడీకీ గురవుతున్నాడు. ముఖ్యంగా పండిన పంట అమ్ముకునే క్రమంలో రైతులను వడ్ల కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) నిలువు దోపిడీకి గురిచేస్తున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ జగిత్యాల జిల్లా, వెల్గటూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జాబు తిరుపతి అనే కౌలురైతు ఉదంతం.

తిరుపతి దాదాపు నలభై రోజుల క్రితం 40 కేజీల తూకంతో ఉన్న 297 బస్తాల రబీపంట ధాన్యం మొత్తాన్నీ స్తంభనపల్లి 'ప్రభుత్వ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ' (పీఏసీఎస్–ప్యాక్స్) వడ్ల కొనుగోలు కేంద్రాని (పీపీసీ)కి అమ్మాడు. ఈ పీపీసీ బాధ్యుడు ఆశ పవన్. ఈ ధాన్యం విలువ రూ. 2,61,716. అయితే వడ్లు కొన్నట్లుగా పవన్ ఎలాంటి రసీదును ప్యాక్స్ తరఫున ఇవ్వలేదు. కౌలు రైతు తన వడ్ల డబ్బుల కోసం, బ్యాంకు పాస్‌బుక్, కౌలు ధ్రువీకరణ తదితర పత్రాలన్నింటినీ ప్యాక్స్‌కు అందించాడు. తిరుపతి అమాయకత్వాన్ని గమనించిన పవన్ తన స్నేహితుడైన గుండెల్లి ప్రవీణ్‌తో కుమ్మక్కై, అతని డబ్బును కాజేశాడు. పథకం ప్రకారం పవన్ తన స్నేహితుడు ప్రవీణ్‌కు ఫోన్ చేసి, 'నీ ఖాతాలో జాబు తిరుపతి అనే రైతు డబ్బులు వేస్తున్నా'నని పదే పదే చెప్పి మరీ వేశాడు.

పవన్ వద్దు అమ్మిన రైతుకు, రసీదు ఇవ్వకపోవడం మొదటి తీవ్రమైన తప్పు. రైతు ఖాతాలో డబ్బులు వేయకుండా ఆ డబ్బులు మిత్రుని ఖాతాలో వేయడం తీవ్రమైన నేరం. ప్యాక్స్ –1964 చట్టం, తెలంగాణ పౌరసరఫరాల చట్టాల ప్రకారం అత్యంత నేరపూరితమైన చర్య. జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు, పౌరసరఫరాల అధికారికి, జిల్లా సహకార సంఘం (ప్యాక్స్ ఉన్నత) అధికారికి, స్థానిక పోలీసు సీఐకీ, బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. ప్యాక్స్ సంఘాలకు ప్రత్యక్షంగా బాధ్యత వహించే జిల్లా సహకార సంఘం అధికారులు తమ కింది సంఘాలు రైతుల పట్ల పాల్పడుతున్న ఘోరమైన మోసాన్ని గుర్తించారు.

ఈ ప్యాక్స్‌కు ఆర్థిక వనరులు అంటే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, వరి ధాన్యం కొనుగోలు ఇలా అనేక రకాల వ్యాపారాలు ఉన్నాయి. వీటి ద్వారా భారీ ఎత్తున డబ్బు వస్తుంది. ప్యాక్స్ చట్టం ప్రకారం ఈ డబ్బుతో మోసపోయిన రైతుకు డబ్బు చెల్లించాలి. ప్యాక్స్ చట్టం –1964 ప్రకారం రైతులు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోవద్దు. నష్టాన్ని వెంటనే భర్తీ చేయాలి. ఇలా రైతులను మోసం చేసే మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ చట్టం చెబుతోంది. ఈ చట్టం ప్రకారం ఆ ప్యాక్స్ పరిధిలో మోసం చేసిన వారిని విచారించి వారి ఆస్తులను వేలం వేసి సమానమైన డబ్బును ప్యాక్స్‌కు జమకట్టాలని 1964 చట్టం చెబుతుంది. ధాన్యం కొలుగోల్లలో రైతులకు ఎలాంటి మోసం జరిగినా తానే బాధ్యుణ్ణి అని కొనుగోలు కేంద్రాల బాధ్యులందరితో ప్రతి ఏటా ప్రమాణ పత్రాలు తీసుకోకపోవడం ప్రభుత్వాలు చేస్తున్న పెద్ద తప్పు.

జాబు తిరుపతికి తను అమ్మిన ధాన్యం కొనుగోలు చేసినట్టు ప్యాక్స్ రసీదు ఇచ్చి ఉంటే ఈ మోసం జరిగేది కాదు. జరిగినా రసీదు అనే ఆధారం ఉండేది. డబ్బులు వాటికవే రైతు ఖాతాకు వచ్చేవి. తెలంగాణలో ధాన్యం అమ్మిన లక్షలాది మంది రైతులలో చాలామందికి రసీదులు ఇవ్వక పోవడం వారికి సామూహికంగా జరుగుతున్న అన్యాయం. రసీదులో రైతు ధాన్యం బరువు కచ్చితంగా తెలుస్తుంది. ఇవ్వవలసిన డబ్బులు ఎంత అనేది తెలుస్తుంది. రైతుకు రసీదు ఇచ్చిన తరువాత ధాన్యానికి సమానమైన ధర చెల్లించక తప్పదు. రసీదు ప్రకారం అమ్మకం జరిగిన నాటి ధాన్యం బరువులో కోత విధించకూడదు. ధాన్యం నాణ్యత బాగాలేదు, తేమ ఉంది అని చెప్పడానికి అవకాశం లేదు. ఇలా అనేక విషయాల్లో పీపీసీ బాధ్యుడి అన్యాయాలకు రసీదు సంకెళ్లు వేస్తుంది.

ఈ రబీ పంట కాలంలో 40 కిలోల వడ్ల బస్తాకు మూడున్నర కిలోల చొప్పున మిల్లర్లు రాష్ట్రవ్యాప్తంగా రైతులను దోచుకున్నారు. అంటే క్వింటాల్‌కు 7–8 కిలోల చొప్పున రైతాంగాన్ని యథేచ్ఛగా దోపిడీ చేశారు. ప్రతి క్వింటాల్‌కు రైతును రూ. 160 చొప్పున మిల్లర్లు దోచుకున్నారు. ఈ లెక్కన తెలంగాణ అంతటా కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం ఎంత? దోపిడీ ఎంత అనేది గణిస్తే తేలికగా దోపిడీ అర్థమవుతుంది.

జరిగిన మరో పెద్ద మోసం అన్ని రకాల వడ్లను గ్రేడ్ల వారీగా కాకుండా, ఒకే సాధారణ వెరైటీ కింద మిల్లర్లు కొనుగోలు చేయడం. ఇందులో జరిగిన మిల్లర్ల దోపిడీ మాయాజాలం ఏమిటి? ఏ– గ్రేడ్ సన్న రకం వడ్లకు రూ. 2,203 కాగా బీ–గ్రేడ్ కు రూ. 2,183. దాదాపు రాష్ట్ర



వ్యాప్తంగా కొనుగోలు చేసిన ఏ ఒక్క క్వింటాల్ ధాన్యానికీ గ్రేడ్ల వారీగా ధర చెల్లించిన దాఖలా లేదు. అంటే ప్రతి క్వింటాల్ ధాన్యానికి రైతు రూ. 20 నష్టపోతున్నాడు. ప్రతి క్వింటాల్‌కు మిల్లర్ రూ. 20 దోచుకున్నాడు. దీన్నిబట్టి రాష్ట్రం మొత్తం కొనుగోళ్లలో దోపిడీ ఎంత భారీ స్థాయిలో జరిగిందో గుర్తించవచ్చు. అలాంటప్పుడు ఏ– గ్రేడ్, బీ– గ్రేడ్ లేదా సన్న, దొడ్డు రకాలు అని వేరువేరుగా విభజన చేయడం, గుర్తించడం ఎందుకు? ఏ– గ్రేడ్ వడ్లు పండించడానికి రైతు చేసిన ప్రత్యేక శ్రమ, ఖర్చులకు సస్యరక్షణకు విలువ ఏమిటి?

సన్న వడ్లకే రూ. 500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం ఒక మోసం కదా? ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు బోనస్‌గా క్వింటాల్‌కు రూ. 500 చెల్లిస్తామన్నారు. నిజానికి సన్న, దొడ్డువడ్లు అనే విభజన అమలులో లేదు. ఎన్నికల తర్వాత మాట మార్చడం ఏమి నీతి? ఈ సన్న రకాలకు గత ఖరీఫ్ సీజన్‌లో బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 2,800– 3,000 వరకు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. సన్న వడ్లు పండిస్తే ప్రభుత్వం ఇచ్చే బోనస్‌తో కలుపుకుని 2,703 రూపాయలు మాత్రమే (రూ. 2,203+500) రైతుకు వస్తుంది. గత ఖరీఫ్ బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే, ప్రతి క్వింటాల్‌కు రైతు వంద రూపాయల నుండి 300 వరకూ నష్టపోతున్నాడు. ఇది రైతాంగానికి తలపెట్టిన సామూహిక మోసం కాదా?

పదేళ్ల కేసీఆర్ పాలనలో ధాన్యం కొనుగోళ్ళలో ప్రభుత్వ ప్యాక్స్, డీసీఎమ్ఎస్‌ల దోపిడీ యథేచ్ఛగా సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఇదొక కారణం. గత పదేళ్ల దోపిడీని గుర్తించి కొన్ని ప్రాంతాలలో ప్యాక్స్ డీసీఎంఎస్‌లకు ఈ రబీ సీజన్‌లో ఒక్కటంటే ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇవ్వలేదు. వీరి స్థానంలో ఐకేపీ మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను ఇచ్చారు. కేసీఆర్ పాలనలో దోపిడీకి అలవాటు పడ్డ ఒక ప్రభుత్వ ప్యాక్స్ సంఘమే, తమది రైతు రాజ్యం అని చెబుతున్న ప్రభుత్వ హయాంలో ఓ అమాయక నిరుపేద కౌలు రైతు మొత్తం కష్టాన్నీ నిట్ట నిలువునా దోచుకుంది. భూమి కౌలు, పెట్టుబడుల భారం, అప్పుల వాళ్ళ ఒత్తిళ్లకు తాళలేక ఆత్మహత్యకు ఆ రైతు యత్నిస్తే, బంధుమిత్రులు ఆపారు. పంట అమ్మి నేటికీ 40 రోజులవుతోంది. ప్రభుత్వం ప్యాక్స్ సంఘంతో కౌలు రైతు కష్టం ఇప్పిస్తారా? ఈ 'రైతు రాజ్యం'లో ఏం జరుగుతుందో చూద్దాం!

వ్యాసకర్త తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ ၊ 97013 81799

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పంచమి సా.5.44 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.16 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.12.24 నుండి 2.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.57 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.35 వరకు, **అమృతఘడియలు:** రా.10.40 నుండి 12.20 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29.

క్లుప్తంగా...

కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- సీపీఎం కార్యదర్శివర్గ సమావేశంలో పలు తీర్మానాలు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బీవీ రాఘవులు మాట్లాడారు. రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాలన్నీ ప్రభుత్వం ఏకకాలంలో మాఫీ చేయాలని కోరారు. రాష్ట్రంలో 20 లక్షల మందికిపైగా కౌలు రైతులు 30 శాతానికి పైగా వ్యవసాయం చేస్తున్నారని, రైతు ఆత్మహ త్యల్లో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా పంటల బీమా సౌకర్యం లేదని, ప్రీమి యం మొత్తం ప్రభుత్వమే చెల్లించే విధంగా పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లు వెంటనే విడుదల చేయాలని కోరా రు. వీటిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి అన్ని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చాలి

- మంత్రి సీతక్కకు టీపీఆర్టీ, నిరుద్యోగ జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీ (ఓపీఎస్)లను జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లుగా మార్చాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు టీపీఆర్టీ నేత, కాంగ్రెస్ నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కాంగ్రెస్ నేత కోటూరి మానవతారాయ్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా జిల్లా కలెక్టర్ల ద్వారా ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికై పనిచేస్తున్న 1,194 మందిని జేపీఎస్‌లుగా మార్చాలని కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ అంశంపై సీతక్క సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఓపీఎస్‌లకు న్యాయం చేస్తామని హామీఇచ్చినట్లు వివరించారు.

నెహ్రూకి, మోదీకి పోలికేంటి?

- టీపీసీసీ మేధావుల విభాగం అధ్యక్షుడు శ్యాంమోహన్

సాక్షి, హైదరాబాద్: మోదీ హ్యాట్రిక్ విజయం సాధించారంటూ దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చడాన్ని టీపీసీసీ మేధావుల విభాగం ఖండించింది. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని, ప్రస్తుతం వ్యవసాయానికి ఉపయోగపడుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టులూ ఆయన హయాంలో నిర్మించినవేనని విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల శ్యాంమోహన్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో మోదీ దేశానికి ఏం చేశారని ప్రశ్నించారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన నెహ్రూకి, అధోగతి పాలుచేసిన మోదీకి సంబంధమేంటని ప్రశ్నించారు. ఇండియా కూటమికి 100 సీట్లు రావని సర్వేలు చెప్తే ప్రజలు 230 సీట్లలో గెలిపించారని, రాహుల్‌గాంధీ పాదయాత్ర కారణంగానే ఇది సాధ్యమైందని శ్యాంమోహన్ తెలిపారు.

సెల్ఫీ తీసుకుంటూ జలపాతంలో పడి..

కర్ణాటకలో హైదరాబాద్‌వాసి మృతి

హైదరాబాద్: సెల్ఫీ క్రేజ్‌కు హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు బలైన ఘటన కర్ణాటకలోని చిక్కమగళూరు జిల్లాలో చోటు చేసుకుంది. చిక్కమగళూరు సమీపంలోని తరీకెరె తాలూకా, హెబ్బె ఫాల్స్‌లో జరిగిన ఈ దుర్ఘటన వివరాలిలా ఉన్నాయి.. వీకెండ్ కావడంతో హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్(25) స్నేహితులతో కలిసి చిక్కమగళూరు టూర్‌కి వచ్చాడు. పలు ప్రాంతాలను చూసుకుని సోమవారం బైక్‌లలో హెబ్బె ఫాల్స్‌కు వెళ్లారు. వర్షాలు బాగా కురుస్తుండటంతో జలపాతం జోరుగా ప్రవహిస్తోంది. అక్కడ సెల్ఫీలు తీసుకుంటున్న అతను పట్టు తప్పి ఎత్తైన రాయిపై నుంచి కిందకు పడటంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని
హమాలీల ఆందోళన


సివిల్ సప్లయిస్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ హమాలీ కార్మికులు

పంజగుట్ట (హైదరాబాద్): సివిల్ సప్లయిస్ హమాలీలకు క్వింటాలు ఎగుమతి, దిగుమతులకు హమాలీ రేట్లు 26 నుంచి 35 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తూ, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లయిస్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో హమాలీలు హాజరై తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయిస్ కమిషనర్ చౌహాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ .. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హమాలీ రేట్లు పెంచాలని నిబంధనలు ఉన్నప్పటికీ, రెండు సంవత్సరాలు దాటి ఐదు నెలలు గడుస్తున్నా కనీసం చర్చలకు పిలవకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ ప్రమాదాలకు గురవుతున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్ రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య తదితరులు పాల్గొన్నారు.


బూబీట్రాప్స్ కోసం ఏర్పాటు చేసిన గుంతలు

పారిశుధ్య లోపాల్లేకుండా చూడండి

- అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి
- వర్షాల సీజన్‌పై సమీక్షలో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వర్షాకాలంలో పారిశుధ్య లోపం, కలుషిత నీరు వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో వర్షాలు, వరదల వల్ల ఏర్పడే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. సోమ వారం సచివాలయంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటళ్ళు, మార్కెట్లు, దుకాణాల్లో నిల్వ ఉంచే వస్తువులపై నిఘా ఉంచాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటే వాటిని తాత్కాలికంగా నిషేధించాలని ఆదేశించారు. పారిశుధ్యంపై కోళ్ళ ఫారంల యాజమాన్యాలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా, డివిజనల్, మండల పంచాయతీ అధికారులు ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. మహిళాశక్తి పథ కం కింద


మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టడం దాదాపు పూర్తయిందనీ, స్కూళ్ల ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ అనితా రామచంద్రన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం పోరాటం: సీతక్క

గ్రామీణ ఉపాధి హామీ పని దినాలను 150 రోజులకు, కనీస వేతనాన్ని రూ.400కి పెంచడంతో పాటు పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపచేసేందుకు కృషి చేస్తామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడు శివదాసన్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని, చట్ట ప్రకారం వారం వారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు.

భగీరథ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు ప్రభుత్వమే వారికి నేరుగా జీతాలు చెల్లించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. మిషన్ భగీరథ కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరింది. ఈ మేరకు సోమవారం మంత్రి సీతక్కకు సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వి.రాములు వినతిపత్రం సమర్పించారు.

పూసుగుప్పలో బూబీట్రాప్స్

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప సమీపంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన 70 బూబీట్రాప్స్‌ను సోమవారం ప్రత్యేక పోలీసు బృందాలు గుర్తించాయి. ఈ వివరాలను భద్రాద్రి జిల్లా ఏఎస్పీలు టి.సాయిమనోహర్, పరితోష్ పంకజ్ వెల్లడించారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతమైన పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపు సమీపాన సోమవారం చర్ల పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన బూబీట్రాప్స్‌ను గుర్తించారు. కందకాలు తవ్వి వాటిలో ఏర్పాటు చేసిన 70 బూబీట్రాప్స్ నుంచి 4,396 పదునైన ఇనుప చువ్వలను తొలగించారు.

బూబీట్రాప్స్ అంటే..

కూంబింగ్‌కు వచ్చే పోలీసులు లక్ష్యంగా మావోయిస్టులు అటవీ ప్రాంతంలో కందకాలు తవ్వి అందులో పదునైన చువ్వలు ఏర్పాటు చేసి ఆపై ఆకులతో కప్పేస్తారు. కూంబింగ్‌కు వచ్చిన బలగాలు నడిచి వెళ్తూ ఇందులో పడితే శరీరాలకు చువ్వలు గుచ్చుకుని తీవ్రంగా గాయపడడంతో పాటు ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతారు. కొన్నిచోట్ల ప్రెజర్‌బాంబులు కూడా ఏర్పాటు చేస్తారు. అవి గుర్తించని పోలీసులు వీటిని తొక్కితే పేలి చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

తన భార్యకు పట్టా రాశాడని తండ్రిని చంపేసిన కొడుకు

- కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోదారుణం

నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయ భూమిని తన భార్య పేరుపై పట్టా చేశాడని ఓ తండ్రిని కొడుకు దారుణంగా హత్య చేసిన ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. సోపూర్ గ్రామానికి చెందిన కాంబ్లే లాలప్పకు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. అందరికీ పెళ్లిళ్లు చేశాడు. పెద్ద కుమారుడు పుణెలో మేస్త్రి పని చేస్తూ జీవిస్తుండగా, చిన్న కుమారుడైన సుభాష్ తుపాన్ వాహనం నడుపుతూ జుక్కల్‌లో ఉంటున్నాడు. సుభాష్ తరచూ మద్యం సేవించడంతో పాటు ఆస్తి ఇస్తే అమ్ముకుంటాడనే కారణంతో.. లాలప్ప తన పేరిట ఉన్న ఎకరన్నర(1.5) వ్యవసాయ భూమిని కోడలి పేరుతో పట్టా చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన సుభాష్ ఆదివారం రాత్రి మద్యం సేవించి సోపూర్‌కు వచ్చాడు. తండ్రిని తుపాన్ వాహనంలో కూర్చోబెట్టుకొని డోన్‌గాల్ శివారులోకి తీసుకెళ్లి కర్రతో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చాడు. మృతదేహాన్ని సోపూర్ శివారులోని వ్యవసాయభూమిలో పడేసి పరారయ్యాడు. సోమవారం ఉదయం గ్రామస్తుల సమాచారం మేరకు బాన్సువాడ డీఎస్పీ టి సత్యనారాయణ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని సుభాష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ప్రైవేటు వ్యక్తులు ఎలా కీలకమయ్యారు?

- గొర్రెల స్కాంలో దర్యాప్తు వేగవంతం
- కీలక నిందితులు కళ్యాణ్, రాంచందర్‌ను కస్టడీకి తీసుకొని ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు
- మూడు రోజుల ఏసీబీ కస్టడీకి అనుమతించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో రూ.కోట్లు గోల్‌మాల్ వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ కుంభకోణంలో అత్యంత కీలక నిందితులుగా అనుమానిస్తున్న తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌ను కస్టడీకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీలో భాగంగా ఏసీబీ అధికారులు ఇద్దరు నిందితులను సోమవారం మొదటి రోజు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకుని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఇద్దరు నిందితులను వేర్వేరుగా ప్రశ్నించినట్టు తెలిసింది. మొదటి రోజు విచారణలో భాగంగా తొలుత ఇద్దరు వ్యక్తిగత, వృత్తిగత వివరాలను సేకరించారు. గొర్రెలపథకం అమలులో ఇద్దరి పాత్రపైనా కొంత సమాచారం రాబట్టారు. ప్రైవేటు వ్యక్తులను ఈ వ్యవహారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించినట్టు ఇప్పటికే రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నందున ఈ అంశంపైనా ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. నిధుల గోల్‌మాల్‌లో ఎవరెవరికి కీలక పాత్ర పోషించారన్నదానిపైనా ఆరా తీసినట్టు తెలిసింది. రిమాండ్ రిపోర్టులోని అంశాలపై ప్రాథమికంగా ఇద్దరి నుంచి సేకరించిన వివరాలు, ఇప్పటికే దర్యాప్తులో సేకరించిన పత్రాలను ఆధారంగా మంగళవారం మరోమారు ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

భూవివాదంతో ఆగిన అంత్యక్రియలు

- మూడు రోజులుగా మార్చురీలోనే మృతదేహం


హన్మంతరెడ్డి

చౌటుప్పల్: భూవివాదంతో అంత్యక్రియలు ఆగిపోయాయి. మూడు రోజులు అవుతున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో మృతదేహం మార్చురీలోనే ఉంచారు. వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన చీరిక హన్మంతరెడ్డి(48) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అతనికి సోదరుడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. వీరికి వారసత్వంగా గ్రామంలో 7.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పంపకాల్లో వివాదాలు చోటుచేసుకున్నాయి. వాటా కావాలని డిమాండ్ చేస్తూ సోదరీమణులు కోర్టులో కేసు వేశారు. పెద్దమనుషులతో మాట్లాడుకొని వివాదం పరిష్కరించుకునేందుకు శనివారం స్వగ్రామానికి వచ్చాడు. ఆ రోజు వివాదం ఎటూ తేలలేదు. దీంతో మనస్తాపం చెంది రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పోస్టుమార్టం నిర్వహించొద్దని, వివాదం పరిష్కారమైన తర్వాతనే తదుపరి కార్యక్రమాలు నిర్వహించాలని మృతుడి అత్తగారి తరఫు బంధువులు భీష్మించారు. మృతుడి ఆడపడుచులు కేసు ఉపసంహరించుకోవాలని, ఆ వెంటనే భూమి పంపిణీ జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇతర బంధువులు, గ్రామస్తులు నచ్చజెప్పినా వినలేదు. దీంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. పలుచర్చల తర్వాత కేసు ఉపసంహరించుకునేందుకు ఆడపడుచులు అంగీకరించారు. న్యాయవాదులతో పెద్దమనుషులు చర్చించగా, మంగళవారం కేసు ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందని, చెప్పగా, అది జరిగాకే పోస్టుమార్టం చేయించి అంత్యక్రియలు నిర్వహిస్తామని మృతుడి బంధువులు ప్రకటించారు.

ఎక్సైజ్ దాడులు.. ఆందోళనతో వృద్ధురాలు మృతి

- అస్వస్థతతో గుండెపోటుకు గురై చనిపోయిందంటున్న అధికారులు
- పోలీసులు నెట్టివేయడమే కారణమన్న కుటుంబీకులు


తులసి

జూలూరుపాడు: ఎక్సైజ్ పోలీసుల దాడులతో గుండెపోటుకు గురై ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల పంచాయతీ పరిధిలోని దుబ్బ తండాలో సోమవారం చోటుచేసుకుంది. అయితే కుటుంబసభ్యులు మాత్రం ఎక్సైజ్ పోలీసులు నెట్టివేయడం వల్లే గుండెపోటుకు గురైందని ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. దుబ్బతండాలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. బానోత్ రాంజీ – తులసి (68) ఇంట్లో తనిఖీ చేయగా నాటుసారాతో పాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రి లభ్యమయ్యాయి. పోలీసులు వాటిని తీసుకెళ్తుండగా తులసి అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో పోలీసులు పక్కకు తోసేయడంతో కిందపడింది. ఆ వెంటనే గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం తులసి అస్వస్థతకు గురై కింద పడడంతోనే గుండెపోటుకు గురైందని చెప్పారు. తులసి గుండెపోటుతో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవన్‌రాజు తెలిపారు. తనకు వడదెబ్బ తగిలి నీరసంగా ఉందని తులసి సోమవారం ఉదయం భర్తకు చెప్పిందని పేర్కొన్నారు. కాగా తులసి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ఆందోళన చేపట్టారు.

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయండి

- ఇంటర్మీడియట్ బోర్డు ఎదుట టీఎన్ఎస్ఎఫ్ నిరసన

హైదరాబాద్: ఐఐటీ, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన హాజరై ప్రసంగించారు. విద్యను వ్యాపారం చేస్తూ రూ. లక్షల్లో ఫీజు దండుకుంటూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విషయంలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యను వ్యాపారంగా మార్చు కుని బుక్స్, స్టేషనరీ, దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ... జూనియర్ కళాశాలల్లో కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాభాల పేరుతో రూ. 41 లక్షలు టోకరా

హైదరాబాద్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వైద్యుడికి సైబర్ కేటుగాళ్లు భారీగా టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన 47 ఏళ్ల బేరియాట్రిక్ సర్జన్‌ను ఫేస్ బుక్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. భారీ లాభాలు వస్తాయని నమ్మించడంతో వారు చెప్పిన విధంగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. మొదట కొంత లాభాలు వచ్చాయని చూపించి నమ్మించారు. వాటిని విత్ డ్రా చేసుకునే వీలులేకుండా వాలెట్ పనిచేయడం లేదని వివిధ కారణాలు చెప్పారు. బాధితుడు మరోసారి మరో అకౌంట్ ద్వారా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాడు. ఈ విధంగా విడతల వారీగా రూ. 41,28,000 పెట్టుబడిగా పెట్టాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన అతను న్యాయం చేయాలని కోరుతూ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు

హైదరాబాద్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను బోయిన్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణీ ప్రియదర్శిని వివరాలు వెల్లడించారు. సూరారం ప్రాంతానికి చెందిన మెకానిక్, రజాక్ ఖాన్, మియాపూర్‌కు చెందిన డ్రైవర్ యమ్మల యోహాన్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. గత అక్టోబర్ నుంచి 14 బోయిన్‌పల్లి, తిరుమలగిరి, నాంపల్లి, జీడిమెట్ల తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో బైక్‌లు చోరీ చేశారు. మచిలీపట్నానికి చెందిన డీటీపీ సెంటర్ నిర్వాహకుడు గౌరిపాటి వెంకటప్పయ్య ద్వారా డూప్లికేట్ ఆర్సీలను తయారు చేయించి ఓఎల్ఎక్స్‌లో వాహనాలను విక్రయించేవారు. ఇటీవల బోయిన్‌పల్లి పరిధిలో జరిగిన బైక్ చోరీ కేసులో నిందితులను గుర్తించిన పోలీసులు ఆదివారం బోయిన్‌పల్లి – సుచిత్ర మార్గంలో వెళ్తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14 బైక్‌లు, ల్యాప్‌టాప్, 4 వాహనాలకు సంబంధించిన నకిలీ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనాన్ని పూర్తిగా స్క్రాప్ చేసి విక్రయించగా, మరో మూడు బైక్‌లు రికవరీ చేయాల్సి ఉందని డీసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రమేష్ మురళి, శివశంకర్ మహేష్, హోంగార్డు శ్రీనివాసులను డీసీపీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

సమావేశంలో అదనపు డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, బోయిన్ పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, డీఐ సర్దార్ నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పీఎంవో కాదది...

ప్రజా పీఎంవో!

- గతంలో కేవలం అధికార కేంద్రమే
- పదేళ్లుగా ప్రేరక శక్తిగా నిలిచింది
- వికసిత భారతే మనందరి లక్ష్యం
- ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుదాం
- పీఎంవో అధికారులతో మోదీ
- ప్రధానిగా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: ''ప్రధాని కార్యాలయమంటే అధికార కేంద్రమని మన దేశంలో పదేళ్ల కింది దాకా అభిప్రాయముండేది. కానీ నేను పుట్టింది అధికారం కోసం కాదు. నాకు అధికారం కావాలని ఎప్పుడూ ఆలోచించను. ప్రధాని కార్యాలయం కూడా అధికార కేంద్రం కాకూడదు. అది ప్రజల పీఎంవోగా ఉండాలి తప్ప మోదీ పీఎంవోగా కాదు'' అని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ''నేను అధికారం కోసం జన్మించలేదు. 140 కోట్ల మంది భారతీయులే నాకు దేవుళ్లు. వారి సంక్షేమమే నా పరమావధి. దానికోసమే వారు నాకు మరోసారి అవకాశమిచ్చారు. పీఎంవోను అధికార కేంద్రంగా మార్చే ఉద్దేశం నాకెన్నడూ లేదు. అది ప్రజల సంక్షేమం కోసం పని చేసే సంస్థగా ఉండాలి'' అని స్పష్టం చేశారు. 2014 నుంచీ అదే దిశగా కృషి చేస్తూ వచ్చామన్నారు. ఆయన వరుసగా మూడోసారి ప్రధానిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేయడం తెలిసిందే. సోమవారం ఉదయం ప్రధాని కార్యాలయంలో ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధుల విడుదల ఫైలుపై తొలి సంతకం చేశారు. పీఎంఓలో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. వారినుద్దేశించి మోదీ మాట్లాడారు. పీఎంవో ఒక ప్రేరక శక్తిగా నిలవాలన్నదే తన తపన అని చెప్పారు. ''దేశమే ముందు. నాకైనా, మీకైనా ఇదే ఏకైక లక్ష్యం కావాలి'' అని వారికి ఉద్బోధించారు. ''2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాం. మీనుంచి నేను కోరేది అదే'' అని స్పష్టం చేశారు. ''మనం నిర్ణీత పని గంటలు పెట్టుకుని, వాటికి పరిమితమై పని చేసే వాళ్లం కాదు. పని వేళలతో పాటు ఆలోచనలకు కూడా ఎలాంటి హద్దులూ లేనివాళ్లే నా పీఎంవో బృందం. వారిపై దేశమూ ఎంతో నమ్మకం పెట్టుకుంది'' అన్నారు. ''గత పదేళ్లో ఆలోచించిన, అమలు చేసిన దానికంటే ఎంతో ఎక్కువగా చేసి చూపించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇదే నా భవిష్యత్తు విజన్'' అని పేర్కొన్నారు. ''అంతర్జాతీయ ప్రమాణాలన్నింటినీ అధిగమిద్దాం. నిన్న ఎలా ఉన్నాం, ఈ రోజు ఎంత బాగా చేశామన్నది కాదు. ఇక ముందు ప్రతి రంగంలోనూ మనమే ప్రపంచంలో అగ్రగాములుగా ఎదగాలి. ఇప్పటిదాకా ఎవరూ చేరలేని శిఖరాలకు దేశాన్ని తీసుకెళ్దాం'' అని అధికారులకు పిలుపునిచ్చారు. అది జరగాలంటే ఆలోచనల్లో స్పష్టత, చిత్తశుద్ధిపై నమ్మకం, ఆ దిశగా కష్టించే స్వభావం అత్యంత అవసరమని మోదీ చెప్పారు. పీఎంవో బృంద సభ్యులు అందిస్తూ వస్తున్న సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదే నా శక్తి రహస్యం...

తనకు ఇంతటి శక్తి ఎక్కడి నుంచి వస్తోందని ఈ ఎన్నికల సందర్భంగా చాలామంది అడిగారని మోదీ అన్నారు. ''30 ఏళ్లుగా నాకీ ప్రశ్న ఎదురవుతూనే ఉంది. నాలోని విద్యార్థి నిత్యం సజీవంగానే ఉంచుకుంటాను. బలహీనతకు, బద్ధకానికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటివ్వను. చైతన్యంతో, శక్తిమంతంగా ఉండటమే నా రహస్యం. అలా ఉన్నప్పుడే విజయవంతమైన వ్యక్తులుగా ఎదుగుతాం. నూతనోత్తేజం, రెట్టించిన ఉత్సాహం, శక్తియుక్తులతో ముందుకు సాగుతా'' అని చెప్పారు.



'పీఎం కిసాన్ నిధి'పై మోదీ తొలి సంతకం

సాక్షి, న్యూఢిల్లీ: మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథకం 17 వ విడత నిధుల విడుదల ఫైలుపై మోదీ తొలి సంతకం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున మొత్తంగా రూ.20 వేల కోట్ల నిధులు అందనున్నాయి. అనంతరం మోదీ మాట్లాడుతూ, తమది రైతు సంక్షేమానికి పూర్తిగా కట్టుబడ్డ ప్రభుత్వమన్నారు. అందుకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక తొలి సంతకం రైతు సంక్షేమ ఫైలుపై పెట్టడం సముచితమన్నారు. రైతులు, వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

3 కోట్ల ఇళ్ల నిర్మాణం

కేబినెట్ తొలి భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన కింద (పీఎంఏవై) దేశవ్యాప్తంగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయమందించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. కొత్తగా కొలువుదీరిన ఎన్డీఏ మంత్రివర్గం సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి సమావేశమైంది. మోదీ అధికారిక నివాసం '7, లోక్ కల్యాణ్ మార్గ్'లో జరిగిన ఈ భేటీలో బీజేపీతో సహా అన్ని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన మంత్రులు పాల్గొన్నారు. అర్హులైన కుటుంబాల గృహ నిర్మాణ అవసరాలను తీర్చాలని భేటీలో నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన పేద కుటుంబాలకు కనీస సదుపాయాలతో కూడిన ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సాయం చేసే నిమిత్తం 2015–16 ఆర్థిక సంవత్సరం నుంచి పీఎంఏవై పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. దీని కింద గత పదేళ్లలో 4.21 కోట్ల మంది అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఫ్రాన్స్ పార్లమెంట్ రద్దు

ముందస్తు ఎన్నికలకు వెళ్తున్న దేశాధ్యక్షుడు మేక్రాన్

పారిస్: యూరోపియన్ యూనియన్ (ఈయూ) పార్లమెంటరీ ఎన్నికలు పరోక్షంగా ఫ్రాన్స్ పార్లమెంట్ ముందస్తు ఎన్నికలను మోసుకొచ్చాయి. యూరోపియన్ యూనియన్‌లో మొత్తం 720 సీట్లు ఉండగా 81 సభ్యులను ఫ్రాన్స్ ఎన్నుకోనుంది. ఇందుకోసం జరిగిన ఎన్నికల్లో ఫ్రాన్స్ విపక్ష నేషనల్‌ర్యాలీ పార్టీకి 32 శాతం ఓట్లు పడొచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు చెందిన రనిసాన్స్ పార్టీకి కేవలం 15 శాతం ఓట్లు పడతాయని ఎగ్జిట్



పోల్స్ ప్రకటించాయి. నిజంగానే ఈ ధోరణి ఇలాగే కొనసాగితే మూడేళ్ల తర్వాత అంటే 2027లో జరగబోయే ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ విపక్ష పార్టీ విజయం సాధించే ప్రమాదముందని దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భావించారు. ఇందుకు బలం చేకూరుస్తూ ఆయన పార్లమెంట్‌ను రద్దుచేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. దీంతో వచ్చే 20 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 30న తొలి దశ, జూలై ఏడో తేదీన రెండో దశ పోలింగ్ జరగనుంది. మూడేళ్ల తర్వాత నిర్వహిస్తే ఓడిపోతామని, ప్రజాదరణ తగ్గేలోపు ఇప్పుడే నిర్వహిస్తే తమ రనిసాన్స్ పార్టీయే గెలుస్తుందన్న అంచనాతో ఆయన ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారని వార్తలొచ్చాయి.

సరైన నిర్ణయం తీసుకున్నా: మేక్రాన్

పార్లమెంట్ రద్దు నిర్ణయాన్ని మేక్రాన్ సమర్థించుకున్నారు. '' దేశం కోసం సరైన నిర్ణయం తీసుకున్నా. ఈయూ ఎన్నికల ద్వారా ప్రజలు మా ప్రభుత్వానికి ఏం చెప్పదల్చుకున్నారో అర్థమైంది. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపకుండా వదిలేయలేను' అని చెప్పారు.

కీలక శాఖలన్నీ బీజేపీ వద్దే

షా, రాజ్‌నాథ్, నిర్మల, జైశంకర్ సహా కీలక మంత్రులకు అవే శాఖలు

న్యూఢిల్లీ: అనుభవానికి పెద్దపీట వేస్తూ, అదే సమయంలో యువతకు సముచిత ప్రాధాన్యమిస్తూ నూతన కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. కసరత్తులో ఆసాంతం మోదీ–షా ముద్రే ప్రతిఫలించింది. పదేళ్లుగా మోదీ తొలి, మలి మంత్రివర్గాల్లో కీలకంగా వ్యవహరించిన బీజేపీ మంత్రులకు ఈసారీ ప్రాధాన్యం కొనసాగింది. హోం శాఖ బాధ్యతలు మరోసారి అమిత్ షానే చేపట్టగా రాజ్‌నాథ్‌సింగ్ రక్షణ, నిర్మలా సీతారామన్ ఆర్థిక, జైశంకర్ విదేశాంగ శాఖల్లో కొనసాగనున్నారు. మోదీతో పాటు మొత్తం 72 మందితో ఆదివారం ఎన్డీఏ మంత్రివర్గం కొలువుదీరడం తెలిసిందే. మోదీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారికి సోమవారం శాఖలు కేటాయించారు. గత రెండుసార్లకు భిన్నంగా ఈసారి బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ మనుగడలో ఎన్డీఏ పక్షాలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జేడీ(యూ) తదితర భాగస్వాములకు శాఖల కేటాయింపులో సముచిత ప్రాధాన్యమే దక్కినా కీలక శాఖలన్నింటినీ బీజేపీయే అట్టిపెట్టుకునేలా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నట్టు స్పష్టంగా కన్పించింది. కీలక శాఖలు కావాలని జేడీ(యూ), టీడీపీ ముందుగానే కోరినా కుదరదని బీజేపీ పెద్దలు స్పష్టం చేయడం తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే వ్యూహాత్మక ప్రాధాన్యమున్న అత్యధిక పోర్టుఫోలియోలు బీజేపీ మంత్రులకే దక్కాయి. దేశవ్యాప్తంగా రోడ్డు నెట్‌వర్క్ అభివృద్ధి, విస్తరణ, ఆధునీకరణలో తనదైన మార్కు చూపిన నితిన్ గడ్కరీకి మరోసారి రోడ్లు–హైవే శాఖ దక్కింది. మోదీకి ప్రీతిపాత్రుడైన అశ్వినీ వైష్ణవ్‌కు కీలకమైన రైల్వే, ఐటీ–ఎలక్ట్రానిక్స్ శాఖలను కొనసాగించడమే గాక సమాచార–ప్రసార శాఖ బాధ్యతలు కూడా కట్టబెట్టడం విశేషం. గత ప్రభుత్వంలో ఆ బాధ్యతలు చూసిన అనురాగ్ ఠాకూర్‌కు ఈసారి మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం తెలిసిందే. ఆయనకు బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చని వార్తలొస్తున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌కు విద్య, పీయూష్ గోయల్‌కు వాణిజ్య, పరిశ్రమల శాఖలను కొనసాగించారు. హర్దీప్‌సింగ్ పురికి పెట్రోలియం శాఖను కొనసాగిస్తూ హౌజింగ్–పట్టణ వ్యవహారాలను తప్పించారు. తొలుత న్యాయ, తర్వాత అర్త్ సైన్సెస్ బాధ్యతలు చూసిన కిరెణ్ రిజిజుకు ప్రధానమైన పార్లమెంటరీ వ్యవహారాలు అప్పగించారు.

'మామ'కు వ్యవసాయం

రాష్ట్రాల్లో ఏళ్ల తరబడి చక్రం తిప్పి కొత్తగా మోదీ కేబినెట్లో చేరిన బీజేపీ దిగ్గజాలకు ప్రధాన శాఖలే కేటాయించారు. వారిలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్‌కు కీలకమైన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖలు దక్కాయి. ఐదేళ్ల తర్వాత కేబినెట్లో అడుగు పెట్టిన బీజేపీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డాకు మరోసారి మోదీ తొలి మంత్రివర్గంలో నిర్వర్తించిన ఆరోగ్య శాఖతో పాటు ఎరువులు–రసాయనాల శాఖ కూడా దక్కింది. ఇప్పటిదాకా ఆ రెండు శాఖలనూ మాండవీయ చూశారు. హరియాణా మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విద్యుత్‌తో పాటు పట్టణ వ్యవహారాలను అప్పగించారు. న్యాయ శాఖకు అర్జున్‌రాం మేఘ్వాల్, షిప్పింగ్‌కు సర్బానంద సోనోవాల్, పర్యావరణానికి భూపేందర్ యాదవ్, సామాజిక న్యాయానికి వీరేంద్ర కుమార్ కొనసాగారు. గిరిజన శాఖ బాధ్యతలు జ్యుయల్ ఓరంకు దక్కాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి...

మోదీ 3.0 మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు దక్కడం తెలిసిందే. వారిలో కిషన్‌కు బొగ్గు, గనులు, ఏపీ నుంచి టీడీపీకి చెందిన రామ్మోహన్‌కు విమానయానం రూపంలో కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి. గతంలో వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కూడా టీడీపీ నేత అశోక్ గజపతిరాజు పౌర విమానయాన శాఖ మంత్రిగా చేశారు. తెలంగాణ నుంచి బండి సంజయ్‌కుమార్, ఏపీ నుంచి భూపతిరాజు శ్రీనివాస వర్మ, టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రి పదవులు దక్కడం తెలిసిందే. బండికి హోం శాఖ కేటాయించారు. వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు, పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల రూపంలో రెండేసి శాఖల బాధ్యతలు అప్పగించారు.

భాగస్వాములకు ఇలా...

ఎన్డీఏ భాగస్వాముల్లో జేడీ(యూ) నేత లలన్‌సింగ్‌కు పంచాయతీరాజ్, మత్స్య–పశుసంవర్ధకం–పాడి శాఖలు దక్కాయి. వ్యవసాయ శాఖపై ఆశలు పెట్టుకున్న జేడీ(ఎస్) చీఫ్ కుమారస్వామికి ఉక్కు, భారీ పరిశ్రమల బాధ్యతలు అప్పగించారు. హెచ్ఏఎం(ఎస్) చీఫ్ జీతన్‌రాం మాంఝీకి ఎంఎస్ఎంఈ; ఎల్జేపీ (ఆర్‌వీ) అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్, టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖలు దక్కాయి. భాగస్వామ్య పక్షాలకు ఐదు కేబినెట్, రెండు స్వతంత్ర, నాలుగు సహాయ పదవులివ్వడం తెలిసిందే. ఇక స్వతంత్ర హోదా మంత్రుల్లో శివసేన నుంచి జి.పి.జాదవ్‌కు ఆయుష్, ఆరెల్డీ నేత జయంత్ చౌదరికి నైపుణ్యాభివృద్ధి శాఖలిచ్చారు.

సిక్కిం సీఎంగా ప్రేమ్ సింగ్ తమాంగ్

వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ఎస్‌కేఎం చీఫ్

గ్యాంగ్‌టక్: సిక్కిం ముఖ్యమంత్రిగా సిక్కిం క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్ సింగ్ తమాంగ్(56) వరుసగా రెండోసారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజధాని గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్‌స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య తమాంగ్, మరో 11 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్యాంగ్‌టక్‌లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఒక పూట సెలవు ప్రకటించారు. అన్ని విద్యా సంస్థలను మూసి వేయించారు. ఇటీవలి ఎన్నికల్లో అసెంబ్లీలోని 32 స్థానాలకు గాను 31 స్థానాల్లో ఎస్‌కేఎం ఘన విజయం సాధించడం తెల్సిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తమాంగ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేద్దామంటూ పిలుపునిచ్చారు.

13 అసెంబ్లీ స్థానాల్లో జూలై 10న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని నాలుగు సీట్లు సహా దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జూలై 10వ తేదీన ఉప ఎన్నికలు జరుపుతామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎమ్మెల్యేల ఆకస్మిక మరణాలు, రాజీనామాల కారణంగా ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయని వివరించింది. ఎన్నికలు జరిగే స్థానాలివీ..బిహార్‌లోని రుపౌలి, పశ్చిమబెంగాల్‌లోని రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దా, మణిక్తల, తమిళనాడులోని విక్రవండి, మధ్యప్రదేశ్‌లోని అమర్వాడ, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్, పంజాబ్‌లోని జలంధర్(పశ్చిమ), హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్. ఈ ఉప పోరుకు గాను ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఈసీ వివరించింది.

చిరుత పులి.. కాదు పిల్లి

రాష్ట్రపతిభవన్‌లో మంత్రుల ప్రమాణస్వీకారం వేళ ప్రత్యక్షమైన గుర్తుతెలియని జీవి!

న్యూఢిల్లీ: మోదీ మూడోసారి రాష్ట్రపతిభవన్‌లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో వేదిక వెనుక చిరుత పులి సంచరించిందని ఒక వీడియోను సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విస్తృతంగా షేర్ చేశారు. రాష్ట్రపతిభవన్ వెనకాలే ఢిల్లీ రిజర్వ్ ఫారెస్ట్ ఉన్న విషయం తెల్సిందే. అయితే బీజేపీ ఎంపీ దుర్గాదాస్ ఉయికే కేంద్రమంత్రిగా ప్రమాణం చేశాక రిజిస్ట్రీలో సంతకం చేసి రాష్ట్రపతి ముర్ము వైపు నడుస్తుండగా వేదిక వెనకాల స్తంభాలను దాటుతూ ఒక మోస్తరు సైజు జంతువు కనిపించింది. రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వచ్చిన చిరుతపులి రాష్ట్రపతిభవన్‌లో చొరబడిందని, ఆ వీడియోలో వెనకాల ఉన్నది అదేనని నెటిజన్లు ఖాయం చేసి సంబంధిత వీడియోను విస్తృతంగా షేర్ చేశారు. దీంతో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు సంబంధిత వీడియోపై వివరణ ఇచ్చారు. అది సాధారణ పెంపుడు పిల్లి అని, రాష్ట్రపతిభవన్‌లో ఇలాంటి పెంపుడు పిల్లులు, శునకాలు ఉన్నాయని స్పష్టంచేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేసింది.

నేడే ఒడిశా బీజేపీ శాసనసభాపక్ష భేటీ

నూతన సీఎంను ఎన్నుకోనున్న లెజిస్లేటివ్ పార్టీ సమావేశం

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్నిక ప్రక్రియ సాగుతోంది. శాసనసభలో తమ పక్ష నేతను ఎన్నుకునేందుకు మంగళవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో శాసనసభాపక్ష భేటీ జరగనుంది. ముఖ్య నేతలైన కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భూపేంద్ర యాదవ్ పర్యవేక్షకులుగా ఇప్పటికే ఒడిశా చేరుకున్నారు. బుధవారం సీఎం ప్రమాణస్వీకారరుంటుందని తోమర్ మీడియతో చెప్పారు. సీనియర్ నేత, ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర కేబినెట్‌లోకి వెళ్లడంతో మరో నేత, బ్రజరాజ్‌నగర్ ఎమ్మెల్యే సురేశ్ పూజారీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు మరింత మెరుగయ్యాయి. ముఖ్యమంత్రి పదవి రేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సమాల్, కేవీ సింగ్, మోహన్ మాఝీ తదితరులు కూడా ఉన్నారు.

రాజీనామా వార్త వట్టి అబద్ధం: సురేష్ గోపి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి తాను వైదొలగాలనుకుంటున్నట్లుగా వస్తున్న వార్తలను మలయాళ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపి ఖండించారు. ఆ వార్తలన్నీ పూర్తి అసత్యాలని స్పష్టం చేశారు. సోమవారం తన ఫేస్‌బుక్ పేజీలో... కేరళ ప్రజలకు ప్రతినిధిగా మోదీ ప్రభుత్వంలోని మంత్రి మండలిలో స్థానం పొందటం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. సహాయ మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా కొన్ని మీడియా వేదికలపై ప్రచారంలోకి వస్తున్న వార్తలు అవాస్తవాలని వివరించారు. ప్రధాని మోదీతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. ఆదివారం రాత్రి సురేష్ గోపి మీడియాతో మాట్లాడుతూ..'బీజేపీ అధిష్టానాన్ని ఏ పదవీ అడగలేదు. మంత్రి పదవి వద్దని చెప్పాను. నాకీ పదవి వద్దు. తక్షణమే ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలనుకుంటున్నాను'అని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన రాజీనామా చేస్తారంటూ వదంతులు వ్యాపించాయి.

మంత్రులు-శాఖలు

1. నరేంద్ర మోదీ	ప్రధానమంత్రి సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్షం, కీలక విధానాంశాలు, ఎవరికీ కేటాయించని ఇతర శాఖలు
కేబినెట్ హోదా	
2. రాజ్‌నాథ్‌సింగ్ (బీజేపీ)	రక్షణ
3. అమిత్ షా (బీజేపీ)	హోం, సహకార
4. నితిన్ గడ్కరీ (బీజేపీ)	ఉపరితల రవాణా, జాతీయ రహదారులు
5. జేపీ నడ్డా (బీజేపీ)	ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఎరువులు-రసాయనాలు
6. శివరాజ్‌సింగ్ చౌహాన్ (బీజేపీ)	వ్యవసాయం-రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి
7. నిర్మలా సీతారామన్ (బీజేపీ)	ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు
8. ఎస్.జైశంకర్ (బీజేపీ)	విదేశాంగ వ్యవహారాలు
9. మనోహర్‌లాల్ ఖట్టర్ (బీజేపీ)	విద్యుత్, హౌజింగ్-పట్టణ వ్యవహారాలు
10. హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్)	భారీ పరిశ్రమలు, ఉక్కు
11. పీయూష్ గోయల్ (బీజేపీ)	వాణిజ్యం-పరిశ్రమలు
12. ధర్మేంద్ర ప్రధాన్ (బీజేపీ)	విద్య
13. జితన్ రాం మాంఝీ (హెచ్ఏఎం)	సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
14. రాజీవ్ రంజన్ (లలన్) సింగ్ (జేడీయూ)	పంచాయతీరాజ్, మత్స్య-పశు సంవర్ధక-పాడి
15. సర్బానంద సోనోవాల్ (బీజేపీ)	పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్
16. వీరేంద్ర కుమార్ (బీజేపీ)	సామాజిక న్యాయం-సాధికారత
17. కె.రామ్మోహన్ నాయుడు (టీడీపీ)	పౌర విమానయానం
18. ప్రహ్లాద్ జోషి (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు-ఆహారం-ప్రజా పంపిణీ, నూతన-సంప్రదాయేతర ఇంధన వనరులు
19. జుయెల్ ఓరం (బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
20. గిరిరాజ్‌సింగ్ (బీజేపీ)	జౌళి పరిశ్రమలు
21. అశ్వినీ వైష్ణవ్ (బీజేపీ)	రైల్వే, సమాచార-ప్రసార, ఐటీ-ఎలక్ట్రానిక్స్
22. జ్యోతిరాదిత్య సింధియా (బీజేపీ)	కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
23. భూపేందర్ యాదవ్ (బీజేపీ)	పర్యావరణ-అటవీ-వాతావరణ మార్పులు
24. గజేంద్రసింగ్ షెకావత్ (బీజేపీ)	సాంస్కృతిక, పర్యాటక
25. అన్నపూర్ణాదేవి (బీజేపీ)	మహిళా-శిశు సంక్షేమం
26. కిరెణ్ రిజిజు (బీజేపీ)	పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాలు
27. హర్దీప్‌సింగ్ పురి (బీజేపీ)	పెట్రోలియం-సహజ వాయువులు
28. మన్‌సుఖ్ మాండవీయ (బీజేపీ)	కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడలు
29. జి.కిషన్‌రెడ్డి (బీజేపీ)	బొగ్గు, గనులు
30. చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ)	ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
31. సి.ఆర్.పాటిల్ (బీజేపీ)	జలశక్తి
సహాయ మంత్రులు - స్వతంత్ర హోదా	
32. రావ్ ఇందర్‌జీత్ సింగ్ (బీజేపీ)	గణంకాలు-కార్యక్రమాల అమలు (స్వతంత్ర), ప్రణాళిక (స్వతంత్ర), సాంస్కృతిక
33. జితేంద్రసింగ్ (బీజేపీ)	సైన్స్ అండ్ టెక్నాలజీ (స్వతంత్ర), అర్త్ సైన్సెస్ (స్వతంత్ర), ప్రధాని కార్యాలయం, సిబ్బంది- ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్షం
34. అర్జున్‌రాం మేఘ్వాల్ (బీజేపీ)	న్యాయ (స్వతంత్ర), పార్లమెంటరీ వ్యవహారాలు
35. ప్రతాప్‌రావ్ జాదవ్ (శివసేన)	ఆయుష్ (స్వతంత్ర), ఆరోగ్య-కుటుంబ సంక్షేమం
36. జయంత్ చౌధరి (ఆరెల్డీ)	నైపుణ్యాభివృద్ధి-ఎంట్రప్రెన్యూర్‌షిప్ (స్వతంత్ర), విద్య
సహాయ మంత్రులు	
37. జితిన్ ప్రసాద (బీజేపీ)	వాణిజ్యం-పరిశ్రమలు, ఐటీ-ఎలక్ట్రానిక్స్
38. శ్రీపాద యశో నాయక్ (బీజేపీ)	విద్యుత్, నూతన-సంప్రదాయేతర ఇంధన వనరులు
39. పంకజ్ చౌధరి (బీజేపీ)	ఆర్థిక
40. కృషన్‌పాల్ గుర్జర్ (బీజేపీ)	సహకార
41. రామ్‌దాస్ అథవాలె (ఆర్‌పీఐ)	సామాజిక న్యాయం-సాధికారత
42. రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ)	వ్యవసాయం-రైతు సంక్షేమం
43. నిత్యానంద్ రాయ్ (బీజేపీ)	హోం
44. అనుప్రియా పటేల్ (అప్నాదళ్)	ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, రసాయనాలు-ఎరువులు
45. వి.సోమన్న (బీజేపీ)	జల శక్తి, రైల్వే
46. చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ)	గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లు
47. ఎస్పీ సింగ్ భగెల్ (బీజేపీ)	మత్స్య-పశు సంవర్ధక-పాడి, పంచాయతీరాజ్
48. శోభా కరంద్లాజె (బీజేపీ)	సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక-ఉపాధి
49. కీర్తివర్ధన్ సింగ్ (బీజేపీ)	పర్యావరణ-అటవీ-వాతావరణ మార్పులు, విదేశాంగం
50. బి.ఎల్.వర్మ (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు, ఆహార-ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం-సాధికారత
51. శాంతను ఠాకూర్ (బీజేపీ)	పోర్టులు-షిప్పింగ్-వాటర్‌వేస్
52. సురేశ్ గోపీ (బీజేపీ)	పెట్రోలియం-సహజ వాయువు, పర్యాటకం
53. ఎల్.మురుగన్ (బీజేపీ)	సమాచార-ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాలు
54. అజయ్ టంటా (బీజేపీ)	ఉపరితల రవాణా-జాతీయ రహదారులు
55. బండి సంజయ్‌కుమార్ (బీజేపీ)	హోం
56. కమలేశ్ పాశ్వాన్ (బీజేపీ)	గ్రామీణాభివృద్ధి
57. భగీరథ్ చౌధరి (బీజేపీ)	వ్యవసాయం-రైతు సంక్షేమం
58. సతీశ్‌చంద్ర దూబె (బీజేపీ)	బొగ్గు, గనులు
59. సంజయ్ సేథ్ (బీజేపీ)	రక్షణ
60. రవ్‌నీత్‌సింగ్ బిట్టూ (బీజేపీ)	ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, రైల్వే
61. దుర్గాదాస్ ఉయికే (బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
62. రక్షా నిఖిల్ ఖడ్సే (బీజేపీ)	క్రీడలు-యువజన వ్యవహారాలు
63. సుకాంత మజుందార్ (బీజేపీ)	విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
64. సావిత్రీ ఠాకూర్ (బీజేపీ)	మహిళా-శిశు సంక్షేమం
65. తోఖన్ సాహు (బీజేపీ)	హౌజింగ్-పట్టణ వ్యవహారాలు
66. రాజ్‌భూషణ్ చౌధరి (బీజేపీ)	జల శక్తి
67. భూపతిరాజు శ్రీనివాస వర్మ (బీజేపీ)	భారీ పరిశ్రమలు, ఉక్కు
68. హర్ష్ మల్హోత్రా (బీజేపీ)	కార్పొరేట్ వ్యవహారాలు, ఉపరితల రవాణా-జాతీయ రహదారులు
69. నిమూబెన్ బంభానియా (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు-ఆహారం-ప్రజా పంపిణీ
70. మురళీధర్ మొహోల్ (బీజేపీ)	సహకార, పౌర విమానయాన
71. జార్జి కురియన్ (బీజేపీ)	మైనారిటీ వ్యవహారాలు, మత్స్య-పశు సంవర్ధక-పాడి
72. పబిత్రా మార్గరీటా (బీజేపీ)	విదేశాంగం, జౌళి

'కేబినెట్'కూ పనికిరామా: శివసేన

ముంబై: కేంద్ర మంత్రివర్గ కూర్పుపై మహారాష్ట్రలో ఎన్డీఏ భాగస్వాములు శివసేన, ఎన్సీపీ గుర్రుగా ఉన్నాయి. కేబినెట్ హోదా మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రెండు పార్టీలకూ బీజేపీ ఒక్కో స్వతంత్ర హోదా సహాయ మంత్రి పదవి ఆఫర్ చేయడం, ఎన్సీపీ తిరస్కరించడం తెలిసిందే. అవసరమైతే వేచి చూస్తాం తప్ప సహాయ పదవి తీసుకునేది లేదని కుండబద్దలు కొట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీకి ఒకే స్థానం దక్కింది. మరోవైపు ఏడు సీట్లు గెలుచుకున్న తమకు తమకు ఒకే బెర్తు ఇవ్వడం, అది కూడా స్వతంత్ర హోదా పదవి కావడంపై శివసేన ఆగ్రహంగా ఉంది. బీజేపీకి పాత మిత్రులమన్న కారణంగానైనా కనీసం కేబినెట్ హోదా ఇస్తారని ఆశించామని పార్టీ చీఫ్ విప్ శ్రీరంగ్ బర్నే అన్నారు. ''ఐదు సీట్లే ఉన్న ఎల్జేపీ, రెండే గెలిచిన జేడీ(ఎస్), ఒకే ఒక్క స్థానమున్న హెచ్ఏఎం కేబినెట్ బెర్తులు దక్కించుకున్నాయి. మాకేమో ఏడు స్థానాలున్నాయి'' అంటూ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కేంద్రంలో ఎన్డీఏ సర్కారుకు తమది బేషరతు మద్దతని, అందుకు ప్రతిగా అధికారంలో వాటా కోసం ఎలాంటి బేరసారాలూ చేయడం లేదని శివసేన లోక్‌సభా పక్ష నేత శ్రీకాంత్ షిండే స్పష్టం చేశారు. గతంలోనే కేబినెట్ మంత్రిగా ఉన్న తాను సహాయ పదవి చేపట్టడమంటే స్థాయి తగ్గించుకోవడమేనని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ ఆదివారం మోదీ మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి ముందు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.

సేన, ఎన్సీపీలపై విపక్ష మహా వికాస్ అగాడీ చెణుకులు విసిరింది. బానిసలుగా మారితే ఇలాగే ఉంటుందంటూ శివసేన (ఉద్ధవ్) అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ఎద్దేవా చేశారు. వాడుకుని వదిలేసే బీజేపీ నైజం ఆ రెండు పార్టీలకూ మరోసారి తెలిసొచ్చిందన్నారు. ఎన్సీపీకి మోదీ కేబినెట్‌లో చోటు ఇక కలేనని కాంగ్రెస్ జోస్యం చెప్పింది.



అంగన్‌వాడీలో అనర్హులకు చెక్

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలను అరికట్టేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. లబ్ధిదారుల వివరాలు ఆధార్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తోంది. 8లో▸



రాజన్న సన్నిధిలో రద్దీ

వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

బండికి హోంశాఖ

- సహాయ మంత్రిగా ఎంపీ సంజయ్‌కుమార్‌కు అవకాశం
- 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు దక్కిన అవకాశం
- గతంలో చెన్నమనేని విద్యాసాగర్ రావుకు ఇదే శాఖ కేటాయింపు
- సంబరాల్లో మునిగితేలిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ సోమవారం సాయంత్రం విడుదల చేసిన కేంద్ర మంత్రుల జాబితాలో ఆయనకు పదవి ఖరారైంది. ఆదివారం సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనకు ఈ శాఖను కేటాయించడంతో 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు మళ్లీ అదే శాఖ దక్కినట్లయింది. 1999లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి ప్రధాని వాజ్‌పేయి కేబినేట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. తర్వాత 2019లో కిషన్‌రెడ్డికి సైతం ఇదే పదవి వచ్చింది. ఇప్పుడు సంజయ్‌కి హోంశాఖ సహాయమంత్రి ఇవ్వడంతో బీజే పీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

ఇకపై పటిష్ట భద్రత

ఇప్పటివరకు ఎంపీ సంజయ్‌కుమార్‌ని ఎప్పుడు కావాలంటే అప్పుడు కలిసే వీలుండేది. ఆయన కేంద్ర సహాయ మంత్రి అయినప్పటికీ.. నేరుగా కలిసే వీలుంటుందని అంతా అనుకున్నారు. కానీ, అనూహ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిత్వ శాఖను కేటాయించడంతో సహచరులు, అభిమానులు కాస్త డీలా పడ్డారు. ఈ శాఖ వల్ల ముందస్తు అపాయింట్‌మెంట్, తనిఖీలు లేకుండా ఎంపీ సంజయ్‌ని కలువడం సాధ్యం కాదు. ఇకపై ఆయన పటిష్ట భద్రత, నిఘా మధ్యనే తన పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

ఎంపీగా పోలీసులతో తలపడ్డారు..

2019లో సంజయ్‌కుమార్ తొలిసారి ఎంపీగా గెలిచారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌పై పోరులో భాగంగా ఆయన ఎక్కువసార్లు పోలీసులతోనే తలపడాల్సి వచ్చింది. దుబ్బాక ఎన్నిక సమయంలో సిద్దిపేట సీపీ జోయల్ డేవిస్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో అప్పటి సీపీ అంజనీ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో అప్పటి సీపీ సత్యనారాయణ, పదోతరగతి ప్రశ్నపత్రం లీకేజీ సమయంలో అప్పటి వరంగల్ సీపీ రంగనాథ్, కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడితో మాటల యుద్ధం కొనసాగించారు. సీపీ సత్యనారాయణతోపాటు పలువురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు కూడా చేశారు. అలాంటిది ఇప్పుడు వారి శాఖకే కేంద్ర సహాయ మంత్రిగా రావడం చర్చనీయాంశంగా మారింది.

ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీరియస్

ఇటీవల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రిటైర్డ్ పోలీసు అధికారి ప్రభాకర్‌రావు పైనా సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం సంజయ్‌కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి రావడంతో గత ప్రభుత్వంలో ఆయనపై నిఘా ఉంచిన పోలీసు అధికారుల్లో అభద్రతాభావం నెలకొంది. తనతోపాటు కుటుంబసభ్యులు, సిబ్బందిపై అనధికారికంగా నిఘా ఉంచి, వ్యక్తిగత కాల్స్‌ను చాటుగా విన్న విషయంపై బండి ఇప్పటికీ గుర్రుగానే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తప్పకుండా ఆయన ప్రభుత్వాన్ని నివేదిక కోరే అవకాశం ఉందని అనుచరులు వ్యాఖ్యానించడం కరీంనగర్ పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

- పకడ్బందీగా బదిలీలు, పదోన్నతులు
- బడిబాటతో పాఠశాలలను బలోపేతం చేస్తాం
- పదిరోజుల్లో ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో జనార్దన్‌రావు



కరీంనగర్: 'ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది. ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనంతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు గ్రామాల్లో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు భాగస్వాములు కావాలి' అని డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు సూచించారు. ఈనెల 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వెల్లడించారు.

పాఠశాలల నిర్వహణ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

ఈ నెల 12నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత దుస్తులు, పుస్తకాలు అందించేందుకు ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. ఈ విషయమై కలెక్టర్ అధ్యక్షతన ఇప్పటి వరకే రెండుసార్లు సమీక్ష జరిగింది. పాఠశాలల్లో పరిశుభ్రత, తరగతుల నిర్వహణపై కమిటీలు వేశాం. ఆ బాధ్యతను మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు అప్పగించాం.

జిల్లాలో ఎన్ని పాఠశాలలు, విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలలు మొత్తంగా 698 ఉన్నాయి. వీటిలో 62,251 మంది విద్యార్థులు చదువుతున్నారు. 4,66,644 పాఠ్యపుస్తకాలు అవసరం. ఇప్పటికే 1,20,000 పుస్తకాలు గోడౌన్‌లో నిల్వ ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో ఎమ్మార్సీలకు సరఫరా అవుతాయి. ఉచిత దుస్తులు, నోట్ బుక్కులు సకాలంలో అందేలా చూస్తున్నాం.

మౌలిక వసతుల పరిస్థితి ఏమిటి?

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు పూర్తయ్యాయి. అవసరమున్న పాఠశాలల్లో విద్యుత్ మరమ్మతులు, సంపుల నిర్మాణాలు, ఇతర మరమ్మతులు కొనసాగుతున్నాయి. వారంరోజుల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తిచేస్తాం. జిల్లావ్యాప్తంగా 230 పాఠశాలలు 'మనఊరు- మన బడి' కార్యక్రమానికి ఎంపికయ్యాయి. పైలట్ ప్రాజెక్టుగా 48పాఠశాలల్లో పనులు పూర్తిచేశాం. మిగతా 182 పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. అమ్మ - ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని 345 పాఠశాలల్లో రూ.14.19 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

బడిబాట ఎలా సాగుతోంది?

ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, అన్నిశాఖల సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. బడి బయటున్న బడీడు పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేరేవిధంగా కార్యక్రమాలు ముమ్మురంగా నిర్వహిస్తున్నాం. తద్వారా విద్యార్థుల సంఖ్య పెంచేలా చూస్తున్నాం.

సర్వీస్ పర్సన్స్‌ను ఎలా తొలగించారు?

ప్రభుత్వం సర్వీస్ పర్సన్లను తొలగించిన విషయం వాస్తవమే. పాఠశాలల్లో పరిశుభ్రత విషయం ప్రభుత్వం గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించింది. ఏ రోజుకారోజు స్థానిక ప్రజాప్రతినిధులు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించేలా కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

ఉపాధ్యాయుల కొరత ఉందా?

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. కొత్త జిల్లాల వారీగా ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా 492 ఖాళీలు ఉన్నాయి. పదోన్నతులు, బదిలీ ప్రక్రియ ఈ నెల 22లోపు పూర్తవుతుంది. ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. మిగిలిన ఖాళీలకు సంబంధించి బదిలీ ప్రక్రియ పూర్తికాగానే నియామకాలు చేపట్టే అవకాశం ఉంది.

మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాం. ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడిని నియమించి వంటవండే చోట జాగ్రత్తలు తీసుకుంటాం. పాఠశాలల్లో వేసవి సెలవులకు ముందు నిల్వఉన్న బియ్యం, పప్పులు, ఉప్పులు, నూనెలు వాడొద్దని సూచించాం. అన్ని వస్తువులు, తాజా కూరగాయలు వాడుకునే విధంగా ఏర్పాట్లు చేశాం.

ఇంకా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ పమేలా సత్పతి పాఠశాలల నిర్వహణపై నాలుగుసార్లు సమావేశమై డిస్ట్రిక్ట్ లెవల్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అన్ని విభాగాల అధికారులు ఉన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సమయానికి మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రపర్చడం, పాఠశాలల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నాం.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని సప్తగిరికాలనీ పాఠశాలలో భాషా పండితులు, పీఈటీల ధ్రువపత్రాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, గ్రేడ్-2 భాషా పండితులు, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందనున్నారు. వీరికి సంబంధించిన ధ్రువపత్రాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. డీఈవో జనార్దన్‌రావు పర్యవేక్షించారు. జిల్లాకు పదోన్నతులపై బదిలీతో వచ్చే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఖ్యతో పాటు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, పండిట్, పీఈటీల సంఖ్యను అధికారులు తేల్చారు. సోమవారం పండిట్, పీఈటీ ఉపాధ్యాయుల సర్వీసు రిజిష్టర్ల పరిశీలన పూర్తి చేశారు. ప్రక్రియ 30తో ముగియనుంది. సజావుగా కొనసాగితే జూలై 1నుంచి బదుల పనితీరు గాడిన పడనుంది.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కరీంనగర్‌సిటీ: తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024 (టీజీ పీఈసెట్)ను శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ పేర్కొన్నారు. తొలిరోజు పరీక్షలకు 478 మంది విద్యార్థులు హాజరయ్యారు. పురుషులకు 100మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ పరీక్షలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్, ప్రభాకర్‌రావు, నజీముద్దీన్‌మునావర్ పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,350



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. సోమవారం మార్కెట్‌కు 19 వాహనాల్లో 315 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,800కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

రక్షణ కల్పించాలని ఉద్యోగుల ధర్నా

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ ఘనీకృత ఆంబోతుల వీర్య కేంద్రంలోని ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని సదరు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సోమవారం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టగా డీడీ భిక్షపతి హామీతో విరమించారు. చింతకుంటకు చెందిన రాచకొండ భిక్షపతి ఆంబోతుల వీర్యకేంద్రంలో టైమ్‌స్కేల్ లేబర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆదివారం దున్నపోతు పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆగ్రహించిన ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలకు భరోసా ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే వైద్య ఖర్చులను భరించాలని, బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని డీడీ భిక్షపతి వివరించడంతో తిరిగి విధుల్లో చేరారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

కరీంనగర్: గతేడాది కోర్టు కేసు కారణంగా నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తిరిగి విడుదల చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, కేతిరి తిరుపతిరెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఆర్‌టీయూ ప్రతినిధులు ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తిరిగి విడుదల చేయించడం జరిగిందన్నారు. భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఎస్జీటీలు ప్రమోషన్ అవకాశాలు కోల్పోతూ నష్టపోతున్నారని తెలిపారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టు మంజూరు చేస్తూ ఈ షెడ్యూల్‌లోనే భర్తీ చేయాలని అన్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

- వరదల నివారణకు చర్యలు తీసుకోవాలి
- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి డి.సీతక్క



వీసీలో పాల్గొన్న మంత్రి సీతక్క, జిల్లా అధికారులు

కరీంనగర్: వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలను స్వచ్ఛతతో తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి డి.సీతక్క ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వర్షాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, స్కూల్ యూనిఫామ్స్ తయారీపై వీసీ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో మంచినీరు కలుషితం కాకుండా ట్యాంకులను తరచూ శుభ్రపరచాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల నియంత్రణకు కృషి చేయాలని, విష జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పురాతన ఇండ్లను గుర్తించాలని, ఎలాంటి నష్టం ఏర్పడకుండా చూడాలని వివరించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి సీతక్కకు వివరించారు. విష జ్వరాలు, డెంగీ ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో షిల్ట్ తొలగించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, స్కూల్ యూనిఫామ్స్ 96శాతం పూర్తయ్యాయని, మంగళవారం వరకు సిద్ధం చేసి ఉంచుతామని వివరించారు. మిషన్ భగీరథ పథకం అమలు తీరుపై సర్వే వేగవంతంగా చేపడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ సమస్యలు పరిష్కరించాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండికి వెలిచాల విజ్ఞప్తి

కరీంనగర్ కార్పొరేషన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు కోరారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలన్నారు. కరీంనగర్‌కు ట్రిపుల్‌ఐటీ తీసుకురావాలన్నారు. సిరిసిల్లకు చేనేత సాంకేతిక కేంద్రాన్ని తేవాలని కోరారు. కరీంనగర్- వరంగల్, హన్మకొండ- సిద్దిపేట హైవే పనులు, తీగలగుట్టపల్లి, ఉప్పల్ బ్రిడ్జిలను వేగవంతం చేయాలన్నారు. సిరిసిల్ల లో నవోదయ కేంద్రం ఏర్పాటు చేయాలని, స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతిని వెలికి తీయాలన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రతీరోజు రైలు నడిచేలా చూడాలన్నారు. హైదరాబాద్, మనోహరాబాద్, సిద్దిపేటకు వచ్చిన రైల్వేలైను కరీంనగర్‌కు అతి త్వరగా కనెక్ట్ చేయాలని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఆలయాలకు నిధులు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

సమస్యల జాతర

- కలెక్టరేట్‌లో ఎటు చూసినా జనమే
- అత్యధికం భూ సమస్యలే
- ప్రజావాణిలో ఒక్కొక్కరిది ఒక్కోగాథ
- సుమారు 300 అర్జీలు స్వీకరించిన అధికారులు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి జనజాతరను మరిపించింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల విరామం తరువాత కార్యక్రమం ప్రారంభం కావడంతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. సుమారు 300మంది తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు అర్జీలను స్వీకరించారు. ఇన్నాళ్లు ప్రజలు ఉన్నతాధికారులను కలిసే అవకాశం లేకపోవడమే అర్జీలు పెరగడానికి కారణమని స్పష్టమవుతోంది. ప్రధానంగా భూ సమస్యలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లకు అర్జీలు అందజేశారు. ఈసారైనా త్వరగా సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు.

మా భూమిని వేరేవారికి రాశారు



నా పేరు సతీశ్. చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లిలో మా తాత చిమ్మల్ల బీరయ్య, నా పేరున జాయింట్ దస్తావేజు ప్రకారం సర్వే నంబర్ 101/బిలో 1.20ఎకరాల భూమి ఉంది. తాత, నా తండ్రి, ఇప్పుడు మేము కాస్తులో ఉండి సాగు చేసుకుంటున్నాం. మేము ఎవరికి భూమిని విక్రయించలేదు. కానీ ధరణి పోర్టల్‌లో ఇతరుల పేరిట నమోదైంది. విచారణ చేసి న్యాయం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

– చిమ్మల్ల సతీశ్, పెద్దకుర్మపల్లి, చొప్పదండి

కౌలుకిచ్చినందుకు గోస పెడుతుండు



మా తాత మోకినపల్లి జక్కయ్యకు సర్వే నంబర్ 27/ఈలో 0.25గుంటల భూమి ఉంది. కుటుంబ పోషణ కష్టమవడంతో చింత కనకయ్యకు కౌలుకు ఇచ్చి బెల్లంపల్లికి వలస వెళ్లాం. కొన్నేళ్లు కౌలు డబ్బులు ఇవ్వగా ప్రస్తుతం ఇవ్వకపోగా భూమిని ఆక్రమించారు. ఇదెక్కడి అన్యాయమని అడిగితే దుర్భషలాడుతున్నారు. మా తండ్రి పోచయ్య పేరున విరాసత్ చేయాలని అధికారులను కలిస్తే చేయడం లేదు. భూమిని మేము సాగు చేసుకుందామని వెళితే దాడులు చేస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

– విజయ, సృజన, గొడిశాల, సైదాపూర్

ఉద్యోగమని మోసం చేశారు



మాది ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్. 13ఏళ్ల నుంచి కరీంనగర్‌లో ఉంటున్నం. నా భర్త పాన్‌టేలా నడుపుతుండగా తాడికల్‌కు చెందిన మాచర్ల రాజయ్య ప్రభుత్వ ఆస్పత్రిలో జీఎన్‌ఎం నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పడంతో దఫాలుగా రూ.3లక్షలు ఇచ్చాం. జాబ్ రాకపోగా డబ్బులిస్తానని బాండ్‌పేపర్ రాసిచ్చి తిప్పుకుంటున్నాడు. ఇదేంటని అడిగితే కులం పేరుతో దూషిస్తున్నాడు. నా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– మౌల్కర్ కవిత, కరీంనగర్

మురికి కాలువలు నిండినా చర్యలేవి?



మాది నగరంలోని 19వ డివిజన్ విజయపురి పాతగ్రామ పంచాయతీ వెనుకవైపు గల ఎస్సీ నేతకాని వీధి. పేరుకు స్మార్ట్‌సిటీ కానీ ఆచరణలో పల్లెలకన్నా అధ్వానం. మురికి కాలువలు పూడికతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. సమస్యకు పరిష్కారం చూపాలి.

– కాలనీవాసులు, రేకుర్తి, కరీంనగర్

ధ్రువీకరణ పత్రాలేవి..?



హుజూరాబాద్ నియోజకవర్గంలో దివ్యాంగుల కోసం 2021లో ప్రత్యేక సదరం క్యాంపు నిర్వహించారు. కానీ ఇప్పటివరకు వారికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదు. వివరాలు ఆన్‌లైన్ చేయకుండా దివ్యాంగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. సదరం క్యాంపు ఎందుకు నిర్వహించినట్టు.. ఎందుకు తిప్పుకుంటున్నట్టు..?

– జక్కం సంపత్, వీహెచ్‌పీఎస్ జిల్లా నేత

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ షురూ

- బల్దియా కార్యాలయంలో దరఖాస్తుదారుల రద్దీ



కార్యాలయంలో కౌంటర్ వద్ద రద్దీ

కరీంనగర్ కార్పొరేషన్: సుదీర్ఘ విరామం అనంతరం ప్రజాపాలన సవరణ దరఖాస్తుల స్వీకరణ తిరిగి సోమవారం ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా కొన్ని నెలల పాటు దరఖాస్తుల స్వీకరణ, సవరణ నిలిచిపోయింది. ప్రస్తుతం కోడ్ ఎత్తివేయడంతో సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు కౌంటర్లలో దరఖాస్తుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. చాలా రోజుల తరువాత కౌంటర్లు తెరుచుకోవడంతో దరఖాస్తుదారులు తరలివస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి నగరవ్యాప్తంగా పది కౌంటర్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులు అధికసంఖ్యలో ఉండడంతో, రాబోయే రోజుల్లో రద్దీ మరింత పెరుగుతుందని తెలిపారు. 60డివిజన్లకు గాను ఆరు డివిజన్లకు ఒకటి చొప్పున పది కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసినవారిలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, సరిళ్ల ప్రసాద్, గంట కల్యాణి శ్రీనివాస్, బండ సుమ రమణారెడ్డి, సల్లా శారద రవీందర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని రాయికల్ తండా పరిధి ఘనపూర్ తండాకు చెందిన బానోత్ ఆంజనేయులు(18) బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై ఆరోగ్యం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బానోత్ మోతీలాల్–మంగ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు ఆంజనేయులు డిగ్రీ ఫస్టియర్ చదివి, ఆపేశాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు రాత్రంతా వెతికినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ బావుల వద్ద వెతకగా ఘనపూర్ తండా శివారులోని బావి వద్ద చెప్పులు, ఫోన్ కనిపించాయి. కరెంట్ మోటార్ ద్వారా బావి లో నీటిని తోడేయగా ఆంజనేయులు మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎర్రకుంటలో పడి వ్యక్తి ..


లచ్చయ్య (ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన కుడుదుల లచ్చయ్య(55) స్థానిక ఎర్రకుంటలో పడి మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లచ్చయ్య ప్రతీరోజు ఉదయం గేదెలను ఎర్రకుంట వద్ద వదిలిపెట్టి, సాయంత్రం ఇంటికి తోలుకువచ్చేవాడు. అతను నిత్యం మద్యం మత్తులోనే ఉంటాడు. ఆదివారం కూడా జీవాలను ఎర్రకుంట సమీపంలో వదిలిపెట్టి వచ్చి, సాయంత్రం తోలుకువచ్చేందుకు వెళ్లాడు. మద్యం మత్తులో కాలుజారి ఎర్రకుంటలో పడిపోయాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. స్థానికులకు సోమవారం ఉదయం ఎర్రకుంటలో లచ్చయ్య మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామానికి చెందిన పడాల రజిత (38) కరీంనగర్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిందని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. రజిత తన కుటుంబీకులతో కలిసి ఆదివారం ఆరు బయట నిద్రిస్తుండగా పాటుకాటు గురైంది. కుటుంబసభ్యులు వెంటనే పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి భర్త వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి అనిల్ సోమవారం పని నిమిత్తం బైక్‌పై కేశవపట్నం వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా రాజాపూర్ శివారులో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. అనిల్‌కు తీవ్ర గాయాలవగా స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి, అతన్ని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె

కరీంనగర్‌రూరల్: మండలంలోని దుబ్బపల్లిలో రైతు మోతె శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధితుడి కథనం ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి సోమవారం గేదెలను మేపుతున్నాడు. ఓ గేదె సమీపంలోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతం సంభవించి, మృతిచెందింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బాధిత రైతును అడిగి తెలుసుకున్నారు. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, విద్యుత్‌శాఖ పరిహారం అందించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరాడు.

'అంగన్‌వాడీ'లో అనర్హులకు చెక్

- కేంద్రాల్లో అక్రమాలను అరికట్టేందుకు సర్కారు చర్యలు
- లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్
- ఆధార్ అనుసంధానం
- న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ యాప్ ద్వారా ప్రత్యేక కార్యక్రమం
- 90 శాతం ప్రక్రియ పూర్తి
- కరీంనగర్ జిల్లాలో 4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు


వివరాలు నమోదు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కరీంనగర్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోంది. కరీంనగర్ జిల్లాలో మాతాశిశు సంరక్షణను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తోంది. అయితే, కొందరు నిర్వాహకులు బోగస్ లబ్ధిదారులను చేర్చి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రయోజనం పొందేలా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు సర్కారు చర్యలు ప్రారంభించింది. మార్చి నెల నుంచి లబ్ధిదారుల వివరాలను న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో నమోదు చేస్తూ ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ తుది అంకానికి(90 శాతం) చేరుకుంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. మిగిలిన 10 శాతం నమోదు ప్రక్రియను పూర్తి చేసే పనిలో ఐసీడీఎస్ అధికారులు నిమగ్నమయ్యారు.

ఆరోగ్యలక్ష్మి పథకం కింద..

జిల్లాలో కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, గంగాధర, హుజూరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 4,544, బాలింతలు 14,689, ఏడాది నుంచి ఏడేళ్లలోపు వయసున్న చిన్నారులు 19,989 మంది ఉన్నారు. వీరందరూ పోషకాహార లోపంతో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి పథకం కింద అంగన్‌వాడీల ద్వారా ప్రతీరోజు సంపూర్ణ మధ్యాహ్న భోజనం కోసం అవసరమైన రేషన్ బియ్యాన్ని ఇంటికే పంపిణీ చేస్తోంది. ఏడేళ్లలోపు పిల్లలకు రోజుకో గుడ్డు, స్నాక్స్, కేంద్రంలోనే భోజనం, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు రెండున్నర కిలోల బాలామృతం, గుడ్లు ఇంటికి ఇస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు కేంద్రంలో పౌష్టికాహారం, ఒక గుడ్డు, 200 మిల్లీమీటర్ల పాలు అందిస్తున్నారు. రోగ నిరోధక టీకాలు క్రమం తప్పకుండా తీసుకునేలా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

అనర్హుల తొలగింపు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు లబ్ధిదారుల వివరాలను పక్కాగా సేకరిస్తున్నారు. ఇప్పటికే న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ యాప్‌లో గర్భిణులు, బాలింతల వివరాలు నమోదు చేసి, ఆధార్ అనుసంధానించారు. ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందజేశారు. అయితే, చిన్నారుల ఆధార్ సంఖ్య లేకపోవడంతో తప్పుడు లెక్కలు చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే అనర్హుల పేర్లు తొలగింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ నెలలోనే పూర్తి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులకు ఉత్తర్వులు అందాయి. ప్రతీ కేంద్రం పరిధిలో సిబ్బంది ఇంటింటికీ వెళ్తున్నారు. కుటుంబసభ్యుల కులం, ఉపకులం, వయసు, ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేస్తున్నారు. అంగవైకల్యంతో బాధపడుతుంటే వారి వివరాలనూ పొందుపరుస్తున్నారు.

ప్రాజెక్టుకు ఒకరి చొప్పున శిక్షణ

ఐసీడీఎస్ ప్రాజెక్టుకు ఒకరి చొప్పున అంగన్‌వాడీ పర్యవేక్షకులకు ఆధార్ జారీపై హైదరాబాద్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో శిక్షణనిచ్చారు. మిగిలిన పర్యవేక్షకులకు జిల్లా కేంద్రాల్లోనే శిక్షణ పూర్తి చేశారు. వీరికి ఆధార్ నమోదుకు అవసరమైన ట్యాబ్‌లతోపాటు కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఆధార్ శిబిరాల నిర్వహణ ప్రక్రియ ప్రారంభించారు. ఆధార్‌కార్డులు ఎంత మందికి ఉన్నాయి.. లేని వారు ఎంత మంది అనే వివరాలు సేకరిస్తున్నారు. లేనివారికి కార్డు జారీ చేయడంతోపాటు రెండుచోట్ల పేరు ఉంటే తొలగిస్తున్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధి పొందుతున్న చిన్నారులందరికీ ఆధార్‌కార్డును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. కుటుంబ సర్వే ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు నమోదు చేస్తున్నాం. దీనివల్ల ఆధార్‌కార్డు లేని చిన్నారులందరూ దాన్ని పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల పేర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నాం. అనర్హులను తొలగిస్తున్నాం. దీంతో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేసే అవకాశం ఉంటుంది.

– సరస్వతి, డీడబ్ల్యూవో

పదోన్నతుల్లో అన్యాయం


సైలో ఎక్కి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు


కార్మికులతో ఫోన్లో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు, కంపెనీ అధికారులు

- 'కేశోరాం' కాంట్రాక్ట్ కార్మికుల ఆరోపణ
- సైలో పైకి ఎక్కి నిరసన
- అధికారులు, నాయకుల హామీతో ఆందోళన విరమణ

పాలకుర్తి(రామగుండం): పదోన్నతులు కల్పించడంలో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం 150 మీటర్ల ఎత్తులోని బెండింగ్ సైలో పైకి ఎక్కి నిరసన తెలిపారు. కంపెనీలోని 25మందికి కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా ఇటీవల పదోన్నతి కల్పించారు. సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతి కల్పించారని దాదాపు 18మంది కార్మికులు కంపెనీ ఆవరణలోని ×సైలో× పైకి ఎక్కి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటామని భీష్మించుకుని కూర్చున్నారు. దాదాపు రెండుగంటల పాటు ఆందోళన చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం అందుకున్న ఎస్సై స్వామి పోలీసు సిబ్బంది, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల అధ్యక్షులు బయ్యపు మనోహర్‌రెడ్డి, సూర సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి తమ అనుచరులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాంట్రాక్ట్ బేసిక్ విషయంపై ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథితో నాయకులు చర్చలు జరిపారు. అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. జాబితా పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కాగా కంపెనీ తీరుపై కార్మికవర్గాల్లో తీవ్రఅసంతృప్తి నెలకొంది. ఏటా చేపట్టే పదోన్నతుల్లో సీనియర్లకు బదులు జూనియర్లకు పదోన్నతి కల్పించడం, అర్హులు ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. గతంలోనూ ఇదే సైలో ఎక్కి కొందరు ఆత్మహత్యకు యత్నించారు. దాదాపు పదేళ్ల కిత్రం ఒక కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య కూడా చేసుకున్నాడు. అయినా.. అధికారుల పద్ధతి మారడం లేదనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 20ఏళ్లుగా పనిచేస్తున్న వారు ఇప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులుగానే కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్‌ల ఒత్తిడితోనే పదోన్నతుల విషయంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ట్రినిటీ' ప్రతిభ


హనీకర్

కరీంనగర్: ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జె.హనీకర్ ఆలిండియా 19వ ర్యాంకు, రఘుపతి 124, అజయ్ 195, బి.రంజిత్‌కుమార్ 1,005, నిస్సీ జాస్పర్ 1,213, ఆశిష్ 1,261, జతిన్ 1,645, పి.ప్రజ్వల్ 2,281వ ర్యాంకు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురు సింగరేణి అధికారులకు పదోన్నతి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా పలువురు అధికారులకు పదోన్నతి కల్పిస్తూ, బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పర్సనల్ జీఎంగా శామ్యూల్ సుధాకర్ నియమితులయ్యారు. సంస్థ సూపర్‌బజార్ ఏజీఎంగా ఉన్న ఆయనను జీఎం వెల్ఫేర్, రిక్రూట్‌మెంట్ సెల్‌కు బదిలీ చేశారు. అలాగే, ఏజీఎం నికోలస్‌ను ఏజీఎం ఎడ్యుకేషన్ నుంచి జీఎం ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించి, బదిలీ చేశారు. ఎడ్యుకేషన్ జీఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావును ఎస్‌వోటూ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా పంపారు. నలుగురు ఈఅండ్ఎం అధికారులు బదిలీ అయ్యారు. వీరిలో పలువురుకి పదోన్నతి లభించింది. ఆర్జీ–1 ఏరియా ఇంజినీర్ రామ్మూర్తికి పదోన్నతి కల్పించి, కార్పొరేట్ టెక్నికల్ సర్వీస్ ఈఅండ్ఎం జీఎంగా బదిలీ చేశారు. ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్ ఎలీషాను కార్పొరేట్ స్టోర్స్ జీఎంగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. శ్రీరాంపూర్ సీఎస్పీ డీజీఎంగా పని చేస్తున్న దాసరి వెంకటేశ్వర్‌రావును ఆర్జీ–1 ఏరియా ఇంజినీర్‌గా బదిలీ చేశారు. ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్‌లో పని చేస్తున్న విజయశేఖరబాబును ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్‌గా పంపారు. ముగ్గురు మైనింగ్ విభాగం ఏజీఎంలకు పదోన్నతి కల్పించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎంగా పని చేస్తున్న రఘుకుమార్ అదే ఏరియాకు సేఫ్టీ జీఎంగా నియమితులయ్యారు. ఎస్టేట్స్ ఏజీఎం బండి వెంకటయ్యకు ఎస్టేట్స్ జీఎంగా పదోన్నతి కల్పించారు. అలాగే, హెచ్‌ఆర్‌డీ ఏజీఎం వీసం కృష్ణయ్య హెచ్‌ఆర్‌డీ జీఎంగా పదోన్నతి పొందారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణల్లో నిజం లేదు


మాట్లాడుతున్న అసోసియేషన్ బాధ్యులు

- వేస్ట్ మెటీరియల్‌కు వే బిల్ ఉండదు
- లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): ఎన్టీపీసీ నుంచి వచ్చే బూడిద విషయంలో వాస్తవాలు తెలియకుండా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయన ఆరోపణల్లో నిజం లేదని లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులు ఇ.చిరంజీవి గౌడ్, డి.బాలు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో వారు మాట్లాడారు. వేస్ట్ మెటీరియల్‌కు వే బిల్ ఉండదన్న విషయం ఎమ్మెల్యేకు తెలియకపోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఆర్థిక ఇబ్బందుల్లో జీవనం సాగిస్తున్న లారీ ఓనర్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. డీజిల్ ధరలు పెరిగి, కిరాయిలు లేక ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టలేని స్థితిలో ఉన్న తమ సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఇలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొన్నం ప్రభాకర్ రవాణాశాఖ మంత్రి కావడం కౌశిక్‌రెడ్డికి ఇబ్బందిగా ఉంటే ఆయనను రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప రెక్కాడితే గానీ డొక్కాడని తమను అడ్డం పెట్టుకొని, రాజకీయాలు చేయడం తగదన్నారు. 20 ఏళ్లుగా లారీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే లారీలు నిలిపివేయించి, ఇబ్బందులకు గురిచేయలేదని, ఆ ఘనత కౌశిక్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. సమావేశంలో లారీ ఓనర్స్ ఎండీ.తాహెర్, టి.అనిల్ గౌడ్, బి.రమేశ్, పి.సతీశ్‌గౌడ్, ఎ.శ్రీనివాస్ యాదవ్, ఎండీ.తాలీబ్, సయ్యద్ శివాజుద్దీన్, జి.శ్రీనివాస్, జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న ట్రాలీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటకు చెందిన మామిడి జలపతి ఆదివారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా నర్సయ్యపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన ఆగివున్న ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


బోల్తాపడిన ఆటో

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండ దేవేందర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, సిద్ధూ బైక్‌పై ఓదెల నుంచి ఇంటికి స్వగ్రామం వెళ్తున్నారు. గంగారం గ్రామానికి చెందిన కిరణ్ ఆటోతో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో దేవేందర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, సిద్ధూకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పొత్కపల్లి ఏఎస్సై సుధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు ఎంపిక

గోదావరిఖని(రామగుండం): 13వ అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొనే సింగరేణి జట్టును యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి కొలంబియా దేశంలో పోటీలు జరగనున్నాయి. మొత్తం 10 మంది సభ్యులను ఎంపిక చేశారు. వీరందరూ వీసా కోసం ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని యాజమాన్యం సూచించింది. కాగా, పోటీలకు జట్టు సభ్యుల ఎంపిక విషయంలో నెలకొన్న పంచాయితీ సంస్థ సీఎండీ బలరాం వద్దకు చేరింది. ఆయన పర్యవేక్షణలోనే సభ్యుల పేర్లను ఈ నెల 7వ తేదీనే ఖరారు చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు.

పోటీలకు ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు..

సభ్యుడి పేరు	హోదా	ఏరియా
బొలిశెట్టి శ్రవణ్‌కుమార్	మైనింగ్ సర్దార్	ఆర్జీ–2
గుర్రం మహేంద్ర	హెడ్ ఓవర్‌మెన్	భూపాలపల్లి
బోయిని సత్యనారాయణ	మైనింగ్ సర్దార్	మందమర్రి
పెద్ది శ్రీకాంత్	మైనింగ్ సర్దార్	ఆర్జీ–1
కుడిరె అనిల్‌కుమార్	అండర్ మేనేజర్	ఏపీఏ
బైరి సాంబశివుడు	మైనింగ్ సర్దార్	శ్రీరాంపూర్
జనగామ నాగరాజు	సీనియర్ అసిస్టెంట్	ఆర్జీ–1
గెల్లు పరమేశ్	జీఎంఈ	ఆర్జీ–1
గొడిసెల మనోహర్	అండర్ మేనేజర్	మణుగూరు
అదనపు మెంబర్‌గా		
గుజ్జుల రాకేశ్	ఎంఎడబ్ల్యూ	ఏపీఏ

పులా.. అడవి పిల్లా?

- చొప్పదండి మార్కెట్ యార్డులో సంచారం
- సోషల్ మీడియాలో వైరల్

చొప్పదండి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం తెల్లవారుజామున పులి సంచిరించిందని జోరుగా చర్చ జరిగింది. సంబంధిత వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వీడియోలో ఉన్నది పులా.. అడవి పిల్లా అన్నది తెలియడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో అధికారులు సీసీ పుటేజీలను పరిశీలించారు. అడవి పిల్లిలా చిన్నగా ఉండటంతో పులి పిల్లనా, పిల్లి లాంటి జంతువా అన్నది తేల్చలేదు. చొప్పదండిలో పులి సంచరిస్తుందన్న సమాచారం చుట్టుపక్కల గ్రామాలకూ చేరింది.

ప్రయాణికులపై తేనెటీగల దాడి


తేనెటీగల భయంతో దుప్పటి కప్పుకొని వెళ్తున్న యువకుడు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రావి చెట్టుపై ఉన్న తేనెటీగలు ప్రయాణికులపై సోమవారం దాడి చేశాయి. వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిపై ఉన్న రావి చెట్టుపై తేనెటీగలు రెండు రోజులుగా ఇదే ప్రాంతంలో స్వైర విహారం చేస్తున్నాయి. ఇటుగా వెళ్లిన హీర్యం వెంకటేశం, అట్టపెల్లి భూమయ్య, పెరమాడ్ల తిరుపతి, ఎండీ మోసిన్, మెడిశెట్టి మధుతోపాటు 50 మందిపై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేయగా.. తామేమి చేయలేమని చెప్పారు. మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఆధ్వర్యంలో తేనెటీగల తెట్టెను చెట్టుపై నుంచి తొలగించాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్


మాట్లాడుతున్న భూపాల్

వేములవాడఅర్బన్: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి నేటితరం యువత నడుం బిగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సర్కార్ పదేళ్లుగా అధికారంలో ఉండి దేశ ప్రజలకు మేలు చేయలేదన్నారు. తమను ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ అనేకమంది హేతువాదులు, జర్నలిస్టులు, మేధావులను పొట్టన పెట్టుకుందని పేర్కొన్నారు. మత విద్వేషాలు నింపుకున్న ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను పేదలకు అందకుండా చేయాలనే దురుద్దేశంతో పని చేస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని హత్తుకొని ముద్దాడుతూ దానిపై కపట ప్రేమ చూపారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, నాయకులు ముత్యంరావు, జవ్వాజి విమల, నర్సయ్య, నాగరాజు, రమణ, శ్రీధర్, పద్మ, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు


ఆలయంలో భక్తులు

- వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం ఒక్కో భక్తుడికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేశారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


కోడెమొక్కు చెల్లించుకుంటూ..

క్లుప్తంగా

స్వర్ణ అమృత ప్రాశన ఆయుర్వేద శిబిరం


పిల్లలకు ఆయుర్వేద మాత్రలు వేస్తున్న మేయర్

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో సోమవారం భగత్‌నగర్‌లోని శ్రీమన్నారాయణ భావ ఆయుర్వేద చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో 16 ఏళ్ల లోపు పిల్లలకు ఏర్పాటు చేసిన స్వర్ణ అమృత ప్రాశన ఆయుర్వేద శిబిరాన్ని మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చినజీయర్‌స్వామి ఆశీస్సులతో పిల్లల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన స్వర్ణ అమృత ప్రాశన మాత్రల కార్యక్రమంలో పాల్గొనడం చాలా అదృష్టం అన్నారు. ఆయుర్వేద మాత్రలు పిల్లల్లో 8 రకాల ప్రయోజనాలు కలిగిస్తున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భగత్‌నగర్ గోష్ఠి సభ్యులు, జైశ్రీమన్నారాయణ భావ ఆయుర్వేద చికిత్స కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


సివిల్ కోర్టు జడ్జికి మొక్క అందజేస్తున్న జ్యోతిరాణి

కరీంనగర్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సివిల్ కోర్టు జడ్జి సాయిశ్రీ అన్నారు. కరీంనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్ కోటోజు జ్యోతిరాణి సోమవారం జడ్జి సాయిశ్రీకి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పర్యావరణం పరిరక్షించబడుతుందన్నారు. శుభదినాలు, పండుగలు, పుట్టినరోజుల సందర్భంగా అందరూ మొక్కలు నాటాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త దొమ్మాటి బాబు అన్నారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 593లో గల 21 గుంటల ప్రభుత్వ స్థలాన్ని సమీపంలోని పట్టాదారులు రెవెన్యూ అధికారుల అండదండలతో ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కొన్ని రోజుల నుంచి స్థలాన్ని చదును చేశారని తెలిపారు. గతంలో సర్వే చేసిన రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేసినా ఆక్రమణదారులు దర్జాగా బోర్డును తొలగించి స్థలాన్ని చదును చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

బ్యాగులు పంపిణీ



సప్తగిరికాలనీ(కరీంనగర్): స్కూళ్ల ప్రారంభం కానున్న సందర్భంగా నగరంలోని నిరుపేద చిన్నారులు, విద్యార్థులకు సోమవారం మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో లంచ్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, ప్రేమలత, రామోజీ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ జిల్లా శాఖ నాయకులు ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ ఆవరణలోని దుకాణాల్లో నాణ్యత లోపించిన తినుబండారాలు, అధిక ధరలకు వస్తువుల విక్రయాలు, పరిశుభ్రత వంటి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. రీజినల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రాహక్ పంచాయతీ సభ్యులు నాగమల్ల సురేశ్, భగవాన్‌రెడ్డి, సురభి శ్రీధర్, రాపర్తి శ్రీనివాస్, దండె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణపై న్యాయ విచారణ జరిపించాలి



కరీంనగర్: నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ నీట్ నిర్వహణలో ఎన్టీఏను తప్పించి రీఎగ్జామ్ నిర్వహించాలని కోరారు. 60 మందికి 720 మార్కులు రావడం, ఒకే సెంటర్‌కు చెందిన వ్యక్తులు ఆరుగురు సాధించడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రీ ఎగ్జామ్ నిర్వహించకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, నగర కార్యదర్శి వినయ్ సాగర్, నాయకులు రాకేశ్, శివకుమార్, అక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: ఈ ఏడాది లక్ష్యానికి అనుగుణంగా హరితహారం మొక్కలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో హరితహారంపై సమీక్షించారు. మూడున్నర లక్షల మొక్కలు సిద్దంగా ఉన్నాయన్నారు. అదే విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లను పెంచాలని, బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు.

సెలవులో ఇన్‌చార్జి ఎస్ఈ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్ సెలవుపై వెళ్లారు. ఈఈగా ఉన్న మహేందర్‌ను గతంలో ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. వ్యక్తిగత కారణాలతో 20 రోజుల పాటు సోమవారం నుంచి సెలవుపై వెళ్లినట్లు సమాచారం . కాగా ఈఈ బాధ్యతలను మరో ఈఈ యాదగిరికి అప్పగించారు. ఎస్ఈ బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు.

బక్రీద్ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు

- మేయర్ సునీల్ రావు


మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఐఎం కార్పొరేటర్లు

కరీంనగర్ కార్పొరేషన్: ఈనెల 17న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా నగరపాలక సంస్థ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని మేయర్ సునీల్ రావు తెలిపారు. బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఎంఐఎం కార్పొరేటర్లు సోమవారం నగరంలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన మేయర్ నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ వేడుకలకు నగరపాలక సంస్థ ద్వారా అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నగరంలోని ఈద్గాలను శుభ్రం చేయడంతో పాటు, పెండల్స్, టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అంతే కాకుండా గ్రీన్ మ్యాట్, తాగునీటి సౌకర్యం, కూలర్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు చేసి అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షకీరా అంజుమ్ బర్కత్ అలీ, షరీఫొద్దిన్, నుజహత్ ఫర్వీన్ అలీ. ఇఫ్రా తహసీన్ అఖీనా, జహీరా బాను తదితరులు పాల్గొన్నారు.


చిత్ర కథ



ఘనంగా కాటమయ్య కొలుపు

కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా సోమవారం కాటమయ్య కొలుపు నిర్వహించారు. తాటిచెట్టు మీద నుంచి కల్లు కుండను కిందకు దించే కార్యక్రమం ఆసక్తికరంగా జరిగింది. తాటి చెట్టు ఎక్కిన గీతకార్మికులు కల్లుకుండను ఒకరి నుంచి మరొకరు తీసుకుని కిందకు దించి కాటమయ్యకు మొక్కు చెల్లించారు. అనంతరం బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో పుట్టకు నీళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య, ఉపాధ్యక్షులు కొయ్యడ సంపత్, హరీశ్, సభ్యులు న్యాలం భూమయ్య, భూసారపు లక్ష్మణ్, న్యాలం కనుకయ్య, దాసరి తిరుపతి, కొయ్యడ లచ్చయ్య, పూదరి లింగయ్య, న్యాలం భూమయ్య తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

నేడు శ్రీమహాశక్తి ఆలయ వార్షికోత్సవం


మహాశక్తి ఆలయం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని చైతన్యపురిలో గల శ్రీమహాశక్తి ఆలయ చతుర్దశ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరుగనున్నాయి. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో ఉదయం 4:30 గంటలకు లక్ష్మీ గణపతి, మహాదుర్గా, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు, అనంత నాగేంద్ర స్వామిలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు స్వస్తి పుణ్యావాచనం, గణపతి పూజ, అఖండ దీపారాధన, సర్వతోభద్ర మండలం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర సహిత చండీహోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగ అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం చేపట్టనున్నారు. సాయంత్రం 7 గంటలకు సుహాసినీలతో సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణ జరుగనుంది. పూజా కార్యక్రమాల్లో హిందూ బంధువులందరూ పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొంది, కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి


నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కరీంనగర్: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని బస్టాండ్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈనెల 4న నీట్2024 ఫలితాలను ప్రకటించిందని, అందులో 67 మంది 720కి 720 మార్కులు పొందారని అన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందని తెలిపారు. హర్యానాలోని పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో 8 మందికి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రమేశ్, రవీందర్, జోసెఫ్, అవినాష్, మురళీ, ఫిరోజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు


సప్తగిరికాలనీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆనంద్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంబురాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్),: ఎంపీ బండి సంజయ్‌కి కేంద్ర సహాయ మంత్రి పదవి రావడం పట్ల శనివారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం, చిగర్ల శ్రీనివాస్, బోయిన ప్రసాద్, జంగపల్లి శ్రీనివాస్, గున్నాల కన్నాంబ, లింగంపల్లి శ్రీనివాస్, నల్లగొని శ్రీనివాస్, బెల్లం నరేందర్, రావుల రాజు, బండి మల్లయ్య యాదవ్, కొలనూరు భార్గవ్, బీసీ సంఘం వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన జీవీ



కరీంనగర్: బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గజ్వేల్ వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు.



కంగ్రాట్స్..

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కరీంనగర్ బీజేపీ కార్పొరేటర్లు సోమవారం ఢిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కరీంనగర్ నగరపాలక సంస్థ బీజేపీ కార్పొరేటర్లు కొలగని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, చొప్పర్ వేణు తదితరులు ఉన్నారు. - కరీంనగర్‌టౌన్

ఘనంగా ‘కవ్వంపల్లి’ జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్/సప్తగిరికాలనీ:డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ సోమవారం ఘనంగా నిర్వహించింది. నగరంలోని ఇందిరాచౌక్, 18వ డివిజన్ రేకుర్తి, అంబేడ్కర్ చౌరస్తా వద్ద, ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమం, శ్రీసాయి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎండీ.తాజ్, పులి ఆంజనేయులు, అబ్దుల్ రెహమాన్, అమీర్, రహమత్ హుస్సేన్, హైమద్ అలీ, బాలబద్రి శంకర్, గజ్జల ఆనంద్ రావు, సంపత్, గోస్కి శంకర్, నాగరాజు, బాపిరెడ్డి, రవి, నర్సయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆటాపాటా.. చదువుల పూదోట

- అంగన్‌వాడీ బడికి ఆహ్వానం
- బడిబాటలో చిన్నారుల గుర్తింపు
- ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం


ఫకీర్‌పేటలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

కరీంనగర్‌రూరల్: ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుండగా మరోవైపు కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఈనెల 7 నుంచి అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూర్వ ప్రాథమిక విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించడమే లక్ష్యంగా ఐసీడీఎస్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుడి బుడి అడుగులు వేసే చిన్నారులకు ఆటపాటలు, పోషకాహారంతో విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ప్రైవేట్ ప్రీస్కూల్స్‌కు దీటుగా కేంద్రాల్లో విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ ఈనెల 19 వరకు బడిబాట నిర్వహించనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సులువుగా అర్థమయ్యేందుకు ఆటలు, పాటలు, కథలతో విద్యాబోధన చేస్తారు. ప్రైవేట్ పాఠశాలల్లోని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ టీచర్లు బోధిస్తారు. ప్రైవేట్‌లో విద్యార్థులకు పరీక్షల పేరిట మానసిక ఒత్తిడి పెంచుతుండగా అందుకు భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలతో బోధన ఉంటుంది. అవసరమైన పుస్తకాలను ఉచితంగా అందిస్తారు. ప్రతిరోజూ చిన్నారులకు ఉదయం ఉడకబెట్టిన కోడిగుడ్డు, మధ్యాహ్నం పోషకాలతో కూడిన భోజనం, సాయంత్రం మురుకులు ఇస్తారు. పౌష్టికంగా ఎదగడానికి దోహదపడే బాలామృతం పంపిణీ చేస్తారు.

ప్రాజెక్టు పరిధిలో 2,515 మంది చిన్నారులు

కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 172 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం ఐదేళ్లు నిండిన చిన్నారులు సుమారు 500 మంది 1వ తరగతి విద్య కోసం ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు. వీరిస్థానంలో కొత్తగా రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను చేర్పించేందుకు అధికారులు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 2,515 మంది రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులున్నారు. ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారుల వివరాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు బడిబాటలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్నారు. కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

విద్యతో పాటు పోషకాహారం

ఐదేళ్లలోపు గుర్తించిన చిన్నారుల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించేలా బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులకు విద్యతోపాటు సంపూర్ణ పోషకాహారం అందిస్తారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యాబోధన ఉంటుంది.

– పి.లక్ష్మీనారాయణ,
సీడీపీవో, కరీంనగర్‌అర్బన్

వీధి కుక్కలతో భయాందోళన

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గుంటూరుపల్లిలో వీధికుక్కలతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో పదుల సంఖ్యలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో మహిళలు, చిన్నారులు భయంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గేదెలు, మేకలు, కోళ్లపై దాడులు చేస్తూ అడ్డువచ్చిన మనుషులను గాయపరుస్తున్నాయి. గత నెలలో కుంభం నర్సయ్యకు చెందిన రెండు గేదె దూడలపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందగా మరో రైతుకు చెందిన దూడను తీవ్రంగా గాయపర్చాయి. వీధికుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు పలుమార్లు గ్రామస్తులు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో తహసీల్దార్ నవీన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అధికారులెవ్వరూ కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

దుర్శేడ్‌లో కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో సోమవారం వీధికుక్కల దాడిలో మేడ శ్రీనివాస్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ముందున్న శ్రీనివాస్‌పై కుక్కలు దాడి చేయడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికంగా ఇంటివద్దనే చికిత్స పొందుతున్నాడు. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నగరంలోని విద్యారణ్యపురి రోడ్ నంబర్ 1, 2, 3 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు


పతకాలు సాధించిన చిన్నారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నగరంలోని దమ్మికా కాయ్ షిటోరియో కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ ఆర్.ప్రసన్నకృష్ణ తెలిపారు. కటాస్, కుమిటీ విభాగాల్లో పోటీ పడి పతకాలతో పాటు బెస్ట్ టీం కప్‌ను సైతం సాధించారని అన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన చిన్నారులను కోచ్ వైష్ణవి, ప్రధాన కార్యదర్శి బండారి సంతోష్, వినోద్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దుర్మార్గం: కొంతం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లతో పాటు భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా దాడులకు పాల్పడటం అనాగరికమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి అరాచకాలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమికి అధికారం

- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్‌లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి గెలుపొందిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా ఆయా పార్టీలకు మెజార్టీ రావడంతో మేధావులు, విశ్లేషకులతో పాటు సామాన్య జనంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12కి పైగా ఎన్నో ప్రముఖ సంస్థలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడిస్తే అందుకు భిన్నంగా కూటమి విజయం సాధించడం వెనుక ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానాలను కొట్టి పారేయలేమన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవీఎంలు తయారు చేసే సంస్థలు దాదాపు 30 ఉండగా, అందులో బీజేపీకి చెందిన వారివే ఎక్కువ సంస్థలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని గతంలో స్వయంగా చంద్రబాబునాయుడే ప్రకటించారని వడ్లమూరి గుర్తు చేశారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. చాలాసేపు పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీలు గొల్ల బాబురావు, మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి, గుడివాడ అమర్‌నాథ్, నాయకులు రెడ్డి శాంతి, చిర్ల జగ్గిరెడ్డి, విశ్వాసరాయ కళావతి, బుట్టా రేణుక, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, శోభా హైమావతి, వంగా గీత, ధనలక్ష్మి, విజయ, డాక్టర్ సత్యవతి, ఉమాబాల, ఎల్ అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.


గోపువానిపాలెంలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం


సంద్యాల మండలం రాయమల్పురంలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన అభివృద్ధి శిలాఫలకాలు


కూరాడ సచివాలయంపై ఉన్న వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను గునపంతో పగలకొడుతున్న జనసేన కార్యకర్త

పరాకాష్టకు విధ్వంసకాండ

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవరూ ఉండకూడదన్నట్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పార్టీకి ఓట్లేసిన వారిని దుర్భాషలాడుతున్నారు. ఓట్లు వేయించిన వారు ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది అన్యాయం కదా.. అని ప్రశ్నిస్తే దుస్తులు విప్పి కొడుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా, వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పిస్తున్నారు. యూనివర్సిటీ వీసీలపై దౌర్జన్యం చేస్తున్నారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఇలా ఎప్పుడైనా జరిగిందా? ఇప్పుడే ఎందుకు ఇలా జరుగుతోంది? టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధ్వంసం సృష్టిస్తుంటే.. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తుంటే.. స్పందించాల్సిన పోలీసులు ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నారు? నిజంగా ఈ పరిణామం ఖాకీ డ్రస్సుకే అవమానం.

దేశ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని రీతిలో గత ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వెలిశాయి. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, కొత్త రూపు రంగరించుకున్న స్కూళ్లు.. ఇలా ఎన్నెన్నో ప్రభుత్వ బిల్డింగ్‌లు నిర్మాణమయ్యాయి. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల విలువైన ఆస్తి సమకూరింది. ఇదంతా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. భద్రంగా కాపాడుకోవాలి. అలాంటిది పని గట్టుకుని ఊరూరా టీడీపీ సేన గునపాలు చేత పట్టుకుని ధ్వంసం చేస్తుండటాన్ని ఏమనాలి? రౌడీయిజం, దౌర్జన్యం, ఉన్మాదం.. ఇలా ఈ పదాలన్నీ తక్కువే. ఎవర్ని చూసుకుని ఇలా పేట్రేగిపోతున్నారు? చంద్రబాబు, లోకేశ్‌లను చూసుకునే కదా!

బాపట్ల జిల్లాలో పిండ ప్రదానం చేస్తుంటే అడ్డుకోవడం.. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిని జేసీబీతో కూల్చేయడం.. ఏకంగా నెల్లూరు మేయర్ దంపతులనే బెదిరించడం.. ఇదే జిల్లా దత్తులూరు మండలంలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్లను ధ్వంసం చేయడం.. కొండాపురం మండలం గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చేయడం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం.. ఇకపై పోస్టులు ఆపేస్తామని వారితో ప్రకటనలు ఇప్పించడం.. తప్పుడు కేసులు పెట్టడం.. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో అరాచకం కళ్లెదుటే కనిపిస్తోంది ఒక్క పోలీసులకు తప్ప అందరికీ.

విగ్రహాలపై అక్కసు

రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

పలుచోట్ల శిలాఫలకాల తొలగింపు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిప్యూటీ సీఎంగా పవన్!

- జనసేనకు మరో నాలుగు మంత్రి పదవులు
- కూర్పుపై కసరత్తు చేస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే ప్రధాన ప్రతిపక్షంగా సభలో అడుగు పెడతామని చెప్పడంతో పలు ఊహాగానాలు సాగాయి. అయితే తాజాగా పవన్ ప్రభుత్వంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చల్లో దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పవన్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తనతోపాటు జనసేన నుంచి గెలిచిన మరో నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని పవన్ కోరగా చంద్రబాబు అందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఒకటి నాదెండ్ల మనోహర్‌కి దక్కడం ఖాయమని చెబుతున్నారు. మిగిలిన పదవులకు కందుల దుర్గేష్, పంతం నానాజీ, అరణి శ్రీనివాసులు, వంశీకృష్ణ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి.

నేడు టీడీపీ శాసన సభాపక్ష సమావేశం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశంలో చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా పదవులు

చంద్రబాబు ఉమ్మడి జిల్లాల వారీగానే మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నారా లోకేష్ మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పదవుల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం జిల్లా నుంచి అచ్చెన్నాయుడు, గౌతు శిరీష, కూన రవికుమార్, కొండ్రు మురళి రేసులో ఉన్నారు. అయితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినందున అచ్చెన్నాయుడికి ఇవ్వటంపై సందిగ్ధం నెలకొంది. విజయనగరం జిల్లా నుంచి కళా వెంకట్రావు, సంధ్యారాణి పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా నుంచి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రేసులో ఉన్నారు. పశ్చిమ గోదా వరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. కృష్ణా జిల్లా నుంచి బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్ర పేర్లను పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసా ద్, కన్నా లక్ష్మీనారాయణల్లో ఒకరిద్దరికి అవకాశం లభించనుంది. ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, బాల వీరాంజనేయ స్వామి పోటీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా నుంచి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశా వహుల జాబితాలో ఉన్నారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా రేసులో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత ఉన్నా రు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జయనాగేశ్వర్‌రెడ్డిలో ఒకరిద్దరికి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు స్థిరంగా కదులుతున్నాయి. గాలుల కోత, షీర్ జోన్ ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు మరత్వాడా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో, బుధవారం నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. గురువారం బాపట్ల, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని పేర్కొంది.

గోదావరి కాలుష్యం ఆగేనా..?


బాసర వద్ద గోదావరి నది

- వ్యర్థాలను నదిలోకి వదులుతున్న 'మహా' కంపనీలు
- బాసర వద్ద నదిలో కలుస్తున్న ఆల్కాహాల్ వ్యర్థాలు
- ఏటా వర్షాకాలంలో ఇదే దుస్థితి
- కాంగ్రెస్ ప్రభుత్వం కట్టడి చేయాలని పర్యావరణ వేత్తలు వేడుకోలు


మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా బాలాపూర్ శివారులో ఆల్కాహాల్ ఫ్యాక్టరీ

భైంసా: హైదరాబాద్‌లో పూర్తిగా కలుషితమైన మూసీ నది ప్రక్షాళనకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్రంలో వందల కిలోమీటర్లు పారే పవిత్ర గోదావరి కూడా కలుషితం కాకుండా కాపాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. గోదావరి రాష్ట్రంలోకి ప్రవేశించే బాసర వద్దనే మహారాష్ట్రలో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీలు వ్యర్థాలను నదిలోకి వదులుతున్నాయి. వర్షాకాలం సమీపిస్తుండతో నెలల తరబడి నిల్వచేసిన రసాయన వ్యర్థాలను మళ్లీ నదిలోకి వదిలేందుకు కంపెనలు సిద్ధమవుతున్నాయి.

ఏటా ఇదే పరిస్థితి..

మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా బాలాపూర్ గ్రామ శివారులో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీ నిర్వాహకులు ఏటా రసాయన వ్యర్థాలు గోదావరిలోకి వదులుతున్నారు. భారీ వర్షాలు కురిసి నదికి వరద రాగానే ఫ్యాక్టరీ పరిసరాల్లో నిల్వ ఉంచిన రసాయన వ్యర్థాలన్నీ ప్రత్యేకంగా తవ్వినా కాలువల నుంచి నదిలోకి విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరినందున ఈ ఏడాదైనా ఆల్కాహాల్ ఫ్యాక్టరీల వ్యర్థాలు గోదావరిలో కలువకుండా నిలువరించాలని పర్యావరణవేత్తలు, ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నేరుగా గోదావరిలోకి..

ఇక రెండు రాష్ట్రాల సరిహద్దు పట్టణాలు, పల్లెల నుంచి వస్తున్న మురుగునీరంతా నేరుగా గోదావరి నది నీటిలోనే కలుస్తోంది. పరివాహక ప్రాంతాల్లో చెత్తను నదితీరంలో డంప్‌చేయడం, భారీ వర్షాలకు గోదావరి నదిలో కలుస్తోంది. రాష్ట్ర పరిధిలో గోదావరి నది కలుషితమవుతున్న పరిస్థితిపై కేంద్ర జలవనరుల సంఘం సీడబ్ల్యూసీ 2018 ఆగస్టు నుంచి 2020 డిసెంబర్ మధ్య గోదావరి నది ప్రవహిస్తున్న 13 ప్రాంతాల్లో నమూనాలను పరిశీలించింది. మనుషులతోపాటు పర్యావరణానికి ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. ఆల్కహాలిక్ వ్యర్థాలతో నదిలోని నీటిలో ఆర్సెనిక్, కాడ్మియం, క్రోమియం, కాపర్, లీడ్, నికెల్, ఐరన్, జింక్ వంటి లోహాలు పెరుగుతున్నట్లు నిర్ధారించారు. నదిలో మోతాదుకు మించి విషపూరిత భారలోహాలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

అక్కడి నుంచే తాగునీరు..

నిజామాబాద్ జిల్లాలో యంచ గ్రామం వద్ద నిర్మించిన ఫిల్టర్‌బెడ్ ద్వారా 144 గ్రామాలకు తాగునీరు అందుతుంది. బాసర ట్రిపుల్‌ఐటీలో 8 వేల మందికి, బాసర ఆలయంలో ప్రతీరోజు వచ్చే వేలసంఖ్యలో ఉన్న భక్తులకు, బాసర, బిద్రెల్లి, కిర్గుల్‌తోపాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు, నిజామాబాద్, నిర్మల్ జిల్లా పరివాహక ప్రాంతంలోని అన్ని గ్రామాలకు ఈనీరే సరఫరాచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిషన్ భగీరథకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోచేరే గోదావరి నీటిని తరలిస్తున్నారు. ఇందుకు నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాడేగాం వద్ద పథకం నిర్మించింది. ఇక్కడి నుంచే నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు మిషన్‌భగీరథ పథకంలో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఎంతో మందికి తాగునీరు అందించే ఈ నీటిలో విషతుల్యమైన రసాయనాలు చేరకుండా అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీనెల శాంపిల్ సేకరిస్తున్నాం

గోదావరి నది నీటి శాంపుళ్లను ప్రతీనెల సేకరిస్తున్నాం. రెండేళ్లుగా సేకరిస్తున్న శాంపిళ్లకు సంబంధించిన రిపోర్టులు రాలేదు. నీటిలో రసాయనాలు ఉన్నట్లు తేలితే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మన రాష్ట్ర పీసీబీ నుంచి మహారాష్ట్ర పీసీబీకి లేఖ పంపిస్తాం. గోదావరి కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్‌ప్రసాద్, కాలుష్య నియంత్రణ అధికారి

భరించలేని దుర్వాసన..

మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా బాలాపూర్ గ్రామ శివారుల్లో నిర్మించిన పయోనీర్ డిస్టలరీస్ లిమిటెడ్ పేరిట ఉన్న ఆల్కాహాల్ వ్యర్థాలు మనం తాగే నీటిలో కలుస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలు ముక్కుపూటలు అదిరేలా ఉంటాయి. భైంసా – బాసర, బాసర – నిజామాబాద్ మార్గాల్లో గాలివీచినప్పుడల్లా వచ్చే ఈ దుర్గంధంతో అక్కడ కాసేపుకూడా నిలబడలేం. గాలివీచినప్పుడల్లా బాసర ట్రిపుల్‌ఐటీతోపాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలోగల గ్రామాల వరకు దుర్వాసన వస్తుంది. నిర్మల్ జిల్లాలోని దోదాపూర్, టాక్లి, బిద్రెల్లి, కిర్గుల్(బి), కిర్గుల్(కె), ఓని, మైలాపూర్, బాసర, నిజామాబాద్ జిల్లాలోని యంచ, బినోల తదితర గ్రామాల ప్రజలు ఈ దుర్వాసతో నిత్యం ఇబ్బంది పడుతున్నారు.

కొత్త విద్యుత్ కేంద్రం ఎప్పుడు?

- ప్రభుత్వ ప్రకటనపై సర్వత్రా ఆసక్తి
- జెన్‌కోకు అప్పగించాలని ఇంజినీర్ల విన్నపం


అధికారులకు విన్నవిస్తున్న ఇంజినీర్ల జేఏసీ నేతలు(ఫైల్)

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసింది. రామగుండంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం స్థాపన ఎప్పుడనే ఆసక్తి నెలకొంది. పట్టణంలోని 62.5 మెగావాట్ల బీ–థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం జీవితకాలం ముగిసింది. దానిస్థానంలో కొత్త ప్రాజెక్టు స్థాపనకు ప్రభుత్వం నిర్ణయించింది. 25ఏళ్ల జీవిత కాలం పూర్తి చేసుకున్న వాటిని తొలగించి ఆధునిక పరిజ్ఞానంతో కూడిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు స్థాపించుకునేందుకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) ఆదేశించిన విషయం తెలిసిందే.

సింగరేణికి అప్పగించేందుకు..

800 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త ప్రాజెక్టును సింగరేణికి అప్పగించే యోచనలో ఉన్నట్లు మంత్రి భట్టివిక్రమార్క ఇప్పటికే వెల్లడించారు. దీనిపై జెన్‌కో ఇంజినీర్ల సంఘాలు.. జైపూర్‌లో ఇప్పటికే సింగరేణికి విద్యుత్ కేంద్రం అప్పగించారని, రామగుండం ప్రాజెక్టు కూడా అప్పగిస్తే జెన్‌కో ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని గత మార్చి 22న ఇంధనశాఖ కార్యదర్శిని కలిసి తమ ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని విన్నవించారు.

అందుబాటులో అనేక వనరులు..

రామగుండంలో విద్యుత్ కేంద్రం స్థాపనకు అనేక వనరులు అందుబాటులో ఉన్నాయని ఇంజినీర్లు ఇంధనశాఖ కార్యదర్శికి విన్నవించారని సమాచారం. జెన్‌కోకు సుమారు 700 ఎకరాలు ఉన్నాయని, సమీపంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నీరు, సింగరేణి నుంచి బొగ్గు లభ్యత ఉందని వివరించారు. పది మీటర్ల లోపే రాజీవ్‌హైవే, రైల్వేలైన్‌కు కనెక్టివిటీ ఉంటుందని వివరించినట్లు తెలిసింది.

జెన్‌కోకు అప్పగిస్తే ప్రయోజనాలు..


- భూసేకరణ లేకుండానే తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు
- తర్ఫీదు పొందిన ఇంజినీర్ల సేవలు వినియోగించుకునే అవకాశం
- మానవ వనరులతోనే సర్దుబాటు చేసుకునే వీలు. రూ.వేల కోట్ల ఆస్తులను పరిరక్షించుకునే అవకాశం.
- ప్రభుత్వ ప్రకటన తర్వాత ఇప్పటివరకు అభ్యంతరాలు లేవు. నిర్దేశిత గడువులోగా కేంద్రం స్థాపించే వీలు
- జెన్‌కో విద్యుత్ కేంద్రాలపై ప్రభుత్వ అజమాయిషీతోపాటు స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు అవకాశం

సింగరేణికి అప్పగిస్తే సమస్యలు..

- వందశాతం ఉన్న ప్రభుత్వ షేర్ 51శాతానికి పడిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ ఉచిత విద్యుత్, 200 యూనిట్ల గృహోపయోగ విద్యుత్ పథకానికి విఘాతం కలిగే అవకాశం
- నిష్ణాతులైన ఇంజినీర్లు లేకపోవడంతో సింగరేణి మరో కంపెనీకి సబ్ కాంట్రాక్టుకు ఇచ్చే అవకాశం
- ఈవిషయాలపై జెన్‌కో ఇంజినీర్ల జేఏసీ ప్రతినిధులు మార్చి 22వ తేదీన ఇంధన శాఖ కార్యదర్శిని కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. కొత్త ప్రాజెక్టుకు అవసరమైన వనరులు, నిధులు, సాధ్యాసాధ్యాలు, లాభాలు, ప్రయోజనాలపై వివరించారు.

రైలు టికెట్ అదృష్టమే..!

- రైల్వేటికెట్లు.. అందక ఇక్కట్లు
- తత్కాల్‌కూ తప్పని తిప్పలు
- సిరిసిల్ల బుకింగ్ కేంద్రంలో మెరుగైన సేవలు కరువు
- రాజన్నసిరిసిల్ల జిల్లా వాసులకు తప్పని తిప్పలు



ఇతను చెన్నవేని నర్సయ్య. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లెకు చెందిన నర్సయ్య కాశీకి వెళ్దామని రైల్వే టిక్కెట్ కోసం ఉదయం 9 గంటలకే సిరిసిల్లలోని హెడ్ పోస్టాఫీస్‌కు వచ్చాడు. రైల్వేబుకింగ్ చిట్టీపై వివరాలు రాసిచ్చాడు. ఉదయం 11 గంటలకు తత్కాల్ టిక్కెట్లు ఓపెన్ కాగా.. అరగంట వెతికినా బుకింగ్ కాలేదు. దీంతో నర్సయ్య నిరాశకు గురయ్యాడు.


సిరిసిల్ల పోస్టాఫీస్‌లో టికెట్ల కోసం నిరీక్షణ

సిరిసిల్ల: 'నువ్వు ఎక్కాల్సిన రైలు జీవితకాలం లేటు' అని ఓ కవి చెప్పిన మాటలు రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రజలకు సరిగ్గా సరిపోతున్నాయి. ఈ ప్రాంతానికి రైలుమార్గం లేకపోవడం, రైల్వేటికెట్ బుకింగ్ కౌంటర్‌లో సేవలు అందక ఇక్కడి వారికి రైల్వే సేవలు దూరమవుతున్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలతో కలిసి సరదాగా తిరిగొద్దామనుకున్నా ఉద్యోగులు, తీర్థయాత్రలకు వెళ్లాద్దామనుకున్న వృద్ధులకు రైల్వేటికెట్లు దొరక్క నిరాశ చెందుతున్నారు.

హెడ్‌పోస్టాఫీస్‌లో సేవలు అంతంతే..

కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ 2013లో సిరిసిల్ల హెడ్ పోస్టాఫీస్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయించారు. మొదట్లో బాగానే పనిచేసినా కాలక్రమంలో సేవలు మృగ్యమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేక సిరిసిల్ల రైల్వే బుకింగ్ కేంద్రంలో సేవలు సరిగ్గా అందడం లేదు. అదృష్టం బాగుంటేనే రైల్వే టికెట్లు దొరుకుతాయి. అదీ కూడా గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉంటేనే.

బస్సుల రద్దు.. రైలు టిక్కెట్ దొరకదు

సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు జిల్లాలోని అన్ని మండలాల వాసులకు మహారాష్ట్ర, ముంబై, షోలాపూర్, సూరత్ ప్రాంతాలతో సంబంధాలు ఉంటాయి. వస్త్రపరిశ్రమ విస్తరించి ఉండడం, వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ఉండడంతో ఈ ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు నిత్యం కొనసాగుతుంటాయి. గతంలో ముంబై, షోలాపూర్, సూరత్‌లకు నడిచిన ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం రద్దయ్యాయి. కామారెడ్డి నుంచి వెళ్లే రైళ్లకు టికెట్లు బుక్ చేసుకుందామంటే దొరకవు. తిరుపతి, షిర్డీకి వెళ్దామన్నా టిక్కెట్ల తిప్పలు తప్పడం లేదు. కామారెడ్డి, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లి, హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల నుంచి వెళ్లే రైళ్లలో టిక్కెట్లు లభించడం లేదు. తక్కువ ఖర్చుతో చేయాల్సిన ప్రయాణాలు ప్రైవేటు వాహనాల్లో ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

ఏబీవీపీ సౌత్ జోనల్ కన్వీనర్‌గా సుమంత్

మంచిర్యాలటౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) సౌ త్ జోనల్(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) సోషల్ మీడియా కన్వీనర్‌గా మంచిర్యాల పట్టణానికి చెందిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి పెండెం సుమంత్‌కు బాధ్యతలు అప్పగించారు. గత కొంతకాలంగా ఏబీవీపీలో ఉంటూ కీలకంగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తనకు గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో బాధ్యతలు అప్పగించినట్లు సుమంత్ తెలిపారు. ఇకపై విద్యారంగ సమస్యలపై ప్రత్యక్షంగా, సామాజిక మాధ్యమాలలోనూ ఉద్యమిస్తానని పేర్కొన్నారు.


పెండెం సుమంత్

కుటుంబంలో ఆడపిల్లను ఒక మైనస్‌గా భావించిన సమాజం నుంచి
ఆడ, మగ అనే తేడా లేకుండా ఉన్నంతలో
తమ పిల్లల్ని గొప్పగా చదివించాలనే సంకల్పం
దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోనూ మొదలైంది.
అలాంటి కుటుంబంలో పుట్టిన అమ్మాయే నిస్సీ లియోన్.
ఆడపిల్లను చదువుకోసం పొరుగూరుకు కూడా
ఒంటరిగా పంపడానికి ఇప్పటికీ భయపడుతున్న రోజుల్లో
విదేశాల్లో కొలువుకి ఎంపిక అయ్యేలా ప్రోత్సహించారు నిస్సీ తల్లిదండ్రులు.
చదివింది డిగ్రీ అయినా యూకేలో ఉద్యోగంలో చేరుతోంది.
వార్షిక వేతనం అక్షరాలా రూ.37 లక్షలు అందుకోబోతోంది.
గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన నిస్సీ లియోన్
తన విజయావకాశం గురించి ఆనందంగా తెలియజేస్తోంది.



నిస్సీ లియోన్

అనుకుంది... సాధించింది

- నిస్సీ లియోన్ సక్సెస్ స్టోరీ

“బీఎస్సీ కార్డియాలజీలో డిగ్రీ పూర్తిచేశాను. యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీస్‌కు చెందిన ఎన్‌హెచ్‌ఎస్ నార్తెర్న్ కేర్ అలియన్స్ నన్ను ఉద్యోగానికి ఎంపికచేసింది. ప్రపంచవ్యాప్తంగా వైద్య అనుబంధ రంగాల్లో నిష్ణాతులను, నైపుణ్యం కలిగిన వారిని ఈ సంస్థ ఎంపిక చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఇండియా నుంచి ఇద్దరు ఎంపిక కాగా వారిలో నేనూ ఒకరిగా ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

ఈ రోజుల్లో...

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నాన్న జార్జ్, అమ్మ సునీతలు స్థానిక చర్చ్‌లో పాస్టర్స్‌గా పని చేస్తున్నారు. తమ్ముడు చదువుకుంటున్నాడు. సేవా తత్పరతతో కూడిన ఉద్యోగం చేయాలనేది నా ఆలోచన. మా అమ్మనాన్నల సేవా గుణం నాలోనూ అలాంటి ఆలోచనలు కలగడానికి కారణం అయింది. మొదట వైద్యురాలిగా స్థిరపడాలనుకునేదాన్ని. కానీ, మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వైద్య సహాయకురాలిగా స్థిరపడాలనుకున్నాను. శ్రీకాకుళంలోని బొల్లినేని మెడీ స్కిల్స్ పారా మెడికల్ డిగ్రీ కళాశాలలో కార్డియాలజీ విభాగంలో చేరాను. పిల్లల ఉన్నతోద్యోగాల గురించి పెద్దలు తరచూ ‘వాళ్లబ్బాయి సాఫ్ట్‌వేర్ అంట, వీళ్లమ్మాయి పెద్ద ఉద్యోగం చేస్తుందంట’ అనే మాటలను వింటూనే ఉంటాం. అయితే దేశంలో కొన్ని రంగాలలో ఉన్నవారు మాత్రమే అత్యధిక వేతనాలు తీసుకుంటున్నారు. వారి విద్యార్హత, నాలెడ్జ్ చదివిన కాలేజీ, అభ్యర్థి నడవడిక, బృందంలో పనిచేసే వైఖరి.. వంటి వాటి ఆధారంగా జీతాలను నిర్ణయిస్తున్నారు. అలా కాకుండా సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసే వారికి సైతం మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయి. విదేశీ సంస్థలు అందుకు స్వాగతం పలుకుతున్నాయి అని జెమ్స్ మెడికల్ కాలేజ్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు, బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్. నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ పద్మజల ద్వారా తెలిసింది. అంతకు ముందు నాకు విదేశాలకు వెళ్లాలనే ఆలోచన లేదు. కానీ, వారి ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించాను.

అనస్తీషియా. కార్డియాలజీ రెండూ నాకు ఇష్టమైన సబ్జెక్టులుగా ఉండేవి. కార్డియాలజీలో పని పట్ల మరింత సంతృప్తి లభిస్తుందనిపించి ఈ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నాను. మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. వైద్యవృత్తిలో రాణించాలనుకునేదాన్ని. కానీ, మా కుటుంబం ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించి. ఈ డిగ్రీ తీసుకున్నాను. నా కాలేజీ ఫీజు విద్యా దీవెనలో కవర్ అయ్యింది. ఇప్పుడు మంచి సంస్థలో ఉద్యోగం లభించింది.
– నిస్సీ లియోన్



కుటుంబ సభ్యులతో నిస్సీ లియోన్

మా చుట్టుపక్కల వాళ్లందరూ మా అమ్మాయి గురించి గొప్పగా మాట్లాడుకుంటుంటే ఆనందంగా ఉంది. నిస్సీ తల్లిదండ్రులుగా మాకూ గుర్తింపు వచ్చింది. ఈ రోజే మా అమ్మాయి విదేశాలలో ఉద్యోగం చేయడానికి బయల్దేరింది.
– తల్లిదండ్రులు

దశల వారీగా...

నేషనల్ హెల్త్ సర్వీసుకు చెందిన ఎన్‌హెచ్ఎస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వైద్య అనుబంధ రంగాల్లో నిష్ణాతులను, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేస్తోంది. ఇందులో ప్రవేశం అంత సులువేమీ కాదని కొద్దిరోజుల్లోనే అర్థమైంది. హైదరాబాద్ కు చెందిన ప్రకార స్వచ్ఛంద సంస్థ ద్వారా మా కాలేజీకి సమాచారం వచ్చింది. నైపుణ్యం కలిగిన బీఎస్సీ కార్డియాలజీ ఎకో గ్రాఫర్ కావాలని, అందుకు వెంటనే అప్లై చేసుకోవాలనీ మా కాలేజీ వాళ్లు చెప్పారు. దీంతో అప్లై చేసి, సికింద్రాబాద్ కిమ్స్‌లో శిక్షణ తీసుకున్నాను. కిందటేడాది జరిగిన బ్రిటిష్ సొసైటీ అఫ్ ఎకోకార్డియోగ్రాఫీ (బిఎస్ఇ) వారు నిర్వహించిన ట్రాన్స్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ (టీటీఇ) పరీక్షతో పాటు ఇంటర్వ్యూకు హాజరయ్యాను. నిపుణులతో కూడిన కమిటీ ఇంటర్వ్యూ చేసింది. అంతకుముందు జరిగిన థియరీ పరీక్షలోనూ మంచి మార్కులు వచ్చాయి. రెండింటిలోనూ ఉత్తీర్ణత సాధించడంతో ఉద్యోగానికి ఎంపియ్యాను. వార్షిక వేతనం ఇండియా కరెన్సీలో రూ.37 లక్షలు అని తెలిసింది. అమ్మానాన్నలు ఎంత సంతోషించారో మాటల్లో చెప్పలేను. ఒక డిగ్రీ విద్యార్థిని ఈ స్థాయిలో ప్యాకేజీకి ఎంపిక కావడం చిన్న విషయం కాదని అందరూ అంటూ ఉంటే ఎంతో ఆనందం కలుగుతోంది. వీసాకు అయ్యే మొత్తాన్ని, విమాన యాన ఖర్చులు కూడా ఆ సంస్థనే అందిస్తోంది” అంటూ ఆనందంగా తెలియజేసింది నిస్సీ.

– నిర్మలారెడ్డి

న్యూస్‌మేకర్

సర్పంచ్ నుంచి సెంట్రల్ మినిస్టర్ వరకూ

తాజా ఎన్.డి.ఏ. మంత్రి వర్గంలో 71 మంది ప్రమాణ స్వీకారం చేస్తే ఏడుగురే స్త్రీలు. వారిలో అందరి కంటే చిన్నది రక్ష ఖడ్సే. 37 సంవత్సరాల రక్ష భర్తను కోల్పోయాక రాజకీయాల్లోకి వచ్చింది. సింగిల్ పేరెంట్‌గా ఉంటూనే సర్పంచ్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి వరకూ ఎదిగింది. మహారాష్ట్ర ఎం.పి. అయిన రక్షకి ప్రజాభిమానం మెండుగా ఉంది. ఆమె స్ఫూర్తిదాయక కథనం.



రక్ష ఖడ్సే

రాజకీయ కుటుంబంలో కోడలుగా అడుగు పెట్టిన అమ్మాయికి రాజకీయాలు ఎంత నాటకీయంగా ఉంటాయో, పదవి విషయంలోనే కాదు జీవితంలో కూడా గెలుపు ఓటములు ఎంత ఖేద మోదాలు కలిగిస్తాయో మెల్లగా తెలిసి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలోని రావెర్ స్థానం నుంచి మూడోసారి బి.జె.పి. తరఫున గెలిచి, కేంద్ర మంత్రిగా మొదటిసారి ప్రమాణం చేసిన రక్ష ఖడ్సే ఆ ఎత్తుకు చేరడానికి తీవ్ర సవాళ్లనే ఎదుర్కొంది. కాని ఓడిపోలేదు. ఆగిపోలేదు. ధైర్యం కూడగట్టుకుని చేసిన ప్రయాణమే గెలుపు తీరానికి చేర్చింది.

భర్త ఆత్మహత్యతో...

మహారాష్ట్రలోని నాసిక్‌లో కంప్యూటర్ సైన్స్ చదువుకున్న రక్ష ఖడ్సే జలగావ్‌కు చెందిన రాజకీయ కుటుంబంలో కోడలిగా వచ్చింది. ఆమె మామగారు ఏక్‌నాథ్ ఖడ్సే బి.జె.పి.లో ప్రముఖ నాయకుడు. మంత్రిగా కూడా పని చేశాడు. అతని కుమారుడు నిఖిల్‌తో రక్ష వివాహం జరిగింది. రక్షకు రాజకీయాల మీద పెద్దగా ఆసక్తి లేకపోయినా 2010లో జనం ‘కొథాలి’ అనే ఊరికి సర్పంచ్‌ను చేశారు. ఆ తర్వాత ఆమె జిల్లా పరిషత్ స్థాయి నాయకురాలైంది. కాని 2013లో జీవితం తల్లకిందులైంది. 2013 శాసనమండలి ఎన్నికలలో కేవలం 500 ఓట్ల తేడాతో ఓడిపోయినందుకు మనస్తాపం చెందిన రక్ష భర్త నిఖిల్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అది తెలిసి తండ్రి ఏక్‌నాథ్ తీవ్రంగా జబ్బు పడ్డాడు. ఇద్దరు చిన్న పిల్లలతో రక్ష మొత్తం కుటుంబానికి ఊతంగా నిలబడాల్సి వచ్చింది.



అత్తింటి ఆదరణతో...

భర్త చనిపోయినా అత్తింటిని రక్ష వీడలేదు. అత్తింటి వారు ముఖ్యంగా మామ గారు ఆమెను కన్న కూతురిలా ఆదరించి రాజకీయాలలో ప్రోత్సహించాడు. 2014 ఎన్నికలలో రావేర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె ఘన విజయం సాధించింది. భర్త చనిపోయిన సంవత్సరానికే ఇద్దరు చిన్న పిల్లలను తీసుకుని ఆమె సాగించిన ప్రచారం ఆ రోజుల్లో పెద్ద ఆసక్తిని రేపింది. జనం ఆమెకు మద్దతుగా నిలిచి గెలిపించారు. ఐదేళ్ల కాలంలో వ్యవసాయం, విద్యావ్యవస్థ కోసం రక్ష చేసిన కృషి జనానికి నచ్చడంతో 2019లో కూడా రావేర్ నుంచి ఎం.పి.గా ఘనంగా గెలిపించారు.

ప్రత్యర్థిగా మామగారు

రక్ష మామగారైన ఏక్‌నాథ్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో వచ్చిన విభేదాలు బి.జె.పి.ని వీడేలా చేశాయి. ఆయన ఎన్‌సిపి (శరద్‌పవార్) వర్గంలో చేరి ఎం.ఎల్.సి. అయ్యాడు. కాని రక్ష బి.జె.పి.లోనే కొనసాగింది. 2024 ఎన్నికలలో రావేర్ నుంచి రక్ష నిలబడుతున్నప్పుడు శరద్ పవార్ వర్గం ఏక్‌నాథ్‌ను ప్రత్యర్థిగా నిలపాలనుకున్నాయి. కాని కోడలి విజయం కోరిన ఏక్‌నాథ్ తాను పోటీలో నిలవనని దూరంగా ఉండిపోయాడు. దాంతో ఎన్.సి.పి. అభ్యర్థి శ్రీరామ్ పాటిల్ పై రక్షా ఖడ్సే రెండు లక్షల డెబ్బయి వేల మెజారిటీతో గెలిచింది.

పిల్లల కోసం...

పిల్లలను ముంబైలో చదివిస్తున్న రక్షా ఖడ్సే ప్రతి శని, ఆదివారాలు వారి దగ్గరకు వెళ్లి సమయం గడుపుతుంది. ‘పిల్లలను ముంబైలో ఉంటున్న మా ఆడపడుచులు బాగా చూసుకుంటారు. కాబట్టి నాకు టెన్షన్ లేదు. ప్రజలకు మేలు చేయాలన్నదే నా లక్ష్యం. మా ప్రాంతంలో ఇంకా సాగునీటి వసతి చాలా చోట్ల లేదు. దేశానికి అవసరమైన అరటిలో 35 శాతం మా దగ్గరే పండుతుంది. వ్యవసాయాన్ని ఇంకా వృద్ధి చేయడంలో నేను కృషి చేస్తాను. కేంద్ర మంత్రిగా ఇప్పుడు నా బాధ్యత పెరిగింది. ఏ శాఖ ఇచ్చినా సమర్థంగా పని చేసి నిరూపించుకుంటాను’ అని తెలిపింది రక్షా ఖడ్సే.

బయోచార్ కంపోస్టు... నిజంగా బంగారమే!

- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే క్రమంలో ఇటీవల అందుబాటులోకి వస్తున్న ఒక పద్ధతి ‘బయోచార్’ వినియోగం. దీన్నే మామూలు మాటల్లో ‘కట్టె బొగ్గు’ అనొచ్చు. పంట వ్యర్థాలతో రైతులే స్వయంగా దీన్ని తయారు చేసుకొని పొలాల్లో వేసుకోవచ్చు.
- బయోచార్ ఎరువు కాదు.. పంటలకు వేసే రసాయనిక ఎరువులు గానీ, సేంద్రియ ఎరువులు గానీ కనీసం 30-40% ఎక్కువ ఉపయోగపడేందుకు బయోచార్ ఉపయోగపడుతుంది అంటున్నారు స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్‌రెడ్డి.
- మట్టిలో పేరుకుపోయిన రసాయనిక అవశేషాలను తొలగించడానికి, వరిసాగులో మిథేన్ వాయువు కాలుష్యాన్ని తగ్గించడానికి బయోచార్ తోడ్పడుతుంది.
- ఒక్కసారి వేస్తే వందల ఏళ్లు నేలలో ఉండి మేలు చేస్తుంది.. సీజనల్ పంటలకైనా, పండ్ల తోటలకైనా బయోచార్ నిజంగా బంగారమే అంటున్న డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డితో ‘సాక్షి సాగుబడి’ ముఖాముఖి.



బయోచార్ కంపోస్టు

బయోచార్.. ఈ పేరు చెప్పగానే ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్‌రెడ్డి(55) పేరు చప్పున గుర్తొస్తుంది. 20 ఏళ్ల క్రితం నుంచి ‘బయోచార్’ అనే పేరును ఖరారు చేసి.. వ్యవసాయకంగా, పర్యావరణపరంగా దీని ప్రయోజనాల గురించి దేశ విదేశాల్లో విస్తృతంగా పరిశోధనలు, క్షేత్ర ప్రయోగాలు చేస్తూ ఇప్పటికి 5 పుస్తకాలను వెలువరించారు. వెబ్‌సైట్ ద్వారా ఈ ఓపెన్ సోర్స్ పుస్తకాలను అందుబాటులో ఉంచారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసంగాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఆయనతో ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

■ బయోచార్ (కట్టె బొగ్గు) అంటే..?

వ్యవసాయ వర్గాల్లో ఈ మధ్య తరచూ వినవస్తున్న మాట బయోచార్. బయో అంటే జీవం.. చార్ (చార్ కోల్) అంటే బొగ్గు. బయోచార్ అంటే ‘జీవం ఉన్న బొగ్గు’ అని చెప్పొచ్చు. భూసారానికి ముఖ్యమైనది సేంద్రియ కర్బనం. ఇది మట్టిలో స్థిరంగా ఉండదు. అంటే ఇది అస్థిర కర్బనం (ఒలేటైల్ కార్బన్). దీన్ని పెంపొందించుకోవటానికి ఫిక్స్‌డ్ కార్బన్ ఉపయోగపడుతుంది. అదే బయోచార్.

■ బయోచార్ కోసం కట్టెలు కాలబెట్టడం వల్ల అడవులకు, పర్యావరణానికి ముప్పు లేదా?

బొగ్గు నల్ల బంగారంతో సమానం. బంగారం అని ఎందుకు అన్నానంటే.. ప్రపంచంలో తయారు చేయలేనిది, డబ్బుతో కొనలేనిది మట్టి ఒక్కటే. హరిత విప్లవం పేరుతో మట్టిని మనం నాశనం/ విషతుల్యం/ నిర్జీవం చేసుకున్నాం. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం బయోచార్. అడవులను నరికి బయోచార్ తయారు చేయమని మనం చెప్పటం లేదు. పత్తి కట్టె, కంది కట్టె, వరి పొట్టు వంటి పంట వ్యర్థాలను వట్టిగానే తగులబెట్టే బదులు వాటితో బయోచార్ తయారు చేసుకోవచ్చు. వూరికే పెరిగే సర్కారు తుమ్మ వంటి కంప చెట్ల కలపతో లేదా జీడి గింజల పైపెంకులతో కూడా బయోచార్ తయారు చేసుకోవచ్చు. వరి పొట్టును బాయిలర్లలో, హోటళ్ల పొయ్యిల్లో కాల్చిన తర్వాత మిగిలే వ్యర్థాలను కూడా బయోచార్‌గా వాడుకోవచ్చు.

పరిమితంగా గాలి సోకేలా లేదా పూర్తిగా గాలి సోకకుండా ప్రత్యేక పద్ధతిలో, పెద్దగా పొగ రాకుండా, 450 నుంచి 750 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో కాల్చితే (ఈ ప్రక్రియనే ‘పైరోలిసిస్’ అంటారు) తయారయ్యే నల్లని కట్టె బొగ్గే బయోచార్. ఆరుబయట కట్టెను తగులబెడితే బూడిద మిగులుతుంది. ఈ పద్ధతిలో అయితే బూడిద తక్కువగా బయోచార్ ఎక్కువగా వస్తుంది. రైతు స్థాయిలో ఇనుప డ్రమ్ములో లేదా కందకం తవ్వి కూడా దీన్ని తయారు చేసుకోవచ్చు. బయోచార్ వందల ఏళ్ల పాటు మట్టిలో ఉండి మేలుచేసే సూక్ష్మజీవ రాశికి, పోషకాలకు, మొత్తంగా పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుంది. సాగు నీటిలో విషాలను పరిహరిస్తుంది. దీనితో వ్యవసాయంలో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలతో పోల్చితే.. దీన్ని తయారు చేసేటప్పుడు వెలువడే కొద్దిపాటి పొగ వల్ల కలిగే నష్టం చాలా తక్కువ.

■ ‘బయోచార్ కంపోస్టు’ అంటే ఏమిటి?

బయోచార్ అంటే.. పొడిగా ఉండే కట్టె బొగ్గు. దీన్ని నేరుగా పొలాల్లో వేయకూడదు. బయోచార్ కంపోస్టు తయారు చేసుకొని వేయాలి. చిటికెడు బొగ్గులో లెక్కలేనన్ని సూక్ష్మరంధ్రాలు ఉంటాయి. నేరుగా వేస్తే మట్టిలోని పోషకాలను బొగ్గు పెద్దమొత్తంలో పీల్చుకుంటుంది. అందువల్ల వట్టి బయోచార్‌ను మాత్రమే వేస్తే పంటకు పోషకాలు పూర్తిగా అందవు. అందుకనే. వట్టి బయోచార్‌ను కాకుండా బయోచార్ కంపోస్టును తయారు చేసుకొని వేస్తే ఈ సమస్య ఉండదు.

మాగిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు లేదా బయోగ్యాస్ స్లర్రీ లేదా జీవామృతం లేదా పంచగవ్య వంటి.. ఏదైనా సేంద్రియ ఘన/ ద్రవరూప ఎరువులలో ఏదో ఒకదాన్ని బయోచార్‌ను సమపాళ్లలో కలిపి కుప్ప వేసి, బెల్లం నీటిని చిలకరిస్తూ రోజూ కలియదిప్పుతూ ఉంటే 15 రోజుల్లో బయోచార్ కంపోస్టు సిద్ధం అవుతుంది. అప్పుడు దీన్ని పొలాల్లో వేసుకుంటే సత్ఫలితాలు వస్తాయి. మన పొలంలో మట్టి గుణాన్ని బట్టి తగిన మోతాదులో వేసుకోవటం ముఖ్యం. బయోచార్ ఒకటి రెండు సీజన్లలో ఖర్చయిపోయే ఎరువు వంటిది కాదని రైతులు గుర్తుంచుకోవాలి. వంద నుంచి వెయ్యేళ్ల వరకు నేలలో స్థిరంగా ఉండి మేలు చేస్తుంది.

■ రసాయనిక ఎరువులు వాడే రైతులకు కూడా బయోచార్ ఉపయోగపడుతుందా?

బయోచార్ సేంద్రియ ఎరువులు లేదా రసాయనిక ఎరువులు వాడే రైతులు కూడా వాడుకోవచ్చు. కట్టెబొగ్గుతో యూరియా, ఫాస్ఫేటు వంటి వాటిని కలిపి వేసుకోవచ్చు. వట్టిగా యూరియా వేస్తే 20–30 శాతం కన్నా పంటకు ఉపయోగపడదు. అదేగనక బయాచార్‌తో యూరియా కలిపి వేస్తే 30–40% ఎక్కువగా పంటకు ఉపయోగపడుతుంది. బొగ్గులోని ఖాళీ గదులు ఉంటాయి కాబట్టి యూరియాను కూడా పట్టి ఉంచి, ఎక్కువ రోజుల పాటు పంట మొక్కల వేర్లకు నెమ్మదిగా అందిస్తుంది.

■ వరి సాగుకూ ఉపయోగమేనా?

వరి పొలాల్లో నీటిని నిల్వగట్టే పద్ధతి వల్ల మిథేన్ వంటి హరిత గృహ వాయువులు గాలిలో కలుస్తూ వాతావరణాన్ని అమితంగా వేడెక్కిస్తున్నాయి. రసాయనిక ఎరువులు వాడే పొలాల వాయుకాలుష్యం మరింత ఎక్కువ. ఈ పొలాల్లో బయోచార్ వేస్తే.. నీటి అడుగున మట్టిలో ఆక్సిజన్‌ను లభ్యత పెరుగుతుంది. మిథేన్ తదితర హరిత గృహ వాయువులను బొగ్గు పీల్చుకుంటుంది. కాబట్టి, వాతావరణానికి జరిగే హాని తగ్గుతుంది. అందుకనే బయోచార్ వాడితే కార్బన్ క్రెడిట్స్ పేరిట డబ్బు ఇచ్చే పద్ధతులు కూడా సమీప భవిష్యత్తులోనే అమల్లోకి రానున్నాయి.

■ ఏ పొలానికి ఎంత వెయ్యాలో తెలిసేదెలా?

మీ భూమికి ఖచ్చితంగా ఎంత మొత్తంలో బయోచార్ కంపోస్టు వేస్తే సరిపోయేదీ ఒక టెస్ట్ ద్వారా మీరే స్పష్టంగా తెలుసుకోవాలి. ఆ విషయం ఎవరినో అడిగితే తెలియదు. మీ పొలంలో ఎత్తయిన ప్రదేశంలో 5 చిన్న మడులు చేసుకొని, వాటిల్లో బయోచార్ కంపోస్టును వేర్వేరు మోతాదుల్లో వేసి.. ఆ 5 మడుల్లోనూ ఒకే రకం పంటను సాగు చేయండి. 3 నెలల్లో మీకు ఫలితం తెలిసిపోతుంది. 1 చదరపు మీటరు విస్తీర్ణం (ఈ విసీర్ణాన్ని మీరే నిర్ణయించుకోండి)లో పక్క పక్కనే 5 మడులు తయారు చేసుకోండి. అంటే.. మొత్తం 5 చ.మీ. స్థలం కేటాయించండి. ఒక్కో దాని మధ్య గట్టు మాత్రం ఎత్తుగా, బలంగా వేసుకోండి.

1వ మడిలో బయోచార్ కంపోస్టు అసలు వెయ్యొద్దు. 2వ మడిలో బయోచార్ కంపోస్టు 0.5 కిలో, 3వ మడిలో 1 కిలో, 4వ మడిలో 2 కిలోలు, 5వ మడిలో 4 కిలోలు వెయ్యండి. ఈ 5 మడుల్లో 3 నెలల్లో చేతికొచ్చే ఒకే రకం పంట విత్తుకోండి లేదా కూరగాయ మొక్కలు నాటుకోండి.

బయోచార్ కంపోస్టు విషయంలో వత్యాసాలు పాటించి చూడటం కోసమే ఈ ప్రయోగాత్మక సాగు. ఇక మిగతా పనులన్నీ ఈ మడుల్లో ఒకేలా చేయండి. అంటే నీరు పెట్టటం, కలుపు తీయటం, పురుగుమందులు లేదా కషాయాలు పిచికారీ చేయటం అన్నీ ఒకేలా చెయ్యండి.

ఆ పంటల్లో పెరిగే దశలో వచ్చే మార్పులన్నిటినీ గమనించి, రాసుకోండి. ప్రతి వారానికోసారి ఫొటోలు/వీడియో తీసి పెట్టుకోండి. కాండం ఎత్తు, లావు, పిలకలు/కొమ్మల సంఖ్య, పూత, దిగుబడి, గింజ/కాయల సైజు, ఆ మొక్కల వేర్ల పొడవు వంటి అన్ని విషయాలను నమోదు చేయండి. 3 నెలల తర్వాత ఆ పంట పూర్తయ్యే నాటికి బయోచార్ కంపోస్టు అసలు వేయని మడితో వేర్వేరు మోతాదుల్లో వేసిన మడుల్లో వచ్చిన దిగుబడులతో పోల్చిచూడండి. బయోచార్ కంపోస్టు ఏ మోతాదులో వేసిన మడిలో అధిక దిగుబడి వచ్చిందో గమనించండి. ఇదే మోతాదులో మీ పొలం అంతటికీ వేసుకోండి.



బయోచార్ కంపోస్టుపై శిక్షణ ఇస్తున్న డా. సాయి భాస్కర్ రెడ్డి

బయోచార్‌పై మరింత సమాచారం కోసం చూడండి..
www.youtube.com/@biocharchannel
https://biochared.com

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 22 వరకు

ఎత్తు మడులపై అల్లం

- వేరు కుళ్లు సమస్య రాదు.. పంట విఫలమయ్యే బెడద లేదు..
- ఎకరానికి సగటున 5-6 టన్నుల దిగుబడి పెరుగుదల





డాక్టర్ కిరణ్

సాధారణ బోదెలపైన అల్లం విత్తుకోవటం కన్నా వెడల్పాటి ఎత్తు మడులపై రెండు సాళ్లుగా నాటుకోవటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎత్తు మడులపై అల్లం సాగు వల్ల వేరుకుళ్ల వంటి తెగుళ్ల సమస్య తీరిపోతుందని, కనీసం 30–40% అల్లం దిగుబడి పెరుగుతుందని ఉత్తరాంధ్ర జిల్లాల్లో గిరిజన రైతులతో పనిచేస్తున్న వికాస స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎస్. కిరణ్ తెలిపారు. సాధారణంగా రైతులు బోదెలు తోలి అల్లం విత్తుకుంటూ ఉంటారు. వర్షాలకు కొద్ది రోజులకే బోదె, కాలువ కలిసిపోయి నీరు నిలబడటం ప్రారంభమవుతుంది. ఈ కారణంగా వేరుకుళ్ల వంటి తెగుళ్లు వస్తుంటాయి. నీటి ముంపు పరిస్థితుల్లో పంట దిగుబడి భారీగా దెబ్బతిని ఖర్చులు కూడా రాని సందర్భాలు ఎదురవుతూ ఉంటాయి.

ఈ సమస్యల నుంచి బయటపడి పంట విషలం కాకుండా మంచి దిగుబడి పొందాలంటే ఎత్తుమడులపై విత్తుకోవటమే మేలని వికాస సంస్థ పాడేరు, అరకు ప్రాంత రైతులకు అవగాహన కల్పిస్తోంది. ప్రేమ్‌జీ ఫౌండేషన్ తోడ్పాటుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం గత ఖరీఫ్ నాటికి రెండేళ్లలోనే 543 మంది రైతులకు విస్తరించిందని డా. కిరణ్ వివరించారు. అడుగు ఎత్తున, రెండు నుంచి రెండున్న అడుగుల వెడల్పుతో ఎత్తు మడులను పొలంలో వాలుకు అడ్డంగా నిర్మించుకోవాలి. రెండు వరుసలుగా అల్లం లేదా పసుపు విత్తుకోవచ్చు. అల్లం సాగులో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరిస్తున్నారు. ఎత్తుమడులపై విత్తుకోవటం, మురుగు నీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయటంతో పాటు ఎకరానికి 200 కిలోల ఘన జీవామృతం, 25 కిలోల వేపపిండి వేస్తారు. ప్రతి 15 రోజులకోసారి ద్రవ జీవామృతం (ఏటా 600 లీటర్లు) మొక్కల మొదళ్లలో పోస్తున్నారు. ఎకరానికి కనీసం 14–15 టన్నుల దిగుబడులు సాధిస్తున్నారని డా. కిరణ్ వివరించారు. బోదెలు తోలి సాగు చేసే సాధారణ పద్ధతిలో సగటున ఎకరానికి 9–11 టన్నుల దిగుబడి వస్తుంటుందని, ఎత్తుమడుల పద్ధతిలో సగటున ఎకరానికి 5–6 టన్నులు అదనపు దిగుబడి వస్తోందన్నారు. ఎత్తుమడుల వల్ల కలుపు తీయటం సులభం అవుతుంది. పంట విఫలమై రైతు నష్టపోయే ప్రమాదం తప్పుతుంది. మైదాన ప్రాంతాల రైతులు కూడా ఎత్తు మడుల పద్ధతిని నిశ్చింతగా అనుసరించవచ్చని డా. కిరణ్ (98661 18877) భరోసా ఇస్తున్నారు.

13 నుంచి తిరుపతిలో సేంద్రియ ఎఫ్‌పిఓల మేళా

కనెక్ట్ టు ఫార్మర్ సంస్థ నాబార్డ్ సహకారంతో ఈ నెల 13,14,15 తేదీల్లో తిరుపతిలోని మహతి కళాక్షేత్రం (టౌన్‌క్లబ్)లో గో ఆధారిత వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులు, ఎఫ్‌పిఓల మేళాను నిర్వహించనుంది. కనెక్ట్ టు ఫార్మర్ సంస్థ నెలకో సేంద్రియ సంత నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 13 ఉ. 11 గంటలకు తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్, నాబార్డ్ సీజీఎం గోపాల్ మేళాను ప్రారంభిస్తారు. పాత విత్తనాల ప్రదర్శన ఉంటుంది. 14న ఉదయం అమేయ కృషి వికాస కేంద్రం (భువనగిరి) వ్యవస్థాపకులు, ప్రముఖ రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి ఉద్యాన పంటల్లో గ్రాఫ్టింగ్‌పై శిక్షణ ఇస్తారు. 15న ప్రకృతి చికిత్సా పద్ధతులపై నేలకొండపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు డా. కె. రామచంద్ర, ప్రకృతి సేద్యంపై గ్రామభారతి అధ్యక్షులు సూర్యకళ గుప్త, ప్రసిద్ధ అమృతాహార ప్రచారకులు ప్రకృతివనం ప్రసాద్, ఆరుతడి వరి సాగుపై ఆదర్శ రైతు శ్రీనివాస్ (గద్వాల్) వివరిస్తారు. ఇతర వివరాలకు 63036 06326.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



చివరి రెండు మ్యాచ్‌లకు నేపాల్ జట్టులో లమిచానే


టి20 ప్రపంచకప్‌లో నేపాల్ జట్టు వెస్టిండీస్ వేదికగా ఆడే చివరి రెండు మ్యాచ్‌లకు ఆ జట్టు స్టార్ క్రికెటర్ సందీప్ లమిచానే అందుబాటులోకి రానున్నాడు. గతంలో అత్యాచార ఆరోపణలు ఎదుర్కొని ఎనిమిదేళ్ల జైలు శిక్షకు గురై... ఆ తర్వాత ఆధారాలు లేకపోవడంతో ఈ కేసు నుంచి విముక్తి పొందిన లమిచానేకు అమెరికా ప్రభుత్వం వీసా నిరాకరించింది. దాంతో అతను అమెరికా వేదికగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. నేపాల్ తమ చివరి రెండు మ్యాచ్‌లను ఈనెల 15న దక్షిణాఫ్రికాతో, 17న బంగ్లాదేశ్‌తో కింగ్‌స్టౌన్‌లో ఆడనుంది.

5000 మీటర్లలో గుల్వీర్ కొత్త జాతీయ రికార్డు



భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ పురుషుల 5000 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్ ట్రాక్ ఫెస్టివల్ హై పెర్ఫార్మెన్స్ మీట్‌లో గుల్వీర్ ఈ ఘనత సాధించాడు. ఈ మీట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల గుల్వీర్ 5000 మీటర్లను 13 నిమిషాల 18.92 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అవినాశ్ సాబ్లే (13ని:19.30 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును గుల్వీర్ బద్దలు కొట్టాడు. ప్రస్తుతం 10,000 మీటర్లలోనూ జాతీయ రికార్డు గుల్వీర్ పేరిటే ఉంది.

కేంద్ర క్రీడా శాఖ మంత్రిగా మన్‌సుఖ్ మాండవియా



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడా శాఖ మంత్రిగా మన్‌సుఖ్ మాండవియా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించిన అనురాగ్ ఠాకూర్ స్థానంలో 52 ఏళ్ల మాండవియాకు అవకాశం దక్కింది. గుజరాత్‌లోని పోర్‌బందర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన గత మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. మాండవియాకు తోడు మహారాష్ట్రకు చెందిన రక్షా ఖడ్సేను క్రీడా శాఖ సహాయ మంత్రిగా కూడా నియమించారు. ఠాకూర్ క్రీడా మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 7 పతకాలు గెలుచుకుంది. ఠాకూర్ మరోసారి ఎన్నికల్లో గెలిచినా... ఈ సారి ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.

ముంబై క్రికెట్ సంఘం అధ్యక్షుడి హఠాన్మరణం

ప్రపంచకప్ కోసం వెళ్లి కన్నుమూత


అమోల్ కాలే

న్యూయార్క్: ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) అధ్యక్షుడు అమోల్ కాలే (47) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వరల్డ్‌కప్ చూసేందుకు న్యూయార్క్‌కు వెళ్లిన ఆయన అక్కడే ఆదివారం కన్నుమూశారు. ఆదివారం నాసా కౌంటీ స్టేడియంలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఎంసీఏ కార్యదర్శి అజింక్య నాయక్‌తో కలిసి కాలే వీక్షించారు. ఆ తర్వాతే ఆయనకు గుండెపోటు వచ్చినట్లు సమాచారం. 2022 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో మాజీ క్రికెటర్ సందీప్ పాటిల్‌ను ఓడించి ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన పదవీకాలంలో కాలే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే 2024–25 సీజన్ నుంచి ముంబై రంజీ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులను రెట్టింపు చేయడం వాటిలో ప్రధానమైంది. ఎంసీఏ బాధ్యతలతో పాటు ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ప్రమోటర్లలో ఒకడిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు.

‘సూపర్–8’కు దక్షిణాఫ్రికా

- బంగ్లాదేశ్‌పై 4 పరుగులతో గెలుపు
- మెరిసిన క్లాసెన్
- రాణించిన కేశవ్, రబడ, నోర్జే


రబడ, కేశవ్ మహరాజ్


హృదయ్

న్యూయార్క్: దక్షిణాఫ్రికాపై బంగ్లాదేశ్ టి20ల్లో ఏనాడూ గెలవలేదు. కానీ ప్రపంచకప్‌లో భాగంగా సోమవారం జరిగిన గ్రూప్ ‘డి’ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌కు విజయం సాధించే అవకాశం వచ్చింది. బంగ్లాదేశ్ నెగ్గడానికి ఆఖరి 6 బంతుల్లో 11 పరుగులు చేయాలి. ఒక వైడ్ రావడం, మహ్మదుల్లా (27 బంతుల్లో 20; 2 ఫోర్లు) క్రీజులో ఉండటంతో బంగ్లా కోటి ఆశలతో ఉంది. కేశవ్ మహరాజ్ తొలి 4 బంతుల్లో వికెట్ తీసి 5 పరుగులిచ్చాడు. ఇక 2 బంతుల్లో 6 పరుగులు కావాల్సి ఉండగా మహ్మదుల్లా భారీషాట్ బాదాడు. కానీ సిక్సర్‌గా వెళ్లే బంతిని దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్క్‌రమ్ తనను తాను బ్యాలెన్స్ చేసుకొని బౌండరీ లైన్ వద్ద చక్కని క్యాచ్ అందుకోవడంతోనే బంగ్లా ఓటమి ఖాయమైంది. చివరి బంతికి సిక్స్ కొడితే స్కోరు సమమయ్యే స్థితిలో బంగ్లాదేశ్ ఒక్క పరుగే తీసింది. దాంతో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో గెలిచి వరుసగా మూడో విజయంతో ‘సూపర్–8’ దశకు అర్హత సాధించింది.

టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా ముందుగా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (38 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో తంజీమ్ హసన్ సకిబ్ 3, టస్కిన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులకే పరిమితమై ఓడింది. తౌహిద్ హృదయ్ (34 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగ్గా ఆడాడు. కేశవ్ మహరాజ్ 3, రబడ, నోర్జే చెరో 2 వికెట్లు తీశారు.

సఫారీ విలవిల

బౌలర్లకు అనుకూలించిన పిచ్‌పై పరుగులు క్లిష్టంగా, వికెట్లు సులభంగా వచ్చాయి. ముందుగా దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ హెండ్రిక్స్ (0) డకౌటయ్యాడు. డికాక్ (18; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడు మూడో ఓవర్ ముగియకముందే ముగిసింది. ఇద్దర్ని తంజీమ్ పెవిలియన్ చేర్చగా, మార్క్‌రమ్ (4)ను టస్కిన్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. స్టబ్స్ (0)ను కూడా తంజీమ్ ఖాతా తెరువనివ్వలేదు. దీంతో 4.2 ఓవర్లలోనే కీలకమైన 4 వికెట్లను కోల్పోయిన దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ దశలో క్లాసెన్, మిల్లర్ ఇన్నింగ్స్‌ను నడిపించి జట్టు స్కోరు ను 100 దాటించారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరు అవుట్ కావడంతో డెత్ ఓవర్లలో ఆశించినన్ని పరుగులు రాలేదు. లక్ష్యం సులువుగానే ఉంది. ఇన్నింగ్స్ మొదలయ్యాక... 8 ఓవర్లు ముగియక ముందే ఓపెనర్ తంజిద్ (9), లిటన్ దాస్ (9), షకీబుల్ హసన్ (3) వికెట్లను కోల్పోయింది. అప్పటికి జట్టు స్కోరు 37/3. పదో ఓవర్లో 50 పరుగులకు చేరగానే నజ్ముల్ (14) కూడా వికెట్ పారేసుకున్నాడు. తౌహిద్ హృదయ్ చేసిన ఆ కాస్త పోరాటంతో జట్టు వంద పరుగులకు సమీపించింది. కానీ 94 పరుగుల స్కోరు వద్ద తౌహిద్ వికెట్ పడటంతో బంగ్లా విజయానికి దూరమైంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు
పాకిస్తాన్ X కెనడా
వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



భారత ఫుట్‌బాల్ జట్టు సత్తాకు పరీక్ష

- నేడు ఆసియా చాంపియన్ ఖతర్‌తో కీలకపోరు
- గెలిస్తే నేరుగా మూడో రౌండ్‌కు అర్హత

దోహా: స్టార్ ప్లేయర్, కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత... భారత ఫుట్‌బాల్ జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. 2026 ప్రపంచకప్ ఆసియా జోన్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భాగంగా గ్రూప్ ‘ఎ’లో భారత జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో నేడు ఆడనుంది. ఓవరాల్‌గా ఖతర్‌తో ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆడిన భారత్ ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకొని, మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇప్పటికే ఆసియా జోన్ మూడో రౌండ్‌కు అర్హత పొందిన ఖతర్ జట్టుకు ఈ మ్యాచ్ ప్రాక్టీస్‌లా ఉపయోగ పడనుండగా... భారత జట్టుకు మాత్రం తాడోపేడోలాంటిది. గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ నాయకత్వంలో ఈ మ్యాచ్ ఆడనున్న భారత జట్టు విజయం సాధిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా మూడో రౌండ్‌కు చేరుకుంటుంది. ఒకవేళ ‘డ్రా’గా ముగిస్తే మాత్రం అఫ్గానిస్తాన్, కువైట్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ ఫలితంపై భారత జట్టు భవితవ్యం ఆధారపడి ఉంటుంది. భారత్ తమ మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంటే అఫ్గానిస్తాన్–కువైట్ మ్యాచ్ కూడా ‘డ్రా’గా ముగియాలి. అలా జరిగితేనే భారత్ మూడో రౌండ్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ అఫ్గానిస్తాన్–కువైట్ మ్యాచ్‌లో ఫలితం వస్తే గెలిచిన జట్టు మూడో రౌండ్‌కు చేరుకుంటుంది. భారత్‌తోపాటు ఓడిన మరో జట్టు రెండో రౌండ్‌కే పరిమితమవుతుంది. 2026 ప్రపంచకప్‌లో తొలిసారి 48 జట్లు పోటీపడనుండగా... ఆసియా నుంచి 8 జట్లకు నేరుగా అవకాశం లభిస్తుంది. మరో బెర్త్ ప్లే ఆఫ్ మ్యాచ్ ద్వారా ఖరారవుతుంది.

వెర్‌స్టాపెన్ ‘హ్యాట్రిక్’

కెనడా గ్రాండ్‌ప్రిలో వరుసగా మూడో ఏడాది విజయం



మాంట్రియల్: ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించకపోయినా... అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో తన ఖాతాలో ఆరో విజయం జమ చేసుకున్నాడు. కెనడా గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును రెండో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 45 నిమిషాల 47.927 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. వరుసగా మూడో ఏడాది కెనడా గ్రాండ్‌ప్రిలో టైటిల్ నెగ్గి ‘హ్యాట్రిక్’ నమోదు చేసిన వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఓవరాల్‌గా 60వ విజయం సాధించాడు. ‘పోల్ పొజిషన్’తో రేసును మొదలుపెట్టిన జార్జి రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో నిలువగా... లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఐదుగురు డ్రైవర్లు కార్లోస్ సెయింజ్ (ఫెరారీ), అలెగ్జాండర్ అల్బోన్ (విలియమ్స్), సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ), లొగాన్ సార్జెంట్ (విలియమ్స్) రేసును ముగించలేకపోయారు. 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటికి తొమ్మిది రేసులు ముగిశాయి. ఆరు రేసుల్లో నెగ్గిన వెర్‌స్టాపెన్ 194 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని పదో రేసు స్పెయిన్ గ్రాండ్‌ప్రి ఈనెల 23న బార్సిలోనాలో జరుగుతుంది.

భారత క్రికెటర్ల ‘టాస్’

బెంగళూరు: ‘నేను టాస్‌కు సిద్ధం’ అంటూ ఒకవైపు జస్‌ప్రీత్ బుమ్రా... ‘టాస్ కోసం ఎదురు చూస్తున్నా’ అంటూ మరోవైపు సూర్యకుమార్ యాదవ్ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు తెర లేపారు. అసలు ఈ ‘టాస్’ ఏమిటనే ఆసక్తి అందరిలో నెలకొంది. ప్రముఖ సంస్థ ఐటీసీ లిమిటెడ్ ఇప్పుడు ఈ వివరాలను వెల్లడించింది. తమ బ్రాండ్ సన్‌ఫీస్ట్ ద్వారా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న ‘ఈపీ నూడుల్స్’కు మరో కొత్త రుచిని జోడించి ‘ఈపీ టాస్’ అంటూ మార్కెట్లోకి తీసుకొచ్చింది. తాజా ప్రచారమంతా ‘ఈపీ టాస్’ గురించేనని సంస్థ ప్రకటించింది. ఇద్దరు ఆటగాళ్లతో పాటు భారత కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా ఈ వాణిజ్య ప్రకటనలో పాల్గొన్నాడు. వరల్డ్‌కప్ సమయంలో క్రికెట్ అభిమానులకు మరింత చేరువయ్యేందుకు కొత్త తరహా ‘ఈపీ టాస్’ ఉత్పత్తిని తీసుకొచ్చినట్లు ఐటీసీ సీఈఓ కవితా చతుర్వేది పేర్కొన్నారు.

సినెర్... కొత్త నంబర్‌వన్

టెన్నిస్‌లో టాప్ ర్యాంక్ అందుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా ఘనత



పారిస్: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఇటలీ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్ తన కెరీర్‌లో గొప్ప ఘనత సాధించాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సినెర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 9,525 పాయింట్లతో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. టెన్నిస్‌లో కంప్యూటర్ ఆధారిత ర్యాంకింగ్స్ (1973 నుంచి) మొదలయ్యాక వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా 22 ఏళ్ల సినెర్ రికార్డు నెలకొల్పాడు. ఈ ఏడాది సినెర్ 33 మ్యాచ్‌ల్లో గెలిచి, 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు మయామి మాస్టర్స్ సిరీస్, రోటర్‌డామ్ ఓపెన్‌లో అతను విజేతగా నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్లో ఓడిపోయాడు. గతవారం వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రెండు స్థానాలు పడిపోయి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన కార్లోస్ అల్‌కరాజ్ ఒక స్థానం పురోగతి సాధించి రెండో ర్యాంక్‌లో నిలిచాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నగాల్

భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ 77వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆదివారం జర్మనీలో జరిగిన నెకర్ కప్ టోర్నీలో విజేతగా నిలిచిన సుమిత్ 18 స్థానాలు పురోగతి సాధించాడు. తాజా ర్యాంక్ కారణంగా సుమిత్ వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఖాయమైంది.

సినిమా

డేట్ చేంజ్


ధనుష్

ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘రాయన్’. ఈ మూవీ కాస్త ఆలస్యంగా థియేటర్స్‌లోకి రానుంది. సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్, ఎస్‌జే సూర్య, సెల్వరాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాను సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను తొలుత జూన్ 13న విడుదల చేయాలనుకున్నారు. కానీ జూలై 26న రిలీజ్ చేయనున్నట్లుగా ధనుష్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. ధనుష్ కెరీర్‌లో 50వ సినిమాగా రూపొందిన ‘రాయన్’ కి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.


రకుల్ ప్రీత్ సింగ్

రికార్డ్స్ చూసుకో..!


ప్రభాస్

‘ఈ భూమ్మీద మొదటి నగరం.. ఈ వరల్డ్‌లో చివరి నగరం కాశీ’ అనే డైలాగ్‌తో ‘కల్కి 2898 ఏడీ’ ట్రైలర్ ప్రారంభమైంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించారు. వైజయంతీ మూవీస్‌పై సి.అశ్వినీదత్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, ఇంగ్లిష్‌తో సహా పలు భాషల్లో ఈ ట్రైలర్‌ని విడుదల చేశారు. ‘నువ్వు ఇప్పుడు కనబోయేది మామూలు ప్రాణం కాదమ్మా.. సృష్టి.. నేను కాపాడతా’(అమితాబ్ బచ్చన్), ‘పాయింట్ ఏంటంటే నేనొక్కడినే ఆ అమ్మాయిని తీసుకురాగలను.. రికార్డ్స్ చూసుకో ఇంత వరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు.. ఇది కూడా ఓడిపోను’(ప్రభాస్), ‘ఇంకా తొలి ఊపిరి కూడా తీసుకోని ఈ బిడ్డ కోసం ఇంకెంత మంది చనిపోవాలి’(దీపికా పదుకోన్), ‘భయపడకు.. మరో ప్రపంచం వస్తుంది’(కమల్‌హాసన్) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ‘‘ఒక ఫిల్మ్ మేకర్‌గా ఇండియన్ మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ పట్ల నాకు చాలా ప్యాషన్ ఉంది. ‘కల్కి 2898 ఏడీ’లో ఈ రెండు ఎలిమెంట్స్‌ని మెర్జ్ చేయడం మా ఆర్టిస్టులు, టీం అద్భుతమైన ప్రతిభ, అంకితభావం వల్ల సాధ్యమైంది. ఈ కలని సాకారం చేసుకోవడానికి మాకు చాలా టైమ్ పట్టింది. ఈ ట్రైలర్ తెలుగు ప్రేక్షకులను, యావత్ దేశాన్ని గర్వించేలా చేస్తుందని, సినిమా కోసం వారిని ఎగ్జైట్ చేసేలా ఉంటుందని ఆశిస్తున్నాను’’ అన్నారు.

మహారాజపై నమ్మకం ఉంది – విజయ్ సేతుపతి


మమతా మోహన్‌దాస్, అభిరామి, విజయ్ సేతుపతి

‘‘మహారాజ’ నా కెరీర్‌లో 50వ సినిమా. ఈ మూవీ విజయంపై చాలా నమ్మకం ఉంది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం మెప్పిస్తుంది. థియేటర్స్‌కి వచ్చి చూడండి’’ అని విజయ్ సేతుపతి అన్నారు. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘మహారాజ’. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్, అభిరామి ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ మూవీని ఏపీ, తెలంగాణలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ‘మహారాజ’ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో మమతా మోహన్‌దాస్ మాట్లాడుతూ– ‘‘తమిళంలో కొంత గ్యాప్ తర్వాత నేను చేసిన సినిమా ‘మహారాజ’. విజయ్ సేతుపతిగారికి నేను పెద్ద అభిమానిని. ఆయనతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదు’’ అన్నారు. ‘‘విజయ్‌గారి 50వ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం సంతోషంగా ఉంది’’ అన్నారు నితిలన్ సామినాథన్. ‘‘మహారాజ’లో మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. విజయ్‌గారి నట విశ్వరూపం చూస్తారు’’ అన్నారు నిర్మాత ఎన్వీ ప్రసాద్. ఈ కార్యక్రమంలో నటి అభిరామి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

సికందర్ యాక్షన్


సల్మాన్ ఖాన్

ముంబైలో అదిరిపోయే ఫైట్స్ చేసేందుకు సిద్ధం అవుతున్నాడు సికందర్. సల్మాన్ ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కనున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘సికందర్’. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారు. ఇందులో సికందర్‌గా కనిపించనున్నారు సల్మాన్ ఖాన్. కాగా ఈ మూవీ చిత్రీకరణ ఈ నెల 18 నుంచి ముంబైలో ప్రారంభం కానుంది. తొలుత యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేలా సన్నాహాలు చేస్తున్నారు ఏఆర్ మురుగదాస్. ముంబై షెడ్యూల్ తర్వాత విదేశాల్లో ఓ భారీ షెడ్యూల్‌ను జరపాలని ప్లాన్ చేస్తోందట యూనిట్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా విడుదల కానుంది.

ఇంకా సమయం ఉంది

‘‘భారతీయుడు 2(తమిళంలో ఇండియన్ 2)’ చిత్రం నా కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుంది. ఈ మూవీలో నేను చేసిన పాత్ర నా నిజజీవితానికి చాలా దగ్గరగా ఉందనే భావన కలిగించింది. ఈ సినిమా గురించి చాలా విషయాలు జనాలతో పంచుకోవాలనే ఆత్రుతగా ఉంది. కానీ, అందుకు ఇంకా సమయం ఉంది’’ అంటున్నారు హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్. నటుడు, దర్శక–నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరి 21న జరిగిన విషయం తెలిసిందే. పెళ్లి కోసం కొద్ది రోజులు సినిమాలకు విరామం ఇచ్చిన ఈ బ్యూటీ మళ్లీ జోరుమీదున్నారు. రకుల్‌ప్రీత్ సింగ్ నటించిన తాజా చిత్రం ‘భారతీయుడు 2’. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన ‘భారతీయుడు’ కి సీక్వెల్‌గా ‘భారతీయుడు 2’ రూపొందింది. ఈ మూవీలో రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రలో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ–‘‘భారతీయుడు 2’ నా కెరీర్‌లోనే ఎంతో స్పెషల్ మూవీ. ఇందులో ఆత్మవిశ్వాసం కలిగిన అమ్మాయిగా కనిపిస్తాను. నా గత చిత్రాలకంటే ఈ మూవీలోని నా క్యారెక్టర్ వైవిధ్యంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుతో ప్రయాణం చేసినన్ని రోజులు గొప్ప అనుభూతి కలిగింది. శంకర్‌గారితో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను’’ అన్నారు.

అది నా అదృష్టం – వైవీఎస్ చౌదరి


వైవీఎస్ చౌదరి, గీత

‘‘నా కెరీర్‌లో ఎంతోమంది కొత్తవారిని పరిచయం చేశాను. ‘దేవదాసు’ మూవీతో రామ్‌ని, ‘రేయ్’ చిత్రంతో సాయి ధరమ్ తేజ్‌ని హీరోలుగా పరిచయం చేశాను. ఇప్పుడు నందమూరి కుటుంబంలో నాలుగో తరానికి చెందిన తారక రామారావుని ప్రపంచానికి పరిచయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను’’ అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. దివంగత హరికృష్ణ కుమారుడు దివంగత జానకి రామ్(ఎన్టీఆర్ సోదరుడు) తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ కొత్త సినిమాని ప్రకటించారు వైవీఎస్ చౌదరి. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ సినిమాని నిర్మించనున్నారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ–‘‘శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి’ మూవీతో దర్శకునిగా నాకు తొలి అవకాశం ఇచ్చిన నాగార్జునగారికి రుణపడి ఉంటాను. తొలి సినిమాకే నాగేశ్వరరావుగారితో పని చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టం. తాజాగా నా కొత్త సినిమాకి హీరోగా ఎవర్ని తీసుకోవాలి? అనుకుంటున్న సమయంలో తమ్ముల ప్రసన్న కుమార్‌గారు తారక రామారావుని చూపించారు. తనని చూడగానే జానకి రామ్ కలని నెరవేర్చుతాడనిపించింది. ఈ మూవీ ద్వారా తెలుగమ్మాయిని కథానాయికగా పరిచయం చేస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తా’’ అన్నారు. ‘‘మా స్నేహితులు, సన్నిహితుల అండదండలతో న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై ఫస్ట్ ప్రొడక్షన్ స్టార్ట్ చేయబోతున్నాం. అందరి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నాం’’ అన్నారు యలమంచిలి గీత. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ అత్తిలి.

రాజధాని రౌడీ వస్తున్నాడు


యశ్

‘కేజీఎఫ్’ ఫేమ్ యశ్ హీరోగా, షీనా హీరోయిన్‌గా నటించిన కన్నడ చిత్రం ‘రాజధాని’. కేవీ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అర్జున్ జన్య సంగీతం అందించారు. కన్నడలో విజయం సాధించిన ఈ మూవీని ‘రాజధాని రౌడీ’ పేరుతో సంతోష్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సంతోష్ కుమార్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ–‘‘మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడి నలుగురు యువకులు వారి జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు? అనే కథాంశంతో ఈ సినిమా ఉంటుంది. చెడు పరిణామాలను ఎత్తి చూపించి, ఆలోచన రేకెత్తించే పోలీస్ ఆఫీసర్‌గా ప్రకాష్ రాజ్ నటించారు. ప్రేక్షకులు మా సినిమాని ఆదరించాలి’’ అన్నారు.

యూత్‌ఫుల్ డ్రామా


కాల భైరవ

‘శాకుంతలం’ (2023) సినిమా తర్వాత దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించనున్న తాజా చిత్రం ‘యుఫోరియా’. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్‌పై నీలిమ గుణ ఈ సినిమాను నిర్మించనున్నారు. యూత్‌ఫుల్ సోషల్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజాగా ఈ సినిమాకు కాలభైరవ సంగీతం అందించనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. ‘‘యుఫోరియా’ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది.

సాక్షి
బిజినెస్
మంగళవారం
11-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
203	31
76,490	23,259

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,176	△	42
డోజోన్స్	38,733	▽	66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,228	▽	17
డాక్స్	18,495	▽	62
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,051	△	2
నికాయ్	39,038	△	354

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,176
బంగారం (99.5 స్వచ్ఛత)	70,891
వెండి (కిలో)	88,928

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.06	107.62
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.62	53.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.40	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

వికసిత భారత్ దిశగా సంస్కరణలు

మోదీ 3.0పై కార్పొరేట్ల ఆశాభావం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి ఏర్పడ్డ కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా తదుపరి సంస్కరణలను అమలు చేయగలదని కార్పొరేట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పలువురు కార్పొరేట్ దిగ్గజాలు ఎక్స్ వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మరింత పురోగతి



వరుసగా మూడోసారి భారత ప్రధానిగా ఎన్నికైన నరేంద్ర మోదీజీకి శుభాకాంక్షలు. మీ దార్శనిక సారథ్యంలో భారత్ అనేక మైలురాళ్లను అధిగమించింది. ఇకపైనా దేశం వృద్ధి బాటలో ముందుకు దూసుకెడుతుందని విశ్వసిస్తున్నాం.

– అనిల్ అగర్వాల్, ఛైర్మన్, వేదాంత గ్రూప్

దేశాభివృద్ధి కొనసాగుతుంది



నెహ్రూజీ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టిన మోదీ జీకి శుభాకాంక్షలు. కొత్త కేబినెట్ ఏర్పాటుతో దేశ అభివృద్ధి, పురోగతి కొనసాగగలదని ఆశిస్తున్నాను.

– సజ్జన్ జిందాల్, సీఎండీ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్

కీలక సమయం



భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సుకు ఈ విడత మరింత కీలకం కాగలదని ఆశిస్తున్నాను.

– ఆనంద్ మహీంద్రా, ఛైర్మన్, మహీంద్రా గ్రూప్

సంస్కరణల అమలు లక్ష్యం



అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు, ఆర్థిక వ్యవస్థ ఫండమెంటల్స్‌ను పటిష్టపర్చేందుకు మోదీ నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం తదుపరి విడత సంస్కరణలు అమలు చేయగలదని ఆశిస్తున్నాం.

– చంద్రజిత్ బెనర్జీ, డైరెక్టర్, సీఐఐ

లక్ష్యానికి పటిష్ట పునాదులు



ఎన్‌డీఏ వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడమనేది సంస్కరణల ఎజెండా కొనసాగింపునకు దోహదపడగలదు. ఆర్థిక, సామాజికాభివృద్ధికి తోడ్పడుతూ, వికసిత భారత్ లక్ష్యానికి గట్టి పునాదులు వేసే పురోగామి విధానాలు, చర్యలను కొత్త ప్రభుత్వం తీసుకోగలదని ఆశిస్తున్నాము.

– అనీష్ షా, ప్రెసిడెంట్, ఫిక్కీ

ఎకానమీ మరింత స్పీడ్



కీలక దేశాలకు మించి అత్యధిక వృద్ధి రేటును కొనసాగిస్తూ, దేశ నాయకత్వం భారత్‌ను కొత్త ఎత్తులకు తీసుకెళ్లగలదని కార్పొరేట్లు విశ్వసిస్తున్నారు.

– దీపక్ సూద్, సెక్రటరీ జనరల్, అసోచాం

కఠిన సంస్కరణలకు సవాళ్లు: యూబీఎస్



న్యూఢిల్లీ: స్థూల, **వ్యవసాయ, డిజిన్వెస్ట్‌మెంట్, యూనిఫాం సివిల్ కోడ్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ తది**తర కఠిన సంస్కరణలను అమలు చేయగలిగితే భారత వృద్ధి రేటు ప్రస్తుతం అంచనా వేస్తున్న 6.5–7 శాతం కన్నా అధికంగా 7.5 శాతం పైగా ఉండగలదని స్విస్ బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ అభిప్రాయపడింది. అయితే, కేంద్రంలో కొత్తగా ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం.. మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉన్నందున 2014, 2019తో పోలిస్తే వీటి అమల్లో సవాళ్లు ఎదురుకావొచ్చని అంచనా వేసింది. తయారీ రంగానికి తోడ్పాటునిచ్చే చర్యలు, నైపుణ్యాల అభివృద్ధి, గతంలో ఆమోదించిన కార్మిక చట్టాలను వచ్చే 12–18 నెలల్లో అమలు చేయడం మొదలైన వాటిపైనే ప్రభుత్వం ప్రస్తుతానికి దృష్టి పెట్టే అవకాశం ఉందని యూబీఎస్ ఇండియా చీఫ్ ఎకనమిస్ట్ తన్వి గుప్తా జైన్ పేర్కొన్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో విధానపరంగా చేసే కీలక ప్రకటనలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని ఆమె వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-6-2024	
విశాఖ	530–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

77,000 స్థాయి తాకి.. వెనక్కి



ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డుల నమోదు ● నష్టాలతో ముగిసిన స్టాక్ సూచీలు

ముంబై: సరికొత్త రికార్డుల వద్ద ఐటీ, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలతో ముగిశాయి. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారంతో ఉదయం ప్రారంభంలోనే సూచీలు జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 386 పాయింట్లు పెరిగి 77,000 స్థాయిపై 77,079 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 23,412 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. తదుపరి ఐటీ, ఫైనాన్స్ మెటల్, ఇంధన షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 203 పాయింట్లు పతనమై 76,490 వద్ద, నిఫ్టీ 31 పాయింట్లు నష్టపోయి 23,259 వద్ద నిలిచాయి. సర్వీసెస్, రియల్టీ, కమొడిటీస్, యుటిలిటీస్, హెల్త్‌కేర్, పారిశ్రామికోత్పత్తి రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 1.04%, 0.56% చొప్పున రాణించాయి.



క్రోనాక్స్ ల్యాబ్ సైన్సెస్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.136)తో పోలిస్తే 21% ప్రీమియంతో రూ.165 వద్ద లిస్టయ్యింది. ఆఖరికి 17% లాభంతో రూ.159 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.591.25 కోట్లుగా నమోదైంది.

డీప్‌ఫేక్ వీడియోలను నమ్మొద్దు: ఎన్‌ఎస్‌ఈ

కాగా, డీప్‌ఫేక్ వీడియోల పట్ల జాగ్రత్త వహించాలంటూ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఎన్‌ఎస్‌ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ పెట్టుబడులకు సంబంధించి సలహాలిస్తున్నట్లు వైరల్ అవుతున్న నకిలీ వీడియోల నేపథ్యంలో ఎక్స్ఛేంజీ ఈ హెచ్చరిక జారీ చేసింది.

మేలో ఈక్విటీ ఎంఎఫ్‌ల రికార్డ్

మే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు)కు ఇన్వెస్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ మే నెలలో రూ. 34,697 కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 83 శాతం అధికం. సిప్‌కు సైతం రూ. 20,904 కోట్ల పెట్టుబడులు లభించినట్లు యంఫీ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో మహీంద్రా రోటావేటర్లకు డిమాండ్



హైదరాబాద్: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరి, గోధుమ దిగుబడి గణనీయంగా ఉండగలదని అంచనాలు ఉన్నాయని మహీంద్రా ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్ తెలిపింది. ఈ నేపథ్యంలో తమ రోటావేటర్లకు డిమాండ్ పెరుగుతోందని, దానికి అనుగుణంగా సరఫరా కోసం కసరత్తు చేస్తున్నామని సంస్థ వివరించింది. హెవీ సెగ్మెంట్ (మహావేటర్ సిరీస్) నుంచి తేలికపాటి సెగ్మెంట్ (జైరోవేటర్ సిరీస్, ప్యాడీవేటర్ సిరీస్) వరకు, అలాగే చిన్న ట్రాక్టర్ల ఓనర్ల కోసం మినీవేటర్ సిరీస్‌లలో రోటావేటర్లను విక్రయిస్తున్నట్లు పేర్కొంది. వేరియంట్‌ను బట్టి 100 శాతం వరకు రుణ స్కీమ్‌లను మహీంద్రా ఫైనాన్స్ అందిస్తున్నట్లు వివరించింది. మిగతా సంస్థలు ఆరు నెలలే వారంటీ ఇస్తుండగా తాము ఏడాది నుంచి రెండేళ్ల వరకు వారంటీ ఇస్తున్నట్లు పేర్కొంది.

వాహన పరిశ్రమ నెమ్మది

మే నెల అమ్మకాల్లో 5.28% క్షీణత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎండల తీవ్రత.. మరోవైపు ఎన్నికలు. వెరసి దేశవ్యాప్తంగా మే నెలలో వాహన పరిశ్రమపై ఈ రెండు అంశాలు ప్రభావం చూపాయి. షోరూంలకు వచ్చే కస్టమర్ల సంఖ్య గత నెలలో 18 శాతం తగ్గినట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఏడీఏ) వెల్లడించింది. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే అన్ని విభాగాల్లో కలిపి అమ్మకాలు మే నెలలో 5.28 శాతం క్షీణించాయి. 2023 మే నెలతో పోలిస్తే గత నెల విక్రయాల్లో 2.61% వృద్ధి నమోదైంది. మే నెలలో మొత్తం 20,89,603 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే గత నెలలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు 6.61% తగ్గి 15,34,856 యూనిట్లకు చేరాయి.

ఎంఫసిస్‌లో ప్రమోటర్ వాటా విక్రయం


● 15 శాతం వాటా అమ్మిన బ్లాక్‌స్టోన్
● డీల్ విలువ రూ. 6,736 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ, కన్సల్టింగ్ సేవల కంపెనీ ఎంఫసిస్‌లో ప్రమోటర్ సంస్థ బ్లాక్‌స్టోన్ తాజాగా 15.08 శాతం వాటాను విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం ఈ వాటాను దాదాపు రూ. 6,736 కోట్లకు అమ్మివేసింది. బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 2,363.37 సగటు ధరలో బ్లాక్‌స్టోన్ 2.85 కోట్ల షేర్లను విక్రయించింది. అనుబంధ సంస్థ బీసీపీ టాప్కో 9 పీటీఈ వాటా విక్రయాన్ని చేపట్టింది. ఇది ఈ ఏడాదిలో నమోదైన రెండో అతిపెద్ద బ్లాక్‌డీల్‌గా నిలిచింది. దీంతో ఎంఫసిస్‌లో బ్లాక్‌స్టోన్ వాటా 55.45 శాతం నుంచి 40.37 శాతానికి క్షీణించింది. అయినప్పటికీ ఎంఫసిస్‌లో బ్లాక్‌స్టోన్ అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. కొటక్ మహీంద్రా ఎంఎఫ్, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్ పీటీఈ, సొసైటీ జనరాలి ఉమ్మడిగా ఎంఫసిస్‌లో 80.32 లక్షల షేర్లను కొనుగోలు చేశాయి. షేరుకి రూ. 2,363 సగటు ధరలో వీటిని రూ. 1,898 కోట్లకు సొంతం చేసుకున్నాయి. కాగా.. ఇంతక్రితం డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీలో బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బాట్) 3.5% వాటాను రూ. 17,485 కోట్లకు విక్రయించింది. ఇది అతిపెద్ద బ్లాక్‌డీల్‌గా నమోదైంది. 2016 ఏప్రిల్‌లో హ్యూలెట్ ప్యాకార్డ్ ఎంటర్‌ప్రైజ్ నుంచి 60.5 శాతం వాటాను బ్లాక్‌స్టోన్ చేజిక్కించుకున్న విషయం విదితమే.

ఎంఫసిస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3% క్షీణించి రూ. 2,398 వద్ద ముగిసింది.

వివో మేడిన్ ఇండియా ఎక్స్ ఫోల్డ్3 ప్రో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ బ్రాండ్ వివో తాజాగా మేడిన్ ఇండియా ఎక్స్ ఫోల్డ్3 ప్రో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఫోల్డబుల్ విభాగంలో అధిక సామర్థ్యంతో 5700 ఎంఏహెచ్ బ్యాటరీతో మార్కెట్లోకి వచ్చిన తొలి ఫోన్ ఇదేనని కంపెనీ తెలిపింది. 16 జీబీ ర్యామ్, 512 జీబీ ఇంటర్నల్ మెమరీ, 2కె ఇమ్మెర్సివ్ డిస్‌ప్లే, 8.03 అంగుళాల మెయిన్ స్క్రీన్, 6.53 అంగుళాల కవర్ స్క్రీన్, జైస్ తయారీ 50+50+64 ఎంపీ కెమెరా, 32+32 ఎంపీ ఫ్రంట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 3, ఫన్‌టచ్ ఓఎస్ 14, మైక్రో క్రిస్టల్ గ్లాస్‌తో తయారైన అర్మర్ గ్లాస్, 1.12 సెంటీమీటర్ల మందం వంటి హంగులు ఉన్నాయి. ధర రూ.1,59,999 ఉంది.

పేటీఎంలో ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీ వన్ 97 కమ్యూనికేషన్స్ మరోమారు ఉద్యోగుల్లో కోత విధించింది. వీరికి ఔట్‌ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందిస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రెజ్యూమే రూపకల్పనకు సాయం చేయడంతోపాటు ఇంటర్వ్యూకు సన్నద్ధం చేయడం, మెళకువలు నేర్పడం, మార్కెట్లో ఉన్న ఉద్యోగావకాశాలను తెలియజేయడం వంటివి ఔట్‌ప్లేస్‌మెంట్ సపోర్ట్ అంటారు. తీసివేతకు గురైన సిబ్బందికి సాయం చేసేందుకు.. మార్కెట్లో నియామకాలు చేపడుతున్న 30 కంపెనీలతో పేటీఎం మానవ వనరుల విభాగం చేతులు కలిపింది. కాగా, ఎంత మందిని తొలగించిందీ అన్న విషయం మాత్రం వన్97 కమ్యూనికేషన్స్ వెల్లడించలేదు.

భవిత

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 52వ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సులో ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ.. జనవరి 2025లో ప్రారంభమయ్యే 52వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 90
» **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్) ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హతతోపాటు జేఈఈ(మెయిన్స్) 2024లో ర్యాంకు సాధించాలి.
» **వయసు:** 16.5 నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **కోర్సు, శిక్షణ:** మొత్తం ఐదేళ్ల కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తారు. ఇందులో ఏడాది పాటు బేసిక్ మిలిటరీ ట్రెనింగ్, నాలుగేళ్లు టెక్నికల్ ట్రెనింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్)డిగ్రీ అందజేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.06.2024
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

ఐజీసీఏఆర్, కల్పక్కంలో 91 పోస్టులు

కల్పక్కం(తమిళనాడు)లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్‌రీసెర్చ్(ఐజీసీఏఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలోని వివిధ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 91
» **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ ఆఫీసర్-ఈ/డీ/సీ-34, టెక్నికల్ ఆఫీస్-బి-01, సైంటిఫిక్ అసిస్టెంట్-సి/బి-12, నర్స్-ఎ-27, ఫార్మసిస్ట్ బి-14, టెక్నీషియన్ బి-03.
» **విభాగాలు:** జనరల్ సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, డెంటల్ ప్రోస్టోడోంటిక్స్, అనెస్థీషియా, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, రేడియాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, న్యూక్లియర్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హ్యూమన్/మెడికల్ జెనెటిస్ట్, జనరల్ డ్యూటీ/క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపీ, మెడికల్ సోషల్ వర్కర్, పాథాలజీ, రేడియోగ్రఫీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్, ఆర్థోపెడిక్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్.
» **వయసు:** సైంటిఫిక్ ఆఫీసర్/ఈ పోస్టుకు 50ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/డి-40 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/సి-35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్/సైంటిఫిక్ అసిస్టెంట్/నర్స్/సైంటిఫిక్ అసిస్టెంట్-30 ఏళ్లు, ఫార్మసిస్ట్/టెక్నీషియన్-25ఏళ్లు మించకూడదు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2024
» **వెబ్‌సైట్:** https://www.igcar.gov.in

పీజేటీఎస్‌ఏ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ(పీజేటీఎస్‌ఏయూ).. 2024–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు-సీట్ల వివరాలు

» డిప్లొమా ఇన్ అగ్రికల్చర్(రెండేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–630 సీట్లు.
» డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్(రెండేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–60 సీట్లు.
» డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్(మూడేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–110 సీట్లు.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పాలిసెట్-2024లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** తెలంగాణ రాష్ట్ర పాలిసెట్-2024లో అగ్రికల్చర్ స్ట్రీమ్ కింద పొందిన ర్యాంకులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.06.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.06.2024.
» **వెబ్‌సైట్:** https://diploma.pjtsau.ac.in

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, హైదరాబాద్‌లో 20 పోస్టులు

హైదరాబాద్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 20
» **పోస్టుల వివరాలు:** సీఎంఎం ఇంజనీర్-04, మిడిల్ స్పెషలిస్ట్-08, జూనియర్ స్పెషలిస్ట్-08.
» **అర్హత:** టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో డిగ్రీ/తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** సీఎంఎం ఇంజనీర్ పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్‌కు రూ.50,000, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.40,000.
» **వయసు:** సీఎంఎం ఇంజనీర్ పోస్టుకు 45 ఏళ్లు, మిడిల్ స్పెషలిస్ట్‌కు 40 ఏళ్లు, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **రాతపరీక్ష తేది:** 23.06.2024.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

బీఎస్‌ఎఫ్‌లో 162 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంశాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్).. ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ గ్రూప్-బి, సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 162
» **పోస్టుల వివరాలు:** ఎస్ఐ(మాస్టర్)–07, ఎస్ఐ(ఇంజిన్ డ్రైవర్)–04, హెడ్ కానిస్టేబుల్(మాస్టర్)–35, హెడ్ కానిస్టేబుల్(ఇంజిన్ డ్రైవర్)–57, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెకానిక్) (డీజిల్/పెట్రోల్ ఇంజిన్)–03, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఎలక్ట్రీషియన్)–02, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఏసీ టెక్నీషియన్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఎలక్ట్రానిక్స్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (మెషినిస్ట్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (కార్పెంటర్)–03, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ప్లంబర్)–02, కానిస్టేబుల్(క్రూ)–46.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్,10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, ఇంజిన్ డ్రైవర్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి ఎస్ఐ(మాస్టర్), ఎస్ఐ(ఇంజిన్ డ్రైవర్) పోస్టులకు 22 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. హెచ్‌సీ(మాస్టర్), హెచ్‌సీ(ఇంజిన్ డ్రైవర్), హెచ్‌సీ(వర్క్‌షాప్), కానిస్టేబుల్(క్రూ) పోస్టులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400–రూ.1,12,400, హెచ్‌సీ పోస్టులకు రూ.25,500–రూ.81,100, కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700–రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. బీఎస్‌ఎఫ్ వాటర్ వింగ్ డైరెక్ట్ ఎంట్రీ ఎగ్జామ్-2024 ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.07.2024
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఐఐటీలకు దీటైన ఇన్‌స్టిట్యూట్స్!

» అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ఎన్నో ప్రత్యామ్నాయాలు
» ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అవకాశం



ఇంజనీరింగ్ స్పెషల్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ.. కటాఫ్ పర్సంటైల్, పరిమిత సీట్లు, ఇతర నిబంధనల కారణంగా అడ్మిషన్ లభించని విద్యార్థులు నిరాశ చెందక్కర్లేదు. ఎందుకంటే.. అడ్వాన్స్‌డ్ స్కోర్‌తోనే దేశంలో మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్.. బీఎస్, బీటెక్‌ల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే.. ఐఐటీలకు దీటైన అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో.. ప్రస్తుతం దేశంలో ఐఐటీలకు దీటుగా నిలుస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్స్, అవి అందించే కోర్సులు తదితర వివరాలు..

సైన్స్ పరిశోధనలకు కింగ్.. ఐఐఎస్‌సీ

సైన్స్ బోధన, పరిశోధనలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సంస్థ.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ), బెంగళూరు. అంతర్జాతీయ సర్వేల్లో టాప్‌లో నిలిచే ఇన్‌స్టిట్యూట్ ఇది. సైన్స్ రంగంలో కెరీర్ కోరుకునే విద్యార్థులకు చక్కటి వేదిక.. ఐఐఎస్‌సీ. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (రీసెర్చ్) కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు బయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను మేజర్‌గా ఎంచుకుని రీసెర్చ్ చేయొచ్చు. ఈ కోర్సులో మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో జేఈఈ మెయిన్/జేఈఈ అడ్వాన్స్‌డ్/ఐఐఎస్ఈఆర్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. జేఈఈ ర్యాంకర్లతోపాటు నీట్-యూజీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి. ఐఐఎస్‌సీ బెంగళూరులో బీఎస్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు ఖరారవుతున్నాయి. ఐటీ మొదలు మాన్యుఫ్యాక్చరింగ్ వరకూ.. పలు విభాగాలకు చెందిన సంస్థలు ఆఫర్లు అందిస్తున్నాయి.

▪ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://bsug.iisc.ac.in/news.html

ఐఐఎస్‌టీ కోర్సు.. ఇస్రోలో సైంటిస్ట్!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుతో ప్రవేశం కల్పించే మరో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ). కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థలో గ్రాడ్యుయేషన్ స్థాయిలో నాలుగేళ్ల వ్యవధిలోని బీటెక్, అయిదేళ్ల వ్యవధిలోని బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) బ్రాంచ్‌లను అందిస్తున్నారు. బీటెక్‌లో ఒక్కో బ్రాంచ్‌లో 75 సీట్లు చొప్పున, బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీలో 24 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉన్నత అవకాశాలు

ఐఐఎస్‌టీలో బీటెక్, డ్యూయల్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి ఇస్రోలోనే సైంటిస్ట్/ ఇంజనీర్‌గా కొలువులు ఖరారు చేస్తారు. వీరు కనీసం 7.5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. వీరికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

ఐఐఎస్‌టీలో ప్రవేశాలకు ప్రత్యేక దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. 2024కు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జూన్ 3 నుంచి ప్రారంభమైంది. దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 14. సీట్ల కేటాయింపును జూన్ 17న ప్రకటిస్తారు.

▪ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.iist.ac.in/admissions/undergraduate

ఆర్‌జీఐపీటీ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులకు మరో ప్రత్యామ్నాయ ఇన్‌స్టిట్యూట్.. రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ). పెట్రోలియం రంగంలోని పలు ప్రముఖ సంస్థల సహభాగస్వామ్యంతో అమేథీలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తింపు ఉంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రస్తుతం నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌లు, అదే విధంగా ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఇన్‌స్టిట్యూట్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరితేదీ జూలై 7.

▪ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rgipt.ac.in

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ

పెట్రోలియం రంగంలో నిపుణులైన మానవ వనరుల కొరతను తీర్చేందుకు, పరిశోధనలు చేసేందుకు ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ). 2016లో విశాఖపట్నంలో నెలకొల్పిన ఈ విద్యాసంస్థకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తింపు లభించింది. ప్రస్తుతం బీటెక్-పెట్రోలియం ఇంజనీరింగ్, బీటెక్-కెమికల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. ఐఐపీఈలో బీటెక్ పెట్రోలియం ఇంజనీరింగ్ 60 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్ 60 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా.. ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 7. ఐఐపీఈలోని బీటెక్ కోర్సులను పూర్తి చేసుకుంటే.. పెట్రోలియం రంగంలోని హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్, గెయిల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ, అరబిందో ఫార్మా, యాక్సెంచర్ వంటి సంస్థల్లో ఆఫర్లు పొందే అవకాశముంది.

▪ పూర్తి వివరాలకు వెబ్‌సైట్:https://iipe.ac.in

ఐఐఎస్ఈఆర్ (ఐసర్)

సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో మంచి గుర్తింపు ఉన్న మరో జాతీయ స్థాయి విద్యాసంస్థ.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)! బేసిక్ సైన్స్ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించి మెరికల్లా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పింది. ఐఐఎస్ఈఆర్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు క్యాంపస్‌ల్లో(బరంపూర్, భోపాల్, కోల్‌కత, పుణె, తిరువనంతపురం, మొహాలి, తిరుపతి) అయిదేళ్ల బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీలో ప్రవేశం కల్పిస్తున్నాయి. అదే విధంగా ఐఐఎస్ఈఆర్ భోపాల్ క్యాంపస్‌లో నాలుగేళ్ల వ్యవధిలో బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. బీఎస్-ఎంఎస్ కోర్సుకు సంబంధించి మొత్తం ఏడు క్యాంపస్‌లలో కలిపి 1741 సీట్లు ఉన్నాయి. ఐఐఎస్ఈఆర్ భోపాల్ క్యాంపస్‌లో బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో 73 సీట్లు, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్‌లో 42 సీట్లు ఉన్నాయి.

త్వరలో దరఖాస్తు ప్రక్రియ

ఈ కోర్సులకు సంబంధించి గతేడాది వరకూ జేఈఈ అడ్వాన్స్‌డ్ తదితర విధానాల్లో ప్రవేశం కల్పించారు. కాని ఈ ఏడాది(2024) నుంచి స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్స్ ఛానల్ (ఎస్‌సీబీ) పేరుతో.. ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకంగా నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశం కల్పించనున్నట్లు ఇటీవల ప్రకటించారు.

▪ వెబ్‌సైట్: www.iiserpune.ac.in/education/admissions



కురుల కొమురయ్య!

ఓదెల (పెద్దపల్లి): సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండలం చిన్నకిష్టపురం గ్రామానికి చెందిన తామల్ల కొమురయ్య శ్రీమల్లికార్జున స్వామికి వీరభక్తుడు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెలలోని శ్రీమల్లికార్జునస్వామిని ఆయన దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా 8 అడుగుల పొడవైన ఆయన కురులను చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. కొము రయ్య దాదాపు 40 ఏళ్ల నుంచి జుట్టు పెంచుకుంటున్నాడు. తన 20వ ఏట తలవెంట్రుకలు పెంచడం ప్రారంభించాడు. తన ఎత్తు కన్నా పొడవైన జుట్టు ఉండటంతో తలపై రుమాలుగా చుట్టుకుని వచ్చాడు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా కుటుంబసభ్యులతో కలిసి వచ్చి మల్లికార్జునస్వామికి పట్నాలు వేశాడు. బోనాలతో నైవేద్యం చెల్లించాడు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ, తనకు దేవుడు ప్రత్యక్షంగా కనిపించాక కురులు తీస్తానని అన్నాడు.

బీఓబీతో అగ్నిమాపక శాఖ ఎంఓయూ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల ప్రయోజనాలు, ప్రమాద బీమా కవరేజీ తదితర అంశాలపై బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)తో అగ్నిమాపక శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి, బీఓబీ హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్‌లు సోమవారం ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా శాఖ సిబ్బంది, పెన్షనర్లకు మెరుగైన ఉచిత సమగ్ర వ్యక్తిగత ప్రమాద బీమా కవర్ (పీఏఐ.), యోధా రిటైల్ రుణాలపై ప్రత్యేక ఆఫర్లు, డెబిట్, క్రెడిట్ కార్డ్‌లతో సహా అనేక ఇతర ప్రయోజనాలు అందనున్నాయి. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.30 కోట్ల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా (డెత్ కవరేజీ), రూ.1.26 కోట్ల వరకు ఆఫ్ డ్యూటీ ప్రయోజనాలు లభించనున్నాయి. శాశ్వత వైకల్యం కవరేజీ రూ.80 లక్షల వరకు లభిస్తుంది. ఈ ఒప్పందంపై బీఓబీ జోనల్ హెడ్ రితేష్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

రైతు ఆత్మహత్యలు తగ్గాయి..

వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ రాధాకృష్ణన్



స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్, ఇన్‌చార్జ్ వీసీ రఘునందన్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: నరేంద్రమోదీ పాలనలో దేశంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయని గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆరో స్నాతకోత్సవం సోమవారం రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో గవర్నర్ రాధాకృష్ణన్ అధ్యక్షతన జరిగింది. దేశానికి వ్యవసాయ రంగం కీలకమని, మానవ సమాజం మనుగడకు వ్యవసాయమే ప్రధాన ఆధారం అని ఆయన వర్ణించారు. అత్యధిక జనాభా కలిగిన భారతదేశం తన అవసరాల కోసం వ్యవసాయ దిగుమతులపై ఆధారపడే స్థితిలో లేదని వివరించారు. రైతులు పరిశోధన, ప్రయోగ ఫలితాలని ప్రత్యక్షంగా చూస్తేనే వాటిని స్వీకరిస్తారని... శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. నీటి సమర్థ యాజమాన్యం, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ సూచించారు. వ్యవసాయానికి కీలకం విత్తనం అనీ... వర్సిటీ మెరుగైన వంగడాల్ని రైతాంగానికి అందిస్తుండడం హర్షదాయకమని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచి ఉద్యోగ దశలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసం, అంకితభావంతో ముందుకెళ్లాలని... జీవితంలో ఒడిదుడుకులు సహజమని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎస్‌బీఐ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తాను ఈ వ్యవసాయ కళాశాలలోనే చదివానని... తానీనాడు ఈ స్థానంలో ఉన్నందుకు గర్విస్తున్నానన్నారు. దేశ జనాభాలో 45–46 శాతం వ్యవసాయరంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడినా దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 17–18 శాతమేనని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ రఘునందన్‌రావు విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా 587 మందికి అండర్ గ్రాడ్యుయేట్ పట్టాల్ని, 165 మందికి పీహెచ్‌డీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టాల్ని అందించారు. 11 మంది పీజీ విద్యార్థులు 12 బంగారు పతకాల్ని, 8 మంది యూజీ విద్యార్థులు 19 బంగారు పతకాలను సాధించారు. వీరిని గవర్నర్ అభినందించారు. బజ్జూరి దివ్య, వెలిదాల సాయి ప్రత్యూషలు చెరో ఆరు బంగారు పతకాల్ని సాధించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, వర్సిటీ అధికారులు, బోర్డు సభ్యులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఖర్చు తగ్గించడానికి కృషి చేస్తా



రైతులు పంటల సాగుకు చేస్తున్న ఖర్చులు తగ్గించ డానికి కృషి చేస్తా. నేను కుడా వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. పంట దిగుబడి వచ్చినా లాభాలు రావ డం లేదు. వాతావరణంలో వస్తున్న మార్పులతోనూ రైతులు భారీగా నష్టపోతున్నారు.

– ఆర్.శివకుమార్ పీహెచ్‌డీ(అగ్రికల్చర్)

న్యూట్రిషన్ ఫుడ్ గురించి అందరికీ తెలియాలి



రైతులు వారి కుటుంబసభ్యులకు న్యూట్రిషన్ ఫుడ్ గురించి తెలియదు. వారిని ఈ రంగంలోకి తీసుకొచ్చి వ్యాపారులుగా మార్చాలి. అప్పుడే రైతు కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి.

– వెల్‌చర్ల సాయిప్రత్యూష, పీహెచ్‌డీ (న్యూట్రిషన్‌ఫుడ్) గోల్డ్‌మెడలిస్ట్

రైతులకు పౌష్టికాహారం అందించాలి



రైతు కుటుంబాలకు చెందిన వారు రాత్రి పగలు కష్టపడి చేస్తారు. కానీవారు పౌష్టికాహారం తీసు కోరు. దీనిపై వారికి అవగాహన కల్పించాలి. పండించిన దాంట్లో నుంచే వారికి మంచి ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నాం.

– యశస్విని, ఎంఎస్సీ, పీహెచ్‌డీ(గోల్డ్ మెడలిస్ట్)

శ్రీనివాస్ రాక్.. పోలీసులు షాక్

చనిపోయాడని వెళ్తే.. లేచి మాట్లాడాడు.. ఆశ్చర్యానికి గురైన పోలీసులు





హసన్‌పర్తి: చనిపోయాడనుకున్న వ్యక్తి ఒక్కసారిగా లేచి మాట్లాడితే.. ఆ షాక్ ఎలా ఉంటుందో ఊహించుకోండి. అలాంటి ఘటనే వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. కుంటలో ఓ మృతదేహం తేలియాడుతున్నదన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన పోలీసులు.. ఆ వ్యక్తిని బయటికి లాగుతుండగా సదరు వ్యక్తి లేచి మాట్లాడడం చూసి షాక్‌కు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లా కావలికి చెందిన శ్రీనివాస్ కాజీపేటలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్నాడు. అతనితో పాటు మరో ఇద్దరు సోమవారం చిత్తుగా మద్యం సేవించి నగరంలోని రెడ్డిపురంలోని కోవెలకుంటకు వెళ్లారు. అక్కడ కొంత సేపు కుంటలోకి దిగారు. మద్యం మత్తులో శ్రీనివాస్ కొంత ఒడ్డు మేరలో నిద్ర పోయాడు. శ్రీనివాస్ మృతి చెందినట్లుగా భావించిన వారు అక్కడినుంచి జారుకున్నారు. ఆ తర్వాత స్థానికులు ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్లు గమనించి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్‌తో పాటు కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుంట లోతుగా ఉన్నట్లు భావించిన పోలీసులు ఒకరిచేయి మరొకరు పట్టుకుని తేలియాడుతున్న ఆ వ్యక్తిని బయటికి లాగేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అతనే నేరుగా లేచి నిల్చున్నారు. దీంతో ఒక్కసారిగా అందరూ షాక్‌కు గురయ్యారు. బయటికి తీసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుంటలో చల్లదనానికి నిద్ర వచ్చినట్లు సదరు వ్యక్తి పోలీసులకు చెప్పాడు. తనకు రూ.50 ఇస్తే కాజీపేటకు వెళ్తానని చెప్పడంతో పోలీసులు అతనికి డబ్బులు ఇచ్చి పంపించి వేశారు.

‘విద్యుత్’పై విచారణ ముమ్మరం

- ప్రస్తుత, మాజీ అధికారుల ఎంక్వైరీ షురూ
- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు హాజరైన మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ సురేష్ చందా
- ఒప్పందాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదన్న ప్రభాకర్‌రావు
- నేడు హాజరుకానున్న ఎస్కే జోషి, అరవింద్‌కుమార్!

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ సంబంధిత నిర్ణయాలపై విచారణ ప్రక్రియను జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ముమ్మరం చేసింది. రాష్ట్ర ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సురేష్ చందా, తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు సోమవారం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు హాజరై తమ వాదనలను వినిపించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ కోసం జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ మూడింటికి సంబంధించిన నిర్ణయాల్లో భాగస్వామ్యం కలిగిన సుమారు 28 మంది మాజీ, ప్రస్తుత అధికారులకు గతంలోనే కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే అందరూ రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. అయితే అదనపు సమాచారం కోసం జస్టిస్ నరసింహారెడ్డి రోజూ కొందరు చొప్పున అధికారులను బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయానికి పిలిపించి విచారించే ప్రక్రియను ప్రారంభించారు.

నేనున్నప్పుడు ఒప్పందాలు జరగలేదు: సురేష్

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలకు సంబంధించిన నిర్ణయాల్లో ఎలాంటి తప్పులు, అక్రమాలు, అవినీతి చోటుచేసుకోలేదని సోమవారం విచారణకు హాజరైన డి.ప్రభాకర్‌రావు వివరించినట్టు తెలిసింది. ప్రభుత్వం–ప్రభుత్వ రంగ సంస్థల మధ్య ఈ ఒప్పందాలు జరిగాయని, వీటిలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని చెప్పినట్టు సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో ఉన్న తీవ్ర విద్యుత్ కొరతను అధిగమించడానికే ఈ ఒప్పందాలు జరిగాయని వివరించినట్టు తెలిసింది. కాగా ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు అంశం పరిశీలన దశలో ఉన్నప్పుడు స్వల్పకాలం పాటు మాత్రమే తాను రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశానని, తాను ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు జరగలేదని సురేష్ చందా చెప్పినట్టు తెలిసింది.

కమిషన్ గడువు పొడిగించే చాన్స్

మంగళవారం కమిషన్ రాష్ట్ర ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శులు ఎస్కే జోషి, అరవింద్‌కుమార్‌లను విచారించనున్నట్లు తెలిసింది. ఎస్కే జోషి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రిటైర్ కాగా, అరవింద్ కుమార్ ప్రస్తుతం విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. కమిషన్ జూన్ నెలాఖరులోగా విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉండగా, విచారణ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో నెల, రెండు నెలల పాటు గడువు పొడిగించే అవకాశం ఉంది.

గుజరాత్ చాలా కాస్ట్లీ?

ఈ మధ్యకాలంలో ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఇంటి అద్దె నుంచి ఫుడ్, ట్రావెలింగ్ దాకా అన్ని ఖర్చులూ ఎక్కువైపోయాయి. ఇది ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. బతకడానికి కొన్నిచోట్ల తక్కువగా, మరికొన్ని చోట్ల ఎక్కువగా ఖర్చులు ఉంటాయి. మరి మన దేశంలో ఏ రాష్ట్రంలో జీవన వ్యయం ఎక్కువో తెలుసా.. ఆ వివరాలేమిటో చూద్దామా. లివింగ్ కాస్ట్ వెబ్‌సైట్ దేశవ్యాప్తంగా డేటాను సేకరించి, క్రోడీకరించి.. మధ్యతరగతి కుటుంబాల నెలవారీ జీవన వ్యయాన్ని అంచనా వేసింది.

ఏ రాష్ట్రంలో సగటు జీవన వ్యయం ఎంత?

గుజరాత్	46,800
మహారాష్ట్ర	45,400
మిజోరం	43,500
కర్ణాటక	43,200
హరియాణా	39,800
గోవా	38,000
తెలంగాణ	37,700
పంజాబ్	36,500
మణిపూర్	33,000
త్రిపుర	32,400
తమిళనాడు	32,200
జమ్మూకశ్మీర్	32,200
ఉత్తరాఖండ్	31,300
అస్సాం	30,900
ఛత్తీస్‌గఢ్	30,700
ఆంధ్రప్రదేశ్	30,300
రాజస్తాన్	30,100
మేఘాలయ	30,100
కేరళ	29,900
ఉత్తరప్రదేశ్	29,900
పశ్చిమబెంగాల్	29,800
మధ్యప్రదేశ్	29,200
పుదుచ్చేరి	28,400
జార్ఖండ్	28,300
ఒడిశా	26,400
బిహార్	25,900
హిమాచల్	23,600

(జీవన వ్యయం రూపాయల్లో)

టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని రవీందర్‌రావు



సీఎం రేవంత్‌ను కలసిన రవీందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) చైర్మన్‌గా వరంగల్ డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీబీ చైర్మన్ కె.సత్తయ్య ఎన్నికయ్యారు. ఇప్పటివరకు టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి రాజీనామా చేయడంతో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారం, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచన మేరకు టెస్కాబ్ చైర్మన్‌గా రవీందర్‌రావును ఎన్నుకున్నట్లు వ్యవసాయశాఖ తెలిపింది. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డితో కలిసి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.